సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 337

గురువారం 27-2-2020

'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

గు'బేర్'!

కొనసాగుతున్న కోవిడ్ కల్లోలం... ఐదో రోజూ పతనమైన మార్కెట్లు - బిజినెస్‌లో

అందం అల్విదా చెప్పింది

టెన్నిస్‌కు వీడ్కోలు చెప్పిన రష్యా బ్యూటీ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

● అద్దె గర్భాల బిల్లు...

కేబినెట్ ఆమోదం

మహిళలు తమ ఇష్టంతో గర్భాశయాన్ని ఇతరులకు అద్దెకివ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈ మేరకు అద్దె గర్భం నియంత్రణ బిల్లు-2020పై జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. వితంతువులు, విడాకులు పొందిన వారూ ఇతరులకు తమ గర్భాన్ని అద్దెకు ఇవ్వొచ్చని బిల్లు స్పష్టం చేసింది.

- 5లో

● అధికారులకు సుప్రీం ఆదేశం...

విచారణకు రావాలి

1999 నాటి గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా జరిగిన నియామకాల్లో స్థానిక రిజర్వేషన్ల అమలు, ఇతర అంశాలపై 2015 ఫిబ్రవరి 2న తాము ఇచ్చిన తీర్పు అమలును విశదీకరించేందుకు ఈ అంశంతో సంబంధమున్న అధికారులను విచారణకు పంపాలని ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.



- 2లో

● ప్రార్థనా మందిరాలపై హైకోర్టు...

ప్రభుత్వం మౌనం వీడాలి

'మత స్వేచ్ఛ ముసుగులో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే ప్రభుత్వం చూస్తూ కూర్చోకూడదు. రాష్ట్రానికి మౌనం ఎంత మాత్రం తగదు. ప్రభుత్వం నిశ్శబ్దాన్ని వీడాలి. ప్రేక్షకపాత్ర పోషిస్తామంటే హైకోర్టు చూస్తూ కూర్చోదు' అని హైకోర్టు తీవ్రస్వరంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

- 13లో

● రౌడీషీటర్ దారుణహత్య...

ఓడించాడని చంపేశారు!

రాజకీయ కక్షలకు ఓ రౌడీషీటర్ బలయ్యాడు. పట్టపగలు అందరూ చూస్తుండగానే వెంటాడి నడిరోడ్డుపై కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన సిరిసిల్ల జిల్లా వేములవాడలో బుధవారం చోటుచేసుకుంది. దీంతో వేములవాడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

- 3లో

హస్తిన.. హైటెన్షన్

27 కి చేరిన ఢిల్లీ అల్లర్ల మృతుల సంఖ్య

నివురుగప్పిన నిప్పులా ఢిల్లీ
చెదురుమదురు ఘటనలు మినహా
బుధవారం పరిస్థితి ప్రశాంతం
సమస్యాత్మక ప్రాంతాల్లో దోవల్ పర్యటన
శాంతి, సౌభ్రాతృత్వం కోసం
ప్రధాని మోదీ పిలుపు

దుకాణాలు లూటీ చేయడంతో
వేరే ప్రాంతాలకు వలసపోతున్న ప్రజలు

5 లో

ఐబీ ఉద్యోగి మృతి

మురికి కాలువలో అంకిత్ మృతదేహం

వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి: ఢిల్లీ హైకోర్టు

షా రాజీనామా చేయాలి

సోనియాగాంధీ డిమాండ్

లోగుట్టు గిడ్డంగుల కెరుక!

- పీపీపీ విధానంలో నిర్మించిన గిడ్డంగులను ఏళ్లుగా ఖాళీగా పెట్టిన వైనం
- పెగ్ పథకం కింద 10 ఏళ్ల పాటు నిల్వలకు గ్యారంటీ ఇచ్చిన ఎఫ్‌సీఐ.. కుంటిసాకులు చూపి బియ్యం నిల్వ చేసేందుకు అధికారుల నిరాకరణ
- ప్రైవేటు గిడ్డంగుల్లో నాలుగింతలు అధిక అద్దెతో నిల్వలు
- గిడ్డంగులు నిర్మించి నష్టపోయిన పెట్టుబడిదారులు

- 4లో

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం నిరాల గ్రామ శివారులో కనిపించిన పులి

కవ్వాల్‌లో పులుల కదలికలు!

- తిప్పేశ్వర్ నుంచే వస్తున్నాయా?
- మహారాష్ట్ర టైగర్ రిజర్వు నుంచి తెలంగాణ టైగర్ రిజర్వు వైపు
- ఆదిలాబాద్ శివారులో పులి ప్రత్యక్షం.. భయాందోళనలో ప్రజలు

2 లో

నిధులు వస్తున్నాయ్!

■ గ్రామీణ స్థానిక సంస్థలకు శుభవార్త. నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్న మండల, జిల్లా పరిషత్‌లకు ఈ ఏడాది నుంచి మనుగడలోకి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల్లో కొంత మేర వాటా దక్కనుంది. 2015-20 వరకు అమల్లో ఉన్న 14వ ఆర్థిక సంఘం గ్రామ పంచాయతీలకే నేరుగా నిధులు బదలాయించేది. కేంద్ర సర్కారు తాజా నిర్ణయంతో మండల, జిల్లా పరిషత్‌లకు ఊరట కలగనుంది.

- వివరాలు 14లో

Tally
POWER OF SIMPLICITY

సమర్పిస్తున్నాము Tally.ERP 9 Release 6.6



మీ వ్యాపార సమాచారం
మీతో ఎక్కడైనా
మీకు మాత్రమే అందుబాటులో

ఇప్పుడు వెబ్ బ్రౌజర్‌లలో, టాలీ రిపోర్టులను సురక్షితంగా పొంది
మీ వ్యాపారాన్ని పెంచుకోండి

ఇది మీకు ఎలా ఉపయోగపడుతుంది?

- మీరు ఎక్కడ ఉన్నా, ఏ పరికరంలోనైనా ఎవరిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా టాలీ రిపోర్టులను పొందవచ్చు
- వేగంగా నిర్ణయం తీసుకోవడానికి ఉపయోగపడే డేటాని వేగంగా పొందవచ్చు
- మీ డేటా మీ వద్ద మాత్రమే ఉంటుందనే నమ్మకం. అది నిజమే !! మేము మీ డేటాలోని ఏ భాగాన్ని ఎక్కడా నిల్వ చేయము

Tally.ERP 9 Release 6.6 ఈ రోజే tallysolutions.com నుండి డౌన్‌లోడ్ చేసుకోండి!

మరింత తెలుసుకోవడానికి నన్ను స్కాన్ చేయండి

Call: 040 66882559 | help.tallysolutions.com

Women's Horlicks

నా బోన్స్ బలంగా
ఉండటం వల్ల
నేను బలంగా నిలబడగలను.
మరి మీరు?

30వ సంవత్సరం తరువాత, బోన్ డెన్సిటి తగ్గిపోవడం ఆరంభమై బలహీనమైన బోన్స్‌కు దారితీస్తుంది. దీని చిహ్నాలను మీరు మీ వీపు, తుంటి మరియు కీళ్లల్లో అనుభూతి చెందవచ్చు. అందుకే మీ బోన్స్‌కు కాల్షియం, విటమిన్ D మరియు విటమిన్ K2ల యొక్క రోజువారి న్యూట్రిషన్ అవసరం.

విమెన్స్ హార్లిక్స్‌తో మీ ప్రయాణాన్ని ఆరోగ్యవంతమైన బోన్స్ దిశగా ప్రారంభించండి.

కాల్షియం యొక్క 100% RDA*	విటమిన్ D యొక్క 100% RDA*	విటమిన్ K2 యొక్క 100% RDA*
శక్తివంతమైన బోన్స్ కోసం	కాల్షియం పీల్చుకోవడానికి	కాల్షియం బోన్స్‌కు అతుక్కోవడానికి

*ఎముకల ఆరోగ్యానికి విటమిన్ K (K2), కాల్షియం మరియు విటమిన్ D0 విలక్షణమైన కలయిక. *చక్కెర సుక్రోజ్‌ను సూచిస్తుంది. సహజంగా కలిగే చక్కెరలు కలిగి ఉంది. విమెన్స్ హార్లిక్స్ క్రమబద్ధమైన ఆహారంలో భాగంగా వినియోగించవల్సిన పోషకాల పానీయం. ఆల్కహాల్ పాలుపానీయం గలదు. పిల్లల కోసం సిఫారసు చేయబడలేదు. మహిళల పై ICMR 2010 మార్గదర్శకాల ప్రకారం 2 వడ్డనలలో (60 గ్రా).

బుధవారం ఢిల్లీలో జవదేకర్‌ను కలిసిన సీఎం కేసీఆర్

కేంద్రమంత్రి జవదేకర్‌తో కేసీఆర్ భేటీ

పర్యావరణ అనుమతులిచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పిన కేసీఆర్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, సమాచార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యేందుకు ఢిల్లీ వచ్చిన కేసీఆర్ బుధవారం జవదేకర్‌ను కలిశారు. రాష్ట్రంలోని పలు సాగునీరు, ఇతర ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను పరిష్కరించాల్సిందిగా కేంద్రమంత్రిని కోరారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని విన్నవించారు. ఫార్మాసిటీకి సంబంధించిన అంశం కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి. సీఎం కేసీఆర్ వెంట టీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

టీబీ రోగులను గుర్తించేందుకు క్యాంప్‌లు నిర్వహించండి

అధికారులకు గవర్నర్ తమిళిసై ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్న టీబీ రోగులు పూర్తిగా కోలుకునే విధంగా నాణ్యమైన మందులు, వైద్యం అందించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం రాజ్‌భవన్‌లో టీబీ కేసులపై రాష్ట్ర టీబీ కంట్రోల్ అధికారులతో తమిళిసై సమావేశం నిర్వహించారు. టీబీ కేసులు పెరగడానికి గల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు మార్చిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం రెడ్‌క్రాస్, ఇతర ప్రభుత్వశాఖల సహకారం తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వెనకబడిన ప్రాంతాలు, నైట్ షెల్టర్స్‌లో క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ టీబీ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ రాజేశం, హైదరాబాద్ డీఎంహెచ్‌వో వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

26న ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణ

- బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు నిర్ణయం
- మార్చి 13లోపు పంపాలని ప్రకటన

సాక్షి,హైదరాబాద్: జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్చి 26న హైదరాబాద్‌లో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారెవరైనా ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి గురైనా, వివక్షకు గురికాబడిన వారి నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొంది. బాధితులు రిజిస్టర్ పోస్టు లేదా ఈ మెయిల్/ ఫ్యాక్స్ ద్వారా వినతులు సమర్పించవచ్చని ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచించింది. ఫిర్యాదు చేయదలచిన వారు మార్చి 13వ తేదీలోపు **registrar-nhrc@nic.in, jrlawnhrc@nic.in**కి మెయిల్ చేయాలని 011-24651332, 34 నంబర్లకు ఫ్యాక్స్ చేయవచ్చన్నారు. రిజిస్టర్ పోస్టు చేయాలనుకున్నవారు టు రిజిస్ట్రార్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, మానవ్ అధికార్ భవన్ బ్లాక్, జీపీఓ కాంప్లెక్స్, ఐఎన్ఏ, న్యూఢిల్లీ, 110023 చిరునామాకు పంపాలని సూచించింది. ఫిర్యాదులను బహిరంగ విచారణ ద్వారా పూర్తిస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేస్తామని, విచారణ వేదికను త్వరలోనే వెల్లడించనున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది.

మహిళల భద్రతకు చర్యలు: పీఎంవో

సాక్షి, హైదరాబాద్: మహిళల భద్రత, వారిపై వేధింపుల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) తెలిపింది. దేశంలో మహిళా భద్రతకు తీసుకుంటున్న చర్యలు తెలపాలంటూ మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఇటీవల పీఎంవోకు లేఖరాశారు. దీనిపై స్పందించిన పీఎంఓ మరోలేఖలో సమాధానమిచ్చింది. మహిళల భద్రత కోసం దేశంలో పలు సేఫ్‌సిటీ ప్రాజెక్టులు అమలు చేస్తున్నామంది. పాత నేరస్తులను గుర్తించేందుకు నేషనల్ డేటాబేస్ ఆన్ సెక్సువల్ అఫెండర్స్ (ఎన్‌డీఎస్ఓ), క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్‌సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లను అమలుచేస్తున్నామని అధికారులు తెలిపారు. అంతేకాకుండా చిన్నారులు, మహిళలపై కేసుల విచారణకు 1,023 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను, చిన్నారులపై లైంగిక నేరాల విచారణకు 389 ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు ఇటీవల నిర్ణయం తీసుకున్నామని లేఖలో వివరించారు.

పలు రూట్లలో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రూట్లలో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్-కాకినాడ (07001/07002) స్పెషల్ ట్రైన్ ఈనెల 28వ తేదీ రాత్రి 8 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మార్చి 1వ తేదీ రాత్రి 8.50 గంటలకి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకి సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్-తిరుపతి (02764/02763) స్పెషల్ ట్రైన్ ఈ నెల 28వ తేదీ సాయంత్రం 7.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకి తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మార్చి 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ప్లేస్‌మెంట్లలో ఏపీ విద్యార్థుల సత్తా

చండీగఢ్ క్యాంపస్ నియామకాల్లో 64 మందికి ఆఫర్లు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు చండీగఢ్ యూనివర్సిటీ ప్రాంగణ నియామకాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పంజాబ్‌లోని చండీగఢ్ వర్సిటీలో జరిగిన ప్రాంగణ నియామకాలు-2020 ఫేజ్-1లో మొత్తం 4 వేల మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపిక కాగా.. వారిలో 64 మంది ఏపీ విద్యార్థులేనని యూనివర్సిటీ వీసీ ఆర్.ఎస్.బావా తెలిపారు. ఇందులోనూ 36 మంది విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ ఆఫర్లు అందుకున్నవారేనని తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థి గగన్ చాటు ఐబీఎం, కాగ్నిజెంట్, పెర్సిస్టెంట్, వర్క్సాసా సిస్టమ్స్ అనే నాలుగు కంపెనీల నుంచి, విశాఖపట్టణానికి చెందిన గొంటిన ఉదయ్ కుమార్‌కు విప్రో, కాగ్నిజెంట్, సార్టప్ ఫామ్ వంటి మూడు కంపెనీల నుంచి జాబ్ ఆఫర్లు వచ్చినట్లు వర్సిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

కవ్వాల్‌లో పులుల కదలికలు..!

తిప్పేశ్వర్ నుంచే వస్తున్నాయా..?

- మహారాష్ట్ర టైగర్ రిజర్వు నుంచి తెలంగాణ టైగర్ రిజర్వు వైపు అక్కడ పులుల సంఖ్య పెరగడం.. విస్తీర్ణం సరిపడకనే..
- అభయారణ్యం కావడంతో స్థిర నివాసం ఏర్పాటుకు అవకాశం
- ఆదిలాబాద్ శివారులో పులి ప్రత్యక్షం.. భయాందోళనలో ప్రజలు

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ శివారు మండలాల్లో పులుల సంచారం భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాంసి, భీంపూర్ మండలాల్లో కొద్దిరోజుల క్రితం ఆవులపై దాడి ఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే తాము పులిని చూశామని కొంత మంది చెబుతున్నప్పటికీ వాటికి సంబంధించిన ఆధారాలు దొరకలేదు. పులులు సంచరిస్తున్నాయని అటవీ శాఖాధికారులు కూడా అంగీకరిస్తున్నారు. కానీ.. వివరాలు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు. ప్రధానంగా పులి విషయంలో ఏదైనా మాట్లాడితే అటు పులులకు సురక్షితం కాదని, దీనికితోడు ప్రజలు భయాందోళనలకు గురవడంతోపాటు వాటిని చంపే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయంతోనే అధికారులు వివరాలు వెల్లడించేందుకు కూడా వెనుకంజ వేస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి 18 కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్ర సరిహద్దు ఉంటుంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ మీదుగా నాగపూర్ వెళ్లేందుకు 44వ జాతీయ రహదారికి ఇదే ప్రధాన మార్గం. పెన్‌గంగా నదీ ప్రాంతమే ఇటు తెలంగాణ, అటు మహారాష్ట్రకు సరిహద్దు. మహారాష్ట్ర వైపు యావత్మాల్ జిల్లా పాండర్‌కౌడ తాలూకా సమీపంలో తిప్పేశ్వర్ పులుల అభయారణ్యం ఉంది. ఈ అభయారణ్యం విస్తీర్ణం మించి పులుల సంఖ్య పెరిగాయంటున్నారు అటవీ శాఖాధికారులు. దీంతో అక్కడ ఉన్న పులులు వేరే ప్రాంతాలకు కదులుతున్నాయని చెబుతున్నారు. ప్రస్తు తం పెన్‌గంగాలో అం తగా నీటి ప్రవాహం లేదు. తిప్పేశ్వర్ నుంచి కదులుతున్న పులులు.. పెన్‌గంగా దాటుకుని ఆదిలాబాద్ జిల్లా మీదుగా వెళ్తుండటంతోనే ఇటీవల పులుల సంచారంపై కొన్ని మండలాల్లోని ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఆవాసాలు, పంట పొలాలు, రోడ్లు దాటుకుని వెళ్తున్నప్పుడు ప్రజల కంట పడుతున్నాయి. అయితే ప్రశాంత వాతావరణం కల్పించడం ద్వారా పులులు ఈ ప్రాంతం దాటి వెళ్లేలా అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తిప్పేశ్వర్‌తో పోల్చితే ఎన్నో రెట్లు విస్తీర్ణంలో పెద్దగా ఉన్న కవ్వాల్ పులులకు అనుకూల ప్రదేశమని అధికారులు చెబుతున్నారు. తిప్పేశ్వర్ టైగర్ రిజర్వు 148 చదరపు కిలోమీటర్లు ఉండగా.. ఒక పులికి 10 నుంచి 15 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఆవాసం ఏర్పర్చుకుంటుంది. దానికంటూ ఒక ఏరియా ఏర్పర్చుకుంటుంది. ఆడ, మగ పులుల కలయిక మినహాయిస్తే ఎక్కువ శాతం ఒంటరిగా తిరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం అక్కడ 18కి పైగా పులుల సంఖ్య ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆవాస విస్తీర్ణంలో పులులు ఎదురుపడితే ఘర్షణకు దిగుతాయి. దీంతోనే ప్రస్తుతం ఆ ప్రాంతం నుంచి పులుల కదలికలు మొదలై సురక్షిత ఆవాసం కోసం సంచరిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ, నేరడిగొండ, పెంబి, కడెం, ఖానాపూర్, జన్నారం, ఉట్నూర్, లక్సెట్టిపేట, తిర్యాణి ప్రాంతాల్లో దట్టమైన అడవి ఉంది. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులులు ఉండేందుకు పరిస్థితులు అనువుగా ఉన్నాయన్న అభిప్రాయం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. తిప్పేశ్వర్‌తో పోల్చితే కవ్వాల్ విస్తీర్ణం చాలా పెద్దది. ఇక్కడ 2 వేల చదరపు కిలోమీటర్లు విస్తరించింది. కవ్వాల్‌లో పులుల సంచారం కనిపిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు స్థిర నివాసం ఏర్పర్చుకున్నది లేదు. దీంతో అక్కడి నుంచి వచ్చే పులులు ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకునేందుకు అనువైన వాతావరణం ఉంది. తిప్పేశ్వర్ నుంచి కవ్వాల్‌కు అటవీ రహదారిలో వంద కిలోమీటర్ల దూరంలో ఉంటుందని చెబుతున్నారు. అక్కడి నుంచి కదిలే పులులు ఆవాసాలు, పంట పొలాలు, రోడ్లు దాటుతూ స్థిర ఆవాసం కోసం సంచరిస్తుండగా అటవీ అధికారులు వాటికి జనావాసాల ప్రాంతాల్లో ప్రశాంతత కల్పించడం ద్వారా సురక్షితంగా ఆ ప్రదేశాన్ని దాటుకుని వెళ్తుందని సూచిస్తున్నారు. ఆదిలాబాద్‌లో పులుల కదలిక విషయంలో జిల్లా అటవీ శాఖాధికారి ప్రభాకర్‌ను వివరణ కోరగా.. పులి రోడ్డు దాటినట్లు తమ దృష్టికి వచ్చిందని, అయితే ప్రజలు భయాం దోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆ ప్రాంతాల్లో తమ సిబ్బంది భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



పులిని చూశా..

మాది ఆదిలాబాద్ జిల్లా బేల మండలం అవాల్‌పూర్. ఆదిలాబాద్‌లో నివాసం. మంగళవారం బేల మార్కెట్ యార్డుకు కందులు విక్రయించేందుకు వెళ్లా. అదేరాత్రి అవాల్‌పూర్ మీదుగా ఆదిలాబాద్‌కు కారులో వస్తున్నా. మార్గమధ్యంలో రాత్రి 10.40 గంటల సమయంలో జైనథ్ మండలం నిరాల శివారు పెన్‌గంగ కెనాల్ డెయిరీఫాం మధ్యకు రాగానే.. అంతర్ రాష్ట్ర రోడ్డు దాటుతూ పులి కనిపించింది. ముందుగా ఆవు అనుకుని కారును నెమ్మది చేశాను. తర్వాత పులి అని గుర్తించాను. కారులో ఉన్నాను కాబట్టి భయం అనిపించలేదు. సెల్‌లో ఫొటోలు తీశా. నిరాల గ్రామంలో రోడ్డుపై ఉన్న కొంత మందికి ఈ విషయం చెప్పి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి ఆదిలాబాద్ బయల్దేరి వెళ్లాను. – కె.అనిల్

సంధ్యారాణి తండ్రి చంద్రశేఖర్‌ను బూటు కాలుతో తన్నుతున్న ఓ కానిస్టేబుల్

విద్యార్థులపై పోలీసుల దాష్టీకం

- నారాయణ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యపై ఆందోళన
- మృతురాలి తండ్రిని కాలుతో తన్నిన కానిస్టేబుల్
- న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నేతల డిమాండ్
- పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత

పటాన్‌చెరు టౌన్: నారాయణ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బుధవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. విద్యార్థిని మృతదేహం చూపించాలని పట్టుబట్టారు. దీంతో విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించడం.. మృతురాలి తండ్రిని ఓ కానిస్టేబుల్ బూటు కాలుతో తన్నడంతో విద్యార్థులు తిరగబడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. దీంతో పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం వెలిమెలలోని నారాయణ బాలికల కళాశాలలో విద్యార్థిని సంధ్యారాణి (16) ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో బుధవారం మృతదేహంతో నారాయణ కళాశాల ఎదుట ధర్నా చేయాలని బాధిత కుటుంబీకుల బంధువులు, కొన్ని విద్యార్థి సంఘాలు విఫలయత్నం చేశాయి. మరోవైపు కొందరు యువకులు ఆస్పత్రిలోని మార్చురీ తలుపుల తాళాలు పగులగొట్టి సంధ్యారాణి మృతదేహాన్ని తీసుకుని బయటకు వచ్చారు. పోలీసులు వారిని అడ్డుకుని మృతదేహాన్ని మళ్లీ మార్చురీ గదిలోకి తీసుకువెళ్లారు. ఆ సమయంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఓ దశలో పోలీసులు రెచ్చిపోయి లాఠీచార్జీ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మృతురాలి బంధువులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు ఆమె చదివే కళాశాల హాస్టల్‌లో ఉండే గదిలో ఆమె చనిపోయిందని చెబుతున్న గదిని చూపిస్తామని తీసుకువెళ్లారు. యాజమాన్యంతో విద్యార్థిని బంధువుల మధ్య చర్చలకు అవకాశం కల్పించారు. మరో వైపు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆస్పత్రి పోస్టుమార్టం గది తలుపులు పగలగొట్టిన ఘటనలో విద్యార్థి సంఘం నాయకులపై కేసు నమోదు చేసినట్లు పటాన్‌చెరు సీఐ నరేశ్ తెలిపారు.

కానిస్టేబుల్ పై వేటు: ఇన్‌చార్జి ఎస్పీ

కానిస్టేబుల్ శ్రీధర్ మృతురాలి తండ్రితో దురుసుగా ప్రవర్తించడం పట్ల తమ శాఖ తరపున చింతిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్పీ చందనాదీప్తి అన్నారు. సదరు కానిస్టేబుల్‌ను ఏఆర్ హెడ్ క్వార్టర్ సంగారెడ్డికి అటాచ్ చేశామన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

సాంకేతిక విద్యలో మార్పులు అవసరం

- పారిశ్రామిక విధానానికి తగ్గట్టుగా బోధన జరగాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

సాక్షి, హైదరాబాద్: 'సాంకేతిక విద్యలో భారీ మార్పులు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం అమలవుతున్న విధానం ప్రయోజనకరంగా లేదు. బోధనా విధానం, సిబ్బంది నియామకం, పాఠ్యాంశం ఇలా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపడితేనే విద్యార్థులను తీర్చిదిద్దగలం'అని 'డ్రాఫ్ట్ పర్స్పెక్టివ్ ప్లాన్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ రౌండ్ టేబుల్'సమావేశంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఇంజనీరింగ్ విద్యలో చేపట్టాల్సిన మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు. పారిశ్రామిక విధానానికి అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యలో మార్పులు చేపట్టాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ మాట్లాడుతూ.. రాబోయే 3 నెలల్లో ఏడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని పాఠ్యాంశాలను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని యూట్యూబ్‌లో పొందుపరుస్తామని తెలిపారు.

ప్రయోగ పరీక్షలకు ప్రాధాన్యత పెరిగింది..

సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. సాంకేతిక విద్యా విధానంలో భారీ మార్పులు వచ్చాయని, ప్రయోగ పరీక్షలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. నానో టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ లాంటి కొత్త కోర్సులు వచ్చాయని తెలిపారు. కానీ ఇంజనీరింగ్ విద్యలో మాత్రం నాణ్యత ఆశాజనకంగా లేదన్నారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ బోధించేందుకు సరైన సిబ్బంది లేరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు మోహన్‌రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

ఆ అధికారులు విచారణకు రావాలి..

1999 గ్రూప్-2 నోటిఫికేషన్ వివాదంపై ఏపీ, తెలంగాణకు సుప్రీంకోర్టు ఆదేశాలు

- సంబంధిత అధికారులు అన్నీ విశదీకరించాలి
- గత ఆదేశాల అమలుపై అఫిడవిట్లతో సిద్ధంగా ఉండాలి
- లేదంటే సంబంధిత విభాగాల కార్యదర్శులు 3న హాజరవ్వాలని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: 1999 నాటి గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా జరిగిన నియామకాల్లో స్థానిక రిజర్వేషన్ల అమలు, ఇతర అంశాలపై 2015 ఫిబ్రవరి 2న తాము ఇచ్చిన తీర్పు అమలును విశదీకరించేందుకు ఈ అంశంతో సంబంధమున్న అధికారులను విచారణకు పంపాలని ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. 1999 గ్రూప్-2 నోటిఫికేషన్ వివాదంపై దాఖలైన కోర్టు ధిక్కారణ (కంటెప్ట్) పిటిషన్లను మంగళవారం జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్, జస్టిస్ ఇందూ మల్హోత్రాల ధర్మాసనం విచారించింది. 1999లో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా తొలుత 113 మంది అభ్యర్థులను మెరిట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా నియమించారు. అయితే మరో 973 పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ ఏపీపీఎస్సీకి తెలియపరచలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు 973 పోస్టులను కూడా తదుపరి మెరిట్ క్రమంలో భర్తీ చేశారు. అయితే 07.03.2002న ఇచ్చిన జీవో 124 ప్రకారం స్థానిక రిజర్వేషన్లను 1999 నోటిఫికేషన్‌లోని నియామక ప్రక్రియకు వర్తింపజేయడంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ అనంతరం 2015 ఫిబ్రవరి 2న సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించింది. 03.07.2002న ఇచ్చిన జీవో 124ను 1999లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు వర్తింపజేయలేమని పేర్కొంది. అంటే 973 పోస్టులను 124 జీవోకు లోబడి నియమించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సరికావని పేర్కొంది. 1999లో నోటిఫికేషన్ ప్రకటన ఇచ్చే నాటికి అమలులో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే ఈ పోస్టులను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటికే నియమితులైన 113 మంది, తర్వాత భర్తీ అయిన 973 మంది సీనియారిటీకి సంబంధించి నిబంధనలను అనుసరించి మెరిట్‌ను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అథారిటీ నిర్ణయించాలని ఆదేశించింది. కానీ ఈ ఉత్తర్వులు అమలు కాలేదంటూ అభ్యర్థులు తిరిగి కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేశారు.

అధికారులను పంపండి

ఈ నేపథ్యంలో తాజాగా మంగళవారం ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. 'ఎంతమంది ఈ నియామక ప్రక్రియలో నియమితులయ్యారన్నది తెలియాల్సి ఉంది. అదేవిధంగా సుప్రీంకోర్టు 2015 ఫిబ్రవరి 2న ఇచ్చిన తీర్పులోని పేరా 29లో, పేరా 31లో పొందుపరిచిన ఆదేశాలను ఏపీ, తెలంగాణ ఎలా అమలు పరిచాయన్నది తెలియాల్సి ఉంది. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జారీ అయిన జీవోను నోటిఫికేషన్‌కు వర్తింపజేయలేమని సుప్రీంకోర్టు ఆదేశించినట్టయితే సెలెక్షన్ లిస్ట్ ఆ మేరకు తిరిగి రూపొందించాల్సి ఉంటుంది. కానీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు సంబంధిత అంశాలపై అఫిడవిట్లు ఫైల్ చేయలేదు. ఈ పరిస్థితుల్లో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల సంబంధిత కార్యదర్శులు, సాధారణ పరిపాలన విభాగం(జీఏడీ) ఇన్‌చార్జి ఈ అంశానికి సంబంధించి అవగాహన ఉండి, కోర్టుకు విశదీకరించే అధికారులను తదుపరి విచారణకు పంపాలని ఆదేశిస్తున్నాం. తీర్పులోని పేరా 29, పేరా 31లలో పొందుపరిచిన అంశాలపై తీసుకున్న చర్యలను విశదీకరిస్తూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు (న్యాయవాదులు) అఫిడవిట్లు సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ రెండు అంశాలను అమలు చేస్తూ మా ముందు తీసుకురాలేని పక్షంలో సంబంధిత కార్యదర్శులు మార్చి 3న విచారణ సమయంలో కోర్టులో ఉండాలి. ఈ ఆదేశాలను అమలు చేయకుంటే తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది..'అని ధర్మాసనం పేర్కొంది.

నదుల అనుసంధానంపై తేల్చండి

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సూచన

- అనుసంధానాన్ని తొలి ప్రాధాన్యతగా చేట్టాలని తమిళనాడు వినతి
- తమ రాష్ట్ర అవసరాలు తీరాకే నీటిని మళ్లించాలన్న ఏపీ
- ఇంద్రావతి నీళ్లు పూర్తిగా తామే వాడుకుంటామన్న ఛత్తీస్‌గఢ్
- నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో చర్చ

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కృష్ణా-కావేరి నదుల అనుసంధానంపై తాము సూచించిన ప్రతిపాదనలను పరిశీలించి త్వరగా తమకు నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.జానంపేట్ మీదుగా గోదావరి జలాలను కృష్ణాకు మళ్లించి అటు నుంచి కావేరికి తీసుకెళ్లే ప్రతిపాదనపై అభ్యంతరాలు, పరిశీలనను త్వరగా తెలపాలని సూచించింది. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ ఖటారియా అధ్యక్షతన జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) 17వ స్పెషల్ కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర జలశక్తి శాఖ సెక్రటరీ ఉపేంద్రప్రతాప్ సింగ్, ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భూపాల్‌సింగ్, సీడబ్ల్యూసీ అధికారులు, ఇంజనీర్లు సమావేశంలో పాల్గొన్నారు. గోదావరి - కృష్ణా - కావేరి (గ్రాండ్ ఆనికట్) అనుసంధానం ప్రాజెక్టును తొలి ప్రాధాన్యతగా చేపట్టాలని ఈ సమావేశంలో తమిళనాడు అధికారులు కేంద్రాన్ని కోరారు. గోదావరితో అనుసంధానం చేస్తే తప్ప తమ రాష్ట్ర నీటి కష్టాలు తీరవని స్పష్టం చేశారు. గోదావరి నీటిని జానంపేట మీదుగా కృష్ణాకు, అటుగా తమిళనాడులోని గ్రాండ్ ఆనికట్‌కు 247 టీఎంసీల నీటిని తరలించేందుకు ఎన్‌డబ్ల్యూడీఏ ఇప్పటికే ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, దీన్ని త్వరగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ అనుసంధానం ప్రక్రియతో తెలంగాణలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు లబ్ధి కలుగుతుందని, ఈ దృష్ట్యా ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వ వైఖరి వెంటనే చెప్పాలని కేంద్ర మంత్రి రాష్ట్ర ఇంజనీర్లకు సూచించారు. కేంద్ర సూచనలను రాష్ట్ర

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో ఆగమ శాస్త్రానుసారంగా ఆచార్యులు వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. బాలాలయంలోని ప్రధాన మండపంలో శ్రీస్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణం, ముత్స్యాంగ్రహణం జరిపారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ఆచార్యులు, రుత్వికులు, పూజారులకు ఆలయం తరపున దీక్షా వస్త్రాలను అందజేశారు. ఉదయం జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, కలెక్టర్ అనితా రాంచంద్రన్, స్థానాచార్యులు రాఘవాచార్యులు, ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బీ.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నరసింహాచార్యులు, రుత్వికులు పాల్గొన్నారు. పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బంగారు కవచ మూర్తుల ప్రతిష్టాపనోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. ఉదయం స్వస్తివాచనం, విశ్వక్సేన ఆరాధన పూజలు చేసి స్వర్ణ భరితమైనటువంటి కవచ మూర్తి లక్ష్మీనరసింహులకు పంచగవ్యాధివాసం జరిపించారు. సాయంత్రం జలాధివాస పూజలను గావించారు.

బుధవారం యాదాద్రిలోని బాలాలయంలో స్వస్తివాచనం చేస్తున్న అర్చకులు

ఏమిటీ.. ఎందుకు?

- విద్యార్థిని విచారించిన ఏపీ నిఘా విభాగం అధికారులు
- ఫోన్ కాల్స్‌పై ఆరా.. కలకలం

మదనాపురం: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని ఓ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థికి వచ్చిన ఫోన్‌కాల్స్‌పై బుధవారం ఆంధ్ర ప్రదేశ్ నిఘా విభాగం అధికారులు విచారించడం కలకలం రేపింది. పాఠశాలకు వెళ్లిన అధికారులు సదరు విద్యార్థి వివరాలు సేకరించారు. విద్యార్థి చదువుతో పాటు ప్రవర్తనపై ఆరా తీశారు. ఎంత కాలం నుంచి ఫోన్ వాడుతున్నాడని వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా విద్యార్థితో రాబట్టేందుకు యత్నించారు. సాయంత్రం స్టేషన్‌కు రప్పించి అక్కడ గంటన్నర పాటు విచారించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు అక్కడికి తరలివచ్చారు. కాగా, విద్యార్థి కాల్ డేటాను సేకరించామని.. వచ్చిన ఫోన్ కాల్స్‌కు విద్యార్థికి ఎలాంటి సంబంధం లేదని తమ విచారణలో తేలిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. అనంతరం విద్యార్థితో పాటు తండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అజ్ఞాత నంబర్ల ద్వారా ఫోన్ కాల్స్ వస్తే ఎత్తవద్దని సూచించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

లంచం అడిగితే తాట తీస్తాం

సాక్షి, జనగామ: 'లంచాలను అరికట్టడానికే ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త మున్సిపల్ చట్టం తీసుకొచ్చారు.. 600 గజాల లోపు ఇల్లు కట్టుకునే వారు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ ఇస్తే అనుమతి పత్రాలు 21 రోజుల్లో మీ ఇంటికే వస్తాయి. ఎవరినీ అడగక్కరలేదు. ఎవరైనా లంచం అడిగితే తాట తీస్తాం'అని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు హెచ్చరించారు. పట్టణ ప్రగతిలో భాగంగా బుధవారం జనగామ మున్సిపాలిటీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన 'పట్టణ ప్రగతి'సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారంగా పట్టణాల్లోని నిరుపేదలకు విడతల వారీగా డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేస్తామని, ఇళ్ల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్త ఫించన్లు ఇస్తామని, 'ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలనేది'కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. కొత్త మున్సిపాలిటీ చట్టం ప్రకారంగా పట్టణాల్లో నాటిన మొక్కల్లో 85 శాతం బతక్కపోతే కౌన్సిలర్, చైర్మన్ పోస్టులు ఊడుతాయని ఆయన హెచ్చరించారు. ఊరూరా, పట్టణాల్లో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నామని, ఇళ్లు, కాలనీల్లో మొక్కలు పెంచాలన్నారు.

కొత్త మున్సిపల్ చట్టం కఠినంగా అమలు: కేటీఆర్

- ఏప్రిల్ నుంచి కొత్త పింఛన్లు
- విడతల వారీగా డబుల్ బెడ్రూం ఇళ్లు
- పేదల కష్టాలు తెలుసుకోవడానికే దళితవాడకు వచ్చా..
- జనగామ మునిసిపాలిటీలో మంత్రి ఆకస్మిక తనిఖీ

కష్టాలు తెలుసుకోవడానికే వచ్చా..

ఇప్పుడు ఎలాంటి ఎన్నికలు లేవు.. ప్రజల మధ్యలో ఉండాలనే కేసీఆర్ మమ్మల్ని జనంలోకి పంపిస్తున్నారని తెలిపారు. దళిత కాలనీల్లో పర్యటించాలని స్పష్టంగా చెప్పారు. పేదల కష్టాలను స్వయంగా తెలుసుకోవడం కోసమే ఇక్కడికి వచ్చానని కేటీఆర్ పేర్కొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణ

వార్డు స్పెషలాఫీసర్, వార్డు కమిటీలు పారిశుద్ధ్య పనులను పటిష్టంగా అమలు చేయాలని, తడి, పొడి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. తడి చెత్తతో ఎరువు తయారు చేసి రైతులకు, పొడి చెత్తతో కరెంటు ఉత్పత్తి కోసం వినియోగిస్తామన్నారు. వార్డుల్లో వాటర్ ఆడిట్ చేయాలని, ఖాళీ ప్లాట్లలోని చెత్తను తొలగించడానికి ముందు నోటీసులు ఇస్తారన్నారు.

> పుట్టినప్పటి నుంచి కాటికి పోయే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. పింఛన్లను రెట్టింపు చేయడం, ప్రతి మనిషికి ఆరు కిలోల బియ్యం, పేద ఆడబిడ్డల లగ్నానికి కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు, బాలింతలకు కేసీఆర్ కిట్, బాలలకు ఆరోగ్య లక్ష్మి, హాస్టళ్లల్లో చదువుకునే పిల్లలకు సన్న బియ్యం, నాణ్యమైన విద్య అందిస్తున్నామని కేటీఆర్ వివరించారు.
> **పుట్టినప్పటి నుంచి కాటికిపోయే వరకు..**

యాజమాని తొలగించుకోక పోతే అధికారులు తొలగించి ఐదు రెట్లు ఎక్కువ వసూలు చేస్తారని, ఒకవేళ డబ్బులు చెల్లించకపోతే ఆ ప్లాట్‌ను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.

గడపగడపకు కేటీఆర్

పట్టణ ప్రగతిలో భాగంగా మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కలెక్టర్ కె.నిఖిలతో కలసి జనగామ మున్సిపాలిటీల్లోని 13, 30 వార్డుల్లోని అంబేడ్కర్ కాలనీల్లో గడపగడపకు వెళ్లారు. నమస్తే అమ్మా.. నీ పేరేంటి తల్లీ.. మీ ఇంట్లోని చెత్తను ఎవరికి ఇస్తున్నారు. చెత్తను నిల్వ చేయడానికి డబ్బాలు ఉన్నాయా.. అంటూ కాలనీ వాసులను పలకరిస్తూ ముందుకు సాగారు.

జనగామలోని అంబేద్కర్ నగర్‌లో మల్లమ్మతో ముచ్చటిస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎర్రబెల్లి

'భగీరథ'తో 30 వేల కోట్లు వృథా

సీఎం కేసీఆర్‌పై పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ ధ్వజం

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్రంలో మిషన్ భగీరథ పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.30 వేల కోట్లు వృథా చేశారని, దీని వల్ల కాంట్రాక్టర్లు, కేసీఆర్ కుటుంబ సభ్యులు మాత్రమే బాగు పడ్డారని పీసీసీ అధ్యక్షుడు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో మూడేళ్లల్లో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు ఇస్తానని, లేకుంటే ఎన్నికల్లో ఓట్లు అడగనని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. పాత నల్లాలకు భగీరథ నీళ్లు కలిపి పూర్తి స్థాయిలో అందిస్తున్నామని ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దేవరకొండలో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్.. భగీరథ నీళ్లు పూర్తి స్థాయిలో అందించిన ఘనత తమదేనని చెప్పారని, కానీ మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో కనీసం 10 శాతం కూడా నీళ్లు ఇవ్వలేకపోయారని విమర్శించారు.

రెండేళ్ల నిరీక్షణకు పరిష్కారం

వృద్ధురాలికి పింఛన్ మంజూరు చేసిన కలెక్టర్

భూపాలపల్లి: రెండేళ్లుగా పింఛన్ రాక ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీం తక్షణం మంజూరు చేయించి ఆమెకు ఆసరాగా నిలిచారు. బుధవారం కలెక్టర్ భూపాలపల్లిలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ సమయంలో కలెక్టరేట్ ఎదుట మెట్లపై భూపాలపల్లి మండలం గుర్రంపేట గ్రామానికి చెందిన అజ్మీరా మంగమ్మ (70) ఉండటాన్ని గమనించారు. వెంటనే వాహనం దిగి ఆమెతో మెట్లపై కూర్చొని ఇక్కడ ఎందుకు కూర్చున్నావమ్మా.. అని పలకరించారు. రెండేళ్ల నుంచి పింఛన్ కోసం తిరుగుతున్నానని వృద్ధురాలు వాపోయింది. వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుమతితో మాట్లాడి మంగమ్మకు పింఛన్ మంజూరు చేయించారు. నీకు పింఛన్ మంజూరు అయిందమ్మా.. ఇక బాధపడకు అని కలెక్టర్ చెప్పడంతో ఆ వృద్ధురాలి సంతోషానికి అవధులు లేవు. కలెక్టర్ చేతులు పట్టుకొని కృతజ్ఞతలు తెలిపింది.

మెట్లపై కూర్చుని వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ అబ్దుల్ అజీం

దండం పెట్టే రోజులు పోయాయి

- లంచం అడిగితే కఠిన చర్యలు
- 'పట్టణ ప్రగతి' కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: లంచాలు అడిగే అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అందుకు అనుగుణంగా మున్సిపల్ కొత్త చట్టంలో నిబంధనలు పొందు పరిచారని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన సిద్దిపేటలోని పలు వార్డుల్లో కలియ తిరిగారు. ప్రజల సమస్యలు, పారిశుధ్య పనులు, తాగునీరు, విద్యుత్ సరఫరా మొదలైన విషయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణాల్లోని ఖాళీ ప్లాట్లలో చెత్తా, ప్లాస్టిక్ వస్తువులు వేయడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. దరఖాస్తులు పెట్టి దండం పెట్టే రోజులు పోయాయని, ప్రజలు అడుగకుండానే వారి అవసరాలను గుర్తించి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గతంలో వేసవి వస్తుందంటే తాగునీటికి ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు తాగు, సాగు నీరు, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు, ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చే అనేక సౌకర్యాలు కల్పించామని చెప్పారు. విచ్చల విడిగా ప్లాస్టిక్ వినియోగంతో కేన్సర్ వ్యాధిని కొని తెచ్చుకుంటున్నామని అన్నారు.

యాభై ఏళ్ల దరిద్రం వదిలింది

ముస్తాబాద్ (సిరిసిల్ల): సిరిసిల్లకు యాభై ఏళ్ల దరిద్రం వదిలిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్ల అభివృద్ధిలో దూసుకెళుతోందని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో బుధవారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. అనంతరం మోడల్ పంచాయతీ భవనాన్ని సందర్శించి మాట్లాడారు. సిరిసిల్ల, ముస్తాబాద్ ప్రాంతాలు నేడు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. త్వరలోనే కాళేశ్వరం నీటితో ఇక్కడి బీడు భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టుతో పాటు, మల్లన్నసాగర్ నుంచి కాలువలు వస్తున్నాయని తెలిపారు. కందుల కొనుగోళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మానుకోట గులాబీలో గలాటా!

- చాయ్, బిస్కెట్లు తిని, ఫొటోలు దిగితే సమస్యలు తీరుతాయా?
- నేను ఎర్రబస్సులో రాలేదు.. ఆర్ ఈసీలో చదువుకుని రాజకీయాల్లోకి వచ్చా..
- ఎమ్మెల్యేను పిలవకుండా ఎలా సమీక్షిస్తారు: శంకర్‌నాయక్
- ముందే చెప్పామన్న మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, మహబూబాబాద్: మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు బుధవారం మరోసారి బహిర్గతమయ్యాయి. ఎస్సారెస్పీ సమీక్ష సమావేశం సందర్భంగా శంకర్‌నాయక్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అధికారుల ఎదుటే మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

నన్ను పిలవరా..?

మధ్యాహ్నం 12.30 గంటలకు సమీక్ష ప్రారంభం కాగా, కొద్ది సేపటికే ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అక్కడకు చేరుకొని తనకు సమాచారం ఇవ్వకుండా సమీక్ష నిర్వహించడం దారుణమని, స్థానిక సమస్యలు తెలియకుండా సమీక్షలు పెట్టి చాయ్, బిస్కెట్లు తిని ఫొటోలకు పోజులిస్తే ప్రయోజనం ఉండదని మంత్రిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో మంత్రి సత్యవతి 'మనం ముందుగానే అనుకున్నాం కదా? సమీక్ష గురించి తెలుసు కదా' అని సమాధానం ఇచ్చారు. దీంతో తాను రాకుండానే ఎందుకు ప్రారంభించారని శంకర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను రోడ్డురోలర్ మీద, ఎర్ర బస్సు ఎక్కి రాలేదని.. ఆర్ఈసీలో చదివి రాజకీయాల్లోకి వచ్చానంటూ మంత్రి విద్యాభ్యాసంపై పరోక్ష విమర్శలు గుప్పించారు. 'ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. మీ సమస్యలు ఏంటో చెప్పండి చర్చిద్దాం' అని మంత్రి బదులిచ్చారు. కలెక్టర్ వీపీ గౌతమ్ జోక్యం చేసుకొని 'సమన్వయ లోపం జరిగిందని సర్ది చెప్పారు.

ఓడించాడని చంపేశారు!

వేములవాడ: రాజకీయ కక్షలకు ఓ రౌడీ షీటర్ బలయ్యాడు. పట్టపగలు అందరూ చూస్తుండగానే వెంటాడి నడిరోడ్డుపై కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సిరిసిల్ల జిల్లా వేములవాడలో బుధవారం చోటుచేసుకుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో తమను ఓడించాడని కక్ష పెంచుకున్న ప్రత్యర్థులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటనతో వేములవాడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సీఐ సీహెచ్ శ్రీధర్ కథనం ప్రకారం.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పట్టణానికి చెందిన ముద్రకోల వెంకటేశ్ కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయాడు. స్థానికంగా వాటర్ ప్లాంటులో డ్రైవర్‌గా పని చేస్తున్న శివ తనకు మద్దతు ఇవ్వకుండా ప్రత్యర్థి గెలుపునకు సహకరించాడని వెంకటేశ్ కక్ష పెంచుకున్నాడు. తన ఓటమికి కారణమైన అతడిని ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించాడు. కక్షతో రగిలిపోతున్న వెంకటేశ్.. అదను చూసి దెబ్బ కొట్టాలని పథకం రచించాడు. ఈ నేపథ్యంలో ఉదయం బైక్‌పై వెళ్తున్న శివను తన సన్నిహితుడు శ్రీనివాస్‌తో కలసి వెంటాడారు. నడిరోడ్డుపై అటకాయించి కత్తులతో పొడిచి హత్య చేశారు. రక్తపు మడుగులో పడి ఉన్న శివను చూసిన స్థానికులు.. పోలీసులకు, 108కు సమాచారం అందించారు. వారు శివను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శివ చికిత్స పొందుతూ చనిపోయాడు. కాగా శివపై మూడేళ్ల క్రితం రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులు ముద్రకోల వెంకటేశ్, శ్రీనివాస్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

పట్టపగలు రౌడీషీటర్ దారుణ హత్య

- గత ఎన్నికల్లో సహకరించలేదని కక్ష పెంచుకున్న మాజీ కౌన్సిలర్
- మరొకరితో కలసి కత్తులతో దాడి.. చికిత్స పొందుతూ మృతి

నూగూరి శివ మృతదేహం

సౌర వెలుగుల్లో అవినీతి చీకటి

లబ్ధిదారుల పేర్లతో సబ్సిడీ సొమ్ము స్వాహా

- కరీంనగర్, ఆదిలాబాద్ జిలాల్లో రూ. లక్షలు పక్కదారి
- కేంద్ర ప్రభుత్వ ఆడిట్‌లో బయటపడిన బాగోతం

సాక్షి, మంచిర్యాల: సౌర వెలుగుల్లోని అవినీతి రాజ్యమేలుతోంది. గతంలో గోబర్‌గ్యాస్ నిర్మాణాల్లో బయటపడిన అవినీతి తరహాలోనే సోలార్ యూనిట్లలోనూ రూ. లక్షల సబ్సిడీ సొమ్ము మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్లింది. ఈ అవినీతిపై సీఐడీ, సంబంధిత అధికారులు విచారణ చేపడుతుండటంతో అక్రమాలు వెలుగు చూస్తున్నా యి. కేంద్ర ప్రభుత్వ వార్షిక ఆడిట్‌లో ఈ తతంగం బయటపడగా.. ఇప్పటికే కొంతమంది అధికారులు, డీలర్లపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో సీఐడీ, తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (టీఎస్ఆర్ఈడీసీవో) అధికారులు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి జరిగిన అక్రమాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

పక్కదారి పట్టిన సబ్సిడీ సొమ్ము

ప్రతి ఇంటా సౌర విద్యుత్ వినియోగం పెంపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సోలార్ ప్లాంటును సబ్సిడీపై లబ్ధిదారులకు అందజేశాయి. ఒక్కో సౌర యూనిట్ ధర రూ. 1.50 లక్షలుగా నిర్ణయించాయి. మొదట్లో లబ్ధిదారుడు మొత్తం యూనిట్ విలువ చెల్లిస్తే ఆ తర్వాత సబ్సిడీ అందించేలా నిబంధన ఉండేది. ఆ తర్వాత సబ్సిడీ పోను రూ. 60 వేలు చెల్లిస్తే చాలని కేంద్రం నిబంధన సడలించడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అయితే ఇక్కడే కొందరు ఏజెన్సీదారులు తమ చేతివాటం చూపించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరి ఇళ్లలో సోలార్ యూనిట్లు అందజేయకున్నా.. తప్పుడు వివరాలతో డబ్బులు స్వాహా చేశారు. కొంతమంది ఏజెన్సీదారులు అనేక మంది వివరాలు సేకరించి ఒకే యూనిట్‌ను ఫొటోలు తీసి.. వేర్వేరుగా కనిపించేలా పెట్టి లబ్ధిదారుల పేర్లను వాడుకుని సబ్సిడీని పక్కదారి పట్టించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్, కొమురంభీం జిల్లాల పరిధిలో మొత్తం 91 యూనిట్లు మంజూరు కాగా ఇందులో సగానికి సగం బోగస్ ఉన్నట్లు, మంచిర్యాల పట్టణ పరిధిలో 19 యూనిట్లకు పదింటిలో అవకతవకలు జరిగినట్లు తేలింది. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 40 యూనిట్లలో 20 యూనిట్ల సబ్సిడీ సొమ్మును 2 ఏజెన్సీలు కాజేసినట్లు గుర్తించారు. రెండు మూడు రోజుల్లో నివేదిక అందజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు కూడా చేయలేదు

నేను సోలార్ ప్లాంట్ కోసం దరఖాస్తు చేయలేదు. నాకు సోలార్ పరికరాలు కూడా రాలేదు. నా పేరు మీద సబ్సిడీ వచ్చినట్లు అధికారులు చెప్పేదాకా నాకు తెలియదు.

– పి.రాజేశ్వర్, సర్వాయిపేట, కోటపల్లి మండలం, మంచిర్యాల



బుధవారం ఆబ్కారీశాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నీరా పాలసీపై ప్రణాళికలు సిద్ధం చేయండి: శ్రీనివాస్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆరోగ్యంతో పాటు గీత వృత్తిదారుల ఆత్మగౌరవం కోసం ప్రవేశపెట్టిన నీరాను త్వరలోనే ప్రజలకు అందించేందుకు ఆబ్కారీశాఖ ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. బుధవారం ఆబ్కారీశాఖపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీరా పాలసీలో భాగంగా కేరళ, రాజమండ్రిల్లోని హారి కల్చర్ యూనివర్సిటీల్లో నీరా తయారీ, క్షేత్రస్థాయిలో నీరా సేకరణ, నిల్వ, మార్కెటింగ్‌లతో పాటు నీరా కేఫ్‌ల ద్వారా నీరాను అందించటంపై చేసిన పరిశోధనల పురోగతిపై శ్రీనివాస్‌గౌడ్ ఆబ్కారీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో నీరా పాలసీని ప్రవేశపెట్టామన్నారు. అలాగే టీఎస్‌బీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం డిపోల సామర్థ్యాన్ని బట్టి అవసరమైన కొత్త డిపోల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కమిషర్ అజయ్‌రావు, అధికారులు హరికిషన్, ఖురేషీ, దత్తరాజ్‌లతో పాటు టీఎస్‌బీసీఎల్ ఉన్నతాధికారులు సంతోష్‌రెడ్డి, కులకర్ణి పాల్గొన్నారు.

'పురావస్తు'పనులు వేగిరం చేయండి

హెరిటేజ్ సర్క్యూట్‌లో భాగంగా పురావస్తు కట్టడాల పరిరక్షణకు చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. హయత్‌భక్షి మసీదులో జరుగుతున్న పునర్‌నిర్మాణ పనులను త్వరలో పరిశీలిస్తామన్నారు. అలాగే సిరిసిల్ల, మిడ్ మానేరుల్లో పర్యాటక ప్రదేశాల అభివృద్ధి ఎంత వరకు వచ్చాయని అధికారులను అడిగారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు టూరిజం అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టూరిజం ఎండీ మనోహర్, ఎస్ఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంక్ కోసమే విద్వేషాలు: నారాయణ

హైదరాబాద్: ఓటు బ్యాంక్ కోసమే ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నారని.. ఢిల్లీలో జరిగే అల్లర్లకు బీజేపీనే కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ ఆరోపించారు. బుధవారం కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఆర్‌సీ, సీఏఏలను కేరళ, తెలంగాణ, బిహార్, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలు వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిని దేశద్రోహులు అనడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ జేఎన్‌ఎన్‌యూ మాజీ విద్యార్థి కన్హయ్య కుమార్ నెల రోజులుగా చేస్తున్న ఉద్యమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా ఉద్యమించి సభలు, సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 23న భారీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ట్రంప్ పర్యటనతో నష్టం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన వల్ల దేశానికి ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లుతుందని నారాయణ పేర్కొన్నారు. ఇరు దేశాలు చేసుకున్న ఒప్పందాలతో దేశంలో పౌల్ట్రీ పరిశ్రమతో పాటు చక్కెర, పాలు, పాల ఉత్పత్తులకు నష్టం జరుగుతుందని వాపోయారు. భారత ప్రధాని అమెరికా వెళ్లినా.. అమెరికా అధ్యక్షుడు మన దేశానికి వచ్చినా మన దేశమే ఖర్చు చేస్తుందని ఎద్దేవా చేశారు. ట్రంప్ పర్యటనకు రూ.700 కోట్లు ఖర్చు అయ్యాయని పేర్కొన్నారు.

గవర్నర్‌కు టీటీడీపీ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలపై పెరుగుతున్న దాడులపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు టీటీడీపీ ప్రతినిధి బృందం వినతిపత్రం అందించింది. బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన వారిలో ఆపార్టీ నేతలు ఎల్.రమణ, రావుల చంద్రశేఖరరెడ్డి, తదితరులున్నారు. మద్దతు, గిట్టుబాటు ధరలు అందకపోవడంతోరైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న దాడులను గురించి ఈ వినతిపత్రంలో ప్రస్తావించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయాలి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: పంజగుట్టలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటునకు సంబంధించి మార్చి 4న పార్లమెంట్‌లో అన్ని పార్టీల ఎంపీలను కలుస్తామని, మార్చి 6న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని కాంగ్రెస్ నేత వీహెచ్ తెలిపారు. ఆ తర్వాత ఇందిరాపార్కు వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని బుధవారం మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్‌లోగా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విగ్రహ ఏర్పాటుకు అన్ని పార్టీలు మద్దతు తెలిపాయన్నారు.

ట్రంప్‌నకు మారణకాండ బహుమతా?: న్యూడెమోక్రసీ

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ పరస్పర పొగడ్తలతో పాటు, ట్రంప్‌నకు ఢిల్లీ మారణకాండను, 20కి పైగా మరణాలను మోదీ, హోంమంత్రి అమిత్‌షా బహుమతిగా అందించారా? అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి డీవీ కృష్ణ, సహాయ కార్యదర్శి పోటు రంగారావు ప్రశ్నించారు. ఢిల్లీ ధ్వంసకాండ, మారణకాండ యాధృచ్ఛికమైనవి కాదని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఢిల్లీలో సంఘ్ శక్తులు, యూపీనుంచి దిగుమతయ్యే గూండా గ్యాంగ్‌లను నిరోధించాలని, ప్రజలకు ముఖ్యంగా మైనారిటీల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల వ్యతిరేకులకు అడ్డాగా మారింది

న్యాయవ్యవస్థపై మండిపడిన మందకృష్ణ మాదిగ

హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీల ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల అంశం రాజ్యాంగంలో ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు అభివర్ణించడం దుర్మార్గమైన తీర్పు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. రిజర్వేషన్ల వ్యతిరేకులకు న్యాయవ్యవస్థ అడ్డాగా మారిందని విమర్శించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కూడా రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు రూపంలో ప్రయత్నం చేశారని, తీవ్రమైన ఉద్యమాలు చేస్తే వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇచ్చిన తీర్పు కూడా అలాంటిదే అని అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల అంశంపై హైదరాబాద్ కేంద్రంగా జాతీయ స్థాయి ఉద్యమం తీసుకువస్తామని పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ.. రిజర్వేషన్లు అన్నింటికీ మూలాధారమని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తీసేస్తే మిగిలినవి కూడా సులువుగా తీసేయవచ్చనే ఈ పథకం పన్నారని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టులో 98 శాతం మంది జడ్జీలు ఉన్నతవర్గాల వారే ఉన్నారని, తీర్పు ఇచ్చిన ఇద్దరు జడ్జీలు కూడా ఉన్నతవర్గానికి చెందినవారే అని తెలిపారు. అక్కడ కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటే ఈ తీర్పు వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. అందుకే న్యాయవ్యవస్థలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలనే పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. ఇక మార్చి 8న నిర్వహించనున్న 'సింహగర్జన'ను వాయిదా వేసినట్లు మందకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రాములు నాయక్, మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్య, మహేశ్వర్ రాజ్, దాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లోగుట్టు గిడ్డంగులకెరుక!

- పీపీపీ విధానంలో నిర్మించిన గిడ్డంగులను ఏళ్లుగా ఖాళీగా పెట్టిన వైనం
- ప్రభుత్వంపై ఏటా రూ.వందల కోట్ల అదనపు భారం
- గిడ్డంగులు నిర్మించి నష్టపోయిన పెట్టుబడిదారులు

సాక్షి, హైదరాబాద్

బియ్యం నిల్వల పేరిట భారీ కుంభకోణం చోటు చేసుకుంది. ప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నిర్మించిన గిడ్డంగులను ఏళ్ల తరబడిగా ఖాళీగా పెట్టి ఆమ్యామ్యాల కోసం ప్రైవేటు గిడ్డంగుల్లో నాలుగింతలు అధిక అద్దెతో బియ్యం నిల్వ చేస్తున్న వైనం వెలుగు చూసింది. ఎఫ్‌సీఐ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (టీఎస్‌డబ్ల్యూహెచ్‌సీ) అధికారుల నిర్వాకంతో ఏటా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. గిడ్డంగులకు అప్రోచ్ రోడ్డు ఉన్నా లేదని, లేదా మరేదో కుంటి సాకులు చూపి అధికారులు గత ఏడేళ్లుగా ప్రైవేటు గిడ్డంగులకు కోట్లాది రూపాయలను అప్పనంగా దోచిపెట్టారని ఆధారాలతో ఆపటు బయటపడింది. కొంతమంది ఎఫ్‌సీఐ అధికారులు తమ బినామీలతోనే ప్రైవేటు గిడ్డంగులను కట్టించి వాటికే బియ్యం నిల్వ పనులు అప్పగిస్తున్నారని పీపీపీ విధానంలో గిడ్డంగులు నిర్మించి నష్టపోయిన పెట్టుబడిదారులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతున్నారు.

పథకం నేపథ్యం ఇదీ..

పీపీపీ విధానంలో గిడ్డంగుల నిర్మాణాన్ని ప్రోత్సహించి సరుకుల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఎఫ్‌సీఐ 2008లో ప్రైవేటు ఎంటర్‌ప్రెన్యూర్ గ్యారెంటీ (పెగ్) పథకం ప్రవేశపెట్టింది. గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం ఎలాంటి పెట్టుబడి పెట్టదు. పెగ్ పథకం కింద నిర్మించే గిడ్డంగుల్లో పదేళ్ల పాటు గ్యారెంటీగా బియ్యం నిల్వ చేసి అద్దె చెల్లిస్తామని, దీంతో పెట్టుబడి వ్యయం తిరిగి రాబట్టుకోవచ్చని ఎఫ్‌సీఐ ధీమా కల్పించింది. దీంతో పలువురు పెట్టుబడిదారులు భారీగా గిడ్డంగులు నిర్మిం చారు. ఏడాదిలోగా శీతల గిడ్డంగులను నిర్మించాలని, రెండో ఏడాది ముగిసేలోగా సమీపంలోని రైల్వే స్టేషన్ నుంచి గిడ్డంగుల వరకు బియ్యం రవాణా కోసం రైల్వే లైను(రైల్వే సైడింగ్) నిర్మించాలనే షరతులను ఎఫ్‌సీఐ పెట్టింది. రైల్వే లైను నిర్మించేందుకు రైల్వే బోర్డు నుంచి రైల్వే ట్రాన్స్‌పోర్టు క్లియరెన్స్ (ఆర్టీసీ) పొందడంలో ఎఫ్‌సీఐ తీవ్ర జాప్యం చేసింది. ఎక్కడి నుంచి ఎక్కడికి ఎంత పరిమాణంలో సరుకు రవాణా చేస్తారు? ఎంత రవాణా వ్యాపారం జరుగుతుంది? ఎంత ట్రాఫిక్ ఉంటుంది? తదితర సమాచారాన్ని రైల్వే బోర్డుకు పంపడంలో ఎఫ్‌సీఐ అధికారులు కావాలనే జాప్యం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

నాటి జీఎం లేఖే సాక్ష్యం..

ప్రైవేటు గిడ్డంగులకు బదులు పెగ్ గిడ్డంగులను వినియోగిస్తే ఏటా రూ.కోట్లు మిగులుతాయని పేర్కొంటూ 2017 మే 1న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ స్వయంగా ఎఫ్‌సీఐకి లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లా జానకంపేటలోని పెగ్ గిడ్డంగుల్లో బియ్యం నిల్వ చేస్తే ఏటా రూ.4.30 కోట్లు, మేళ్లచెరువులోని గిడ్డంగిలో నిల్వ చేస్తే ఏటా రూ.2.23 కోట్లు ఆదా అవుతాయని అందులో పేర్కొన్నారు. ఇదే లెక్కన టేకులసోమారం గిడ్డంగిలో నిల్వ చేసినా ఏటా రూ.2.23 కోట్లు ఆదా కానున్నాయి. వాస్తనానికి ప్రైవేటు గిడ్డంగులకు బదులు పూర్తి స్థాయిలో ఈ మూడు గిడ్డంగులను ఎఫ్‌సీఐ వాడుకుంటే ఏటా ప్రభుత్వానికి రూ.70 కోట్ల వరకు ఆదా అవుతాయని, ఏడేళ్లలో దాదాపు రూ.500 కోట్లు దుర్వినియోగం కాకుండా మిగిలేవని పెగ్ గిడ్డంగుల యజమానులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపిస్తూ వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొంటున్నారు.

ప్రైవేటుకు దోపిడీ!

రైల్వే లైన్ల నిర్మాణం సాధ్యం కాకపోయినా, రోడ్డు మార్గంలో బియ్యం తరలించి 60% అద్దెతో పెగ్ స్కీం కింద నిర్మించే గిడ్డంగుల్లో బియ్యం నిల్వ చేస్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ హామీ ఇచ్చింది. 'పెగ్' గిడ్డంగిలో ఎన్ని బస్తాలు నిల్వ చేస్తే ఆ మేరకే అద్దె చెల్లిస్తే సరిపోనుంది. టెండరు ద్వారా నిర్మించిన గిడ్డంగుల్లో 60% అద్దెతో ఒక బస్తా బియ్యం నిల్వ చేస్తే నెలకు రూ.1 వ్యయం మాత్రమే కానుంది. రోడ్డు సరిగ్గా లేదని, హమాలీలు లేరని, క్రాప్ లేదని సాకులు చూపి ఏడేళ్లుగా ఎఫ్‌సీఐ అధికారులు చాలా పెగ్ గిడ్డంగులను ఖాళీగా ఉంచారు. వీటికి బదులుగా ప్రైవేటు గిడ్డంగుల్లో ప్రతి నెలా బస్తాకు రూ.4.68 చొప్పున బియ్యం నిల్వ చేస్తూ కోట్ల రూపాయలు ధారాదత్తం చేశారు.

మామూళ్ల దురాశతోనే..

ఎఫ్సీఐ గిడ్డంగులు కాకుండా ప్రైవేటు గిడ్డంగుల్లో బియ్యం నిల్వ చేస్తే మామూళ్లు వస్తాయన్న దురాశతో కొందరు అధికారులు ఈ జాప్యం చేసినట్లు పెట్టుబడిదారులు ఆరోపిస్తున్నారు. రైల్వే బోర్డు నుంచి క్లియరెన్స్ వచ్చే సరికి రెండేళ్ల జాప్యం జరిగింది. అప్పటికే రైల్వే సైడింగ్ నిబంధనలను రైల్వే శాఖ మార్చింది. పాత నిబంధనల ప్రకారం ఒకటిన్నర కిలోమీటర్ల రైల్వేలైన్‌ను రైల్వే సొంత ఖర్చుతో నిర్మించనుండగా, కొత్త నిబంధనల్లో ఈ నిడివి అర కి.మీ.కు తగ్గింది. దీంతో మిగిలిన కిలోమీటర్ లైను నిర్మాణ వ్యయ భారం పెట్టుబడిదారులపై పడింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో టెండర్లలో ఎఫ్‌సీఐ హామీ ఇచ్చిన అద్దె ధరతో రైల్వే లైన్లు నిర్మిస్తే తమకు గిట్టుబాటు కాదని, ప్రతి బస్తాపై అదనంగా నెలకు రూ.2 అద్దె చెల్లిస్తే రైల్వే లైను పనులు చేపడుతామని పెట్టుబడిదారులు లేఖ రాశారు. రోడ్డు మార్గంతో పోలిస్తే రైల్వేమార్గంలో బియ్యం తరలిస్తే బస్తాపై రవాణా, హమాలీ చార్జీలు కలిపి రూ.20 వరకు అదా అవుతుందని, రూ.2 అదనంగా చెల్లించినా నష్టం లేదని, అయినా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారులు అంగీకరించలేదని పెట్టుబడిదారులు పేర్కొంటున్నారు.

అప్పుడు వద్దని.. ఇప్పుడు కావాలని...

పత్తి నిల్వకు సీసీఐ ఇటీవల మేళ్లచెరువు, టేకులసోమారం పెగ్ గిడ్డంగులను అద్దెకు తీసుకుంది. ఈ గిడ్డంగులను వాడుకోవడానికి ఏడేళ్లుగా నిరాకరిస్తూ వచ్చిన ఎఫ్‌సీఐ అధికారులు ఈ విషయం తెలుసుకుని.. వాటిని ఖాళీ చేసి తమకు అప్పగిస్తే వాడుకుంటామని ఈ నెల 5న లేఖ రాయడం విశేషం. ఈ గిడ్డంగులను వాడుకోవడానికి సీసీఐకి లేని అభ్యంతరం ఎఫ్‌సీఐకు ఎందుకు ఉందనే విమర్శలొస్తాయనే జాగ్రత్త పడినట్టు అర్థమవుతోంది.

- యాదాద్రి జిల్లా టేకుల సోమారంలో రూ.24 కోట్లతో 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో చిరాక్ వేర్‌హౌజ్ బిల్డర్స్ సంస్థ 10 గిడ్డంగులను నిర్మించింది. ఈ గిడ్డంగికి అప్రోచ్ రోడ్డు సరిగ్గా లేదని, భవిష్యత్తులో రోడ్డు ఉన్న స్థలం నుంచి నీటిపారుదల కాల్వ వెళ్లనుందని ఏడేళ్లుగా సాకులు చెబుతూ ఇక్కడ పెట్టాల్సిన బియ్యాన్ని దగ్గరలోని ఓ ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేస్తోంది. ఇవి ఎఫ్‌సీఐ అధికారుల బినామీలవన్న విమర్శలున్నాయి.
- సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో రూ.24 కోట్ల వ్యయంతో 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దేవిశ్రీ బిల్డర్స్ సంస్థ 2013లో 10 గిడ్డంగులను నిర్మించింది. సరైన అప్రోచ్ రోడ్డు లేదనే సాకుతో ఎఫ్‌సీఐ ఈ గిడ్డంగులను సైతం ఖాళీగా పెట్టింది. రైల్వే శాఖకు చెందిన భూమిలో అప్రోచ్ రోడ్డు ఉందని, ఈ గోదాములను ఉపయోగించలేమని తేలుస్తూ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు గత నవంబర్‌లో లేఖ రాశారు.
- నిజామాబాద్ జిల్లా జానకంపేటలో 60 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో 'లక్ష్మీ కోల్డ్ స్టోరేజీ అండ్ వేర్ హౌసెస్' 12 గిడ్డంగులను నిర్మించింది. 2013లో నిర్మాణం పూర్తయినా, 2017 వరకు వీటిని ఎఫ్‌సీఐ ఖాళీగా పెట్టింది. ఈ గిడ్డంగిలో బియ్యం నిల్వ చేస్తే నెలకు అద్దె బస్తాపై 90పైసలు మాత్రమే కానుంది. 2017 నుంచి ఈ గిడ్డంగులను పాక్షికంగా మాత్రమే వినియోగించుకుంటోంది. బస్తాకు రూ.4.38 పైసలు చెల్లిస్తూ చుట్టుపక్కల ఉన్న ప్రైవేటు గిడ్డంగుల్లో ఎఫ్‌సీఐ బియ్యం నిల్వ చేస్తోంది. జానకంపేట గిడ్డంగిలో బియ్యం నిల్వ చేస్తే ఏటా రూ.4.32 కోట్లు ఆదా అవుతాయని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ 2017లో ఎఫ్‌సీఐకి లేఖ రాశారు.

టీఆర్ఎస్ 'సహకార' శిబిరాలు

డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు క్యాంపులకు తరలింపు

సాక్షి, హైదరాబాద్: పాత ఉమ్మడి జిల్లాల పరిధిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ముగియడంతో ఈ నెల 29న జరిగే చైర్మన్ ఎన్నికపై టీఆర్ఎస్ పార్టీ దృష్టి సారించింది. పూర్వపు 9 జిల్లాల పరిధిలోని డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్ స్థానాలకు మంగళవారం నామినేషన్లు స్వీకరించగా టీఆర్ఎస్ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ మినహా ఇతర జిల్లాల్లో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ స్థానాలను పలువురు టీఆర్ఎస్ నేతలు ఆశిస్తుండటంతో పదవులకు బహుముఖ పోటీ నెలకొంది. జిల్లాల వారీగా డైరెక్టర్ల స్థానాలకు పార్టీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిన టీఆర్ఎస్.. చైర్మన్ పదవులకు కూడా పార్టీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు పావులు కదుపుతోంది. డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు దాదాపు అందరూ పార్టీ మద్దతుదారులే కావడంతో చైర్మన్ పదవులు అన్ని టీఆర్ఎస్ ఖాతాలో చేరనున్నాయి. జిల్లాల వారీగా చైర్మన్ పదవులు ఆశిస్తున్న నేతల జాబితాను పార్టీ ఎమ్మెల్యేలతో సంబంధిత జిల్లా మంత్రులు చర్చించి పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆమోదం కోసం పంపించారు. ఈ నెల 29న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక జరగనుండగా, అదేరోజు ఉదయం జాబితాను ప్రకటించే అవకాశముంది.

క్యాంపులకు తరలిన డైరెక్టర్లు

డీసీసీబీ, డీసీఎంఎస్ మేనేజింగ్ కమిటీలకు ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త డైరెక్టర్లను మంగళవారం రాత్రి పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలించారు. శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను సంబంధిత జిల్లా మంత్రులకు అప్పగించినట్లు సమాచారం. గోవా, బెంగళూరుతో పాటు తిరుపతి తదితర పుణ్యక్షేత్రాల సందర్శన అనంతరం ఈ నెల 29న ఉదయం పూర్వ ఉమ్మడి జిల్లా కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. చైర్మన్ పదవులకు బహుముఖ పోటీ నెలకొనడంతో వివిధ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఆశావహుల జాబితాను రూపొందించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ మేరకు తాము సహకార ఎన్నికల బరిలోకి దిగినట్లు కొందరు పార్టీ నేతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించిన వారినే చైర్మన్లుగా ఎన్నుకునేలా జిల్లాల వారీగా మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల స్థాయి చర్చల్లో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ అభ్యర్థులు ఎవరనే అంశంపై స్పష్టత వచ్చినప్పటికీ, తుది జాబితాను సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

15న అమిత్‌షా కార్యక్రమాన్ని విరమించుకోవాలి

బీజేపీకి పీసీసీ నేత నిరంజన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: లాల్ బహదూర్ స్టేడియంలో మార్చి 15న తలపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభా కార్యక్రమాన్ని విరమించుకోవాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి టీపీసీసీ అధికార ప్రతినిధి జి.నిరంజన్ విజ్ఞప్తిచేశారు. ఈ సభకు అనుమతినిచ్చి ప్రమాదం కొనితెచ్చుకోవద్దని నగర పోలీస్‌కమిషనర్‌కు కూడా లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత పర్యటన సమయంలోనే దేశప్రతిష్టకు తలవంపులు తెచ్చేలా ఢిల్లీలో జరిగిన హింసాత్మక ఘటనలు దేశప్రజలను షాక్‌కు గురిచేశాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా హైదరాబాద్ నగర పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అమిత్‌షా వ్యవహారశైలి, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రకటనలు నగర ప్రశాంతతకు భగ్నం చేసేలా ఉన్నాయన్న విషయాన్ని గమనించి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఎంఐఎంను ఎందుకు కట్టడి చేయట్లేదు?

సీఎంను ప్రశ్నించిన కె.లక్ష్మణ్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్. చిత్రంలో రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి సహించలేక కుహనా మేధావులు, కుహనా లౌకికవాదులు కడుపుమంటతో దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ఢిల్లీలో హింసాత్మక ఆందోళనలు సృష్టిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ అల్లర్లను అదుపు చేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఇక్కడ తెలంగాణలో మజ్లిస్ పార్టీ, ఎంఐఎం నేతలు సీఏఏకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ఓ వర్గంలో విషబీజాలు నాటుతుంటే సీఎం కేసీఆర్ వారిని ఎందుకు కట్టడి చేయలేకపోతున్నారని నిలదీశారు. ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్, కమ్యూనిస్టులు, మోదీ వ్యతిరేక శక్తులు అల్లర్లకు కుట్ర పన్నాయన్నారు.ట్రంప్ పర్యటన సమయంలో 'ఈశాన్య ఢిల్లీలో దాడులు జరగడానికి కారణమేంటి? గత కొన్ని రోజులుగా ఆందోళన జరుపుతున్నా.. ట్రంప్ రాకతోనే వారి చేతుల్లోకి తుపాకులు ఎలా వచ్చాయి..? కాల్పులు జరపమని పోలీసులకు ఆదేశాలు రాలేదన్నారు. మరి ఈ కాల్పులు ఎవరు జరిపారు?' ఈ ప్రశ్నలకు సమాధానం లేదని చెప్పారు. తెలంగాణలో సీఏఏకు మతం రంగు పులిమి ఎంఐఎం నేత లు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ ప్రజల మధ్య విషబీజాలు నాటుతుంటే కేసీఆర్ ఏంచే స్తున్నారు? మంత్రి కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మరో జిన్నాలా తయారయ్యారని, పాకిస్తాన్ కోసం నాడు జిన్నా ముస్లింలను రెచ్చగొట్టినట్టు ఇప్పుడు ఒవైసీ రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.

కిషన్‌రెడ్డి, జయశంకర్‌లకు విజ్ఞప్తి

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఫ్రీస్కో నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజా గవిని, దివ్య తో పాటు మరొకరు ప్రేమ్ నాథ్ రామ్ నాథ్ మరణించడం పట్ల లక్ష్మణ్ దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. వారి పార్థివ దేహాలను భారత్‌కు తెప్పించే విధంగా తగిన సహాయ సహకారాలు అందించవలసిందిగా కేంద్

ఈశాన్య ఢిల్లీలో హింస జరిగిన ప్రాంతంలో పెట్రోలింగ్‌లో పాల్గొన్న భద్రతా బలగాలు

నివురుగప్పిన నిప్పులా ఢిల్లీ

27కి చేరిన ఢిల్లీ అల్లర్ల మృతుల సంఖ్య

- చెదురుమదురు ఘటనలు మినహా బుధవారం పరిస్థితి ప్రశాంతం
- సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించిన ఎన్ఎస్ఏ అజిత్ దోవల్
- శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: రెండు రోజులుగా తీవ్ర స్థాయి హింసాత్మక ఘటనలతో అట్టుడికిన ఈశాన్య ఢిల్లీలో బుధవారం పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. వీధులన్నీ తగలబడిన వాహనాలు, ధ్వంసమైన, లూటీ అయిన దుకాణాలు, మూసివేసి ఉన్న ఇళ్లు, వాణిజ్య సముదాయాలతో నిర్మానుష్యంగా కనిపించాయి. గోకుల్‌పురిలో చోటు చేసుకున్న పలు చెదురుమదురు ఘటనలు మినహా బుధవారం పరిస్థితి ప్రశాంతంగా ఉంది. మంగళవారం రాత్రి ఒకసారి, బుధవారం మరోసారి ఆందోళనలు జరిగిన ప్రాంతాల్లో జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పర్యటించారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న, సమర్థిస్తున్న వర్గాల మధ్య జరిగిన హింసాకాండగా భావిస్తున్న ఈ అల్లర్లలో బుధవారం నాటికి మృతుల సంఖ్య 27కి చేరింది. రెండు వందల మందికి పైగా గాయాలపాలయ్యారు. బుల్లెట్ గాయాలు, కత్తులు, ఇతర ప్రాణాంతక ఆయుధాల కారణంగా అయిన గాయాల కన్నా.. తరుముకొస్తున్న దుండగుల బారి నుంచి తప్పించుకోవడం కోసం ఇళ్ల పై అంతస్తుల నుంచి దూకడం వల్ల చోటు చేసుకున్న గాయాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్యులు వెల్లడించారు. కాగా, అల్లర్ల కారణంగా చనిపోయిన ఇంటెలిజెన్స్ బ్యూరో ఉద్యోగి అంకిత్ శర్మ మృతదేహాన్ని బుధవారం ఉదయం చాంద్‌బాగ్ ప్రాంతంలోని ఒక కాలువలో గుర్తించారు. రాళ్ల దాడిలో ఆయన చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. 'సాధ్యమైనంత త్వరగా ప్రశాంతత నెలకొనాలి. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితిపై లోతైన సమీక్ష జరిపాం. పోలీసులు, ఇతర భద్రత వ్యవస్థలు శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాయి' అని ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ ద్వారా స్పందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత పర్యటనలో ఉన్న రెండు రోజులు దేశ రాజధాని ఢిల్లీ అల్లర్లతో అట్టుడికిన విషయం తెలిసిందే.

ఫ్లాగ్ మార్చ్

అల్లర్ల తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఢిల్లీలో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే బాధ్యతను అజిత్ దోవల్‌కు కేంద్రం అప్పగించిన నేపథ్యంలో.. అల్లర్ల తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఢిల్లీ పోలీస్ కమిషనర్ అమూల్య పట్నాయక్, కొత్తగా నియమితులైన స్పెషల్ కమిషనర్ ఎస్ఎన్ శ్రీవాస్తవతో కలిసి దోవల్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. హింసను అడ్డుకోవడంలో విఫలమయ్యారని అమూల్య పట్నాయక్ విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో.. శ్రీవాస్తవను దోవల్ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య 22కి పెరిగిందని, 200 మందికి పైగా క్షతగాత్రులయ్యారని జీటీబీ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ వెల్లడించారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్యను పోలీసులు కాకుండా, వైద్యులు వెల్లడించడం గమనార్హం. అల్లర్ల కారణంగా ఈ ప్రాంతంలోని పాఠశాలలను, షాపులను మూసేశారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు కూడా ఇళ్లల్లో నుంచి బయటకు రాలేదు. దుకాణాలను లూటీ చేయడంతో జీవనోపాధి కోల్పోయిన పలు కుటుంబాలు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోవడం కనిపించింది. మరోవైపు, ఈ అల్లర్లకు సంబంధించి 106 మందిని అరెస్ట్ చేశామని, 18 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రజల సహాయం కోసం రెండు హెల్ప్ లైన్ నెంబర్లు 011-22829334, 011-22829335 కూడా ఏర్పాటు చేశామన్నారు. అల్లర్లలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఘర్షణలు జరిగిన ప్రాంతం నుంచి వ్యాన్‌లో తరలిపోతున్న ముస్లింలు

ఐబీ ఉద్యోగి మృతి

ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఉద్యోగి అంకిత్ శర్మ మృతిపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చిన తరువాత అంకిత్ మళ్లీ బయటకు వెళ్లాడని, తిరిగి రాలేదని ఆయన తండ్రి దేవేంద్ర శర్మ తెలిపారు. అంకిత్ మృతదేహాన్ని మురికి కాలువలో వేయడాన్ని తమ కాలనీలోని కొందరు మహిళలు చూశారని, ఎవరికైనా చెపితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆ మహిళలను వారు బెదిరించారని అంకిత్ సోదరుడు అంకుర్ వెల్లడించారు. అంకిత్ శరీరంపై కత్తిగాట్లు కూడా ఉన్నాయన్నారు.

ఆర్మీని పిలిపించాలి

పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం కోసం ఆర్మీని పిలిపించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. అల్లర్లను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. అల్లర్లకు కారణం బీజేపీ కార్యకర్తలేనని ఆప్ నేతలు సంజయ్ సింగ్, గోపాల్ రాయ్ ఆరోపించారు. ఢిల్లీ శాంతి భద్రతల అంశం కేంద్ర పరిధిలో ఉంటుందని, అల్లర్ల కట్టడికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిజాయితీగా కృషి చేయడం లేదని వారు విమర్శించారు. ఢిల్లీ సరిహద్దులను ఇప్పటికైనా మూసేయాలని, పొరుగు ప్రాంతాల నుంచి కొందరు ఢిల్లీకి వచ్చి హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

సీఏఏపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంపై ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ఆందోళనల నేపథ్యంలో రెచ్చగొట్టేలా ప్రసంగించిన బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈశాన్య ఢిల్లీ అల్లర్లపై ఢిల్లీ హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన ముగ్గురు బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఢిల్లీ పోలీసుల వైఫల్యాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. బీజేపీ నేతలు అనురాగ్ ఠాకూర్, పర్వేష్ వర్మ, కపిల్ మిశ్రాలపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించింది. ఇందిరాగాంధీ హత్య సందర్భంగా 1984లో సిక్కులకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన హింసాకాండను ఈ దేశంలో పునరావృతం అయ్యేందుకు అనుమతించబోమని ఈ సందర్భంగా హైకోర్టు తేల్చి చెప్పింది. పౌరులందరికీ సంపూర్ణ భద్రత కల్పించాలని ఆదేశించింది. అల్లర్లు జరిగిన ప్రాంతాలను సందర్శించాలని అధికారులకు సూచించింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా చూడాలని ఆదేశించింది. అల్లర్లలో ఐబీ అధికారి మృతి చెందడం పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈశాన్య ఢిల్లీలో తలెత్తిన హింస నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు ప్రతిస్పందించిన తీరుని ఢిల్లీ హైకోర్టు ప్రశంసించింది. 'మనం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి' అని విచారణ సందర్భంగా జస్టిస్ ఎస్. మురళీధర్ వ్యాఖ్యానించారు. హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయాలని, నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పించాలని సూచించింది. బాధితులు, వివిధ సంస్థల మధ్య సమన్వయం కోసం అమికస్ క్యూరీగా సీనియర్ న్యాయవాది జుబేదా బేగంని నియమించింది.

ఆ వీడియోలు చూశారా?

సీఏఏ వ్యతిరేక ఆందోళనలపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన ముగ్గురు బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అరెస్టు చేయాలనీ జస్టిస్ మురళీధర్, జస్టిస్ తల్వంత్ బెంచ్ ఆదేశించింది. బీజేపీ నాయకుడు కపిల్ మిశ్రా రెచ్చగొట్టే విధంగా చేసిన ప్రసంగం వీడియోని చూశారా? అంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పోలీస్ కమిషనర్ (క్రైంబ్రాంచ్) రాజేష్ డియోలను కోర్టు ప్రశ్నించింది. అయితే ఆ వీడియో క్లిప్పింగ్స్‌ని తాను చూడలేదనీ తుషార్ మెహతా జవాబిచ్చారు. బీజేపీ నాయకులు అనురాగ్ ఠాకూర్, పర్వేష్ వర్మల వీడియోలను తాను చూశాననీ, మిశ్రా వీడియోను మాత్రం చూడలేదని రాజేష్ డియో కోర్టుకి వెల్లడించారు. అనంతరం కోర్టులో బీజేపీ నేతల వీడియో క్లిప్పింగ్స్‌ను ప్రదర్శించారు.

సుప్రీం అక్షింతలు

హింసను సకాలంలో గుర్తించడంలో, విధి నిర్వహణలో ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఆ నిర్లక్ష్యం 20కి పైగా పౌరుల మరణానికి దారి తీసిందని పోలీసులను ధర్మాసనం మందలించింది. అయితే సీఏఏపై చెలరేగిన హింసకు సంబంధించిన అప్పీళ్లను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హింస చెలరేగిన సందర్భంలో ఎవరి ఆదేశాల కోసమో వేచి చూడకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలని పోలీసులకు హితబోధ చేసింది. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. షహీన్ బాఘ్ నిరసనలకు సంబంధించిన విషయాల్లోకి వెళ్ళడానికి 'అనుకూల వాతావరణం అవసరమని' వ్యాఖ్యానించింది.

అమిత్ షా రాజీనామా చేయాలి

రెండు రోజులుగా ఈశాన్య ఢిల్లీ అతలాకుతలమవడంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) బుధవారం సమావేశమైంది. ఈ ఘర్షణలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. ఢిల్లీ ప్రభుత్వం కూడా ఈ హింసకు బాధ్యత వహించాలన్నారు. తర్వాత మీడియా సమక్షంలో కేంద్రానికి కొన్ని సూటిప్రశ్నలు సంధించారు.

- హింస జరుగుతుంటే అమిత్ షా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఎక్కడ? ఏం చేస్తున్నారు ?
- ఢిల్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇప్పటివరకు సీఏఏ నిరసనలపై ఇంటెలిజెన్స్ సంస్థలు ఎలాంటి నివేదికలు ఇచ్చాయి?
- ఢిల్లీలో చెలరేగిన హింస హోంశాఖ చెబుతున్నట్టు అప్పటికప్పుడు జరిగినవా? లేదంటే హోంశాఖ సహాయ మంత్రి చెబుతున్నట్టు ఎవరైనా రెచ్చగొట్టినవా?
- ఆదివారం రాత్రి అల్లర్లు చెలరేగుతాయని స్పష్టమైన సంకేతాలు వచ్చినప్పుడు ఢిల్లీలో ఎన్ని బలగాలను మోహరించారు?
- ఢిల్లీ పోలీసుల చేతుల్లోంచి పరిస్థితులు జారిపోయినట్టు గ్రహించినప్పుడు భద్రతా సిబ్బందిని ఎందుకు మోహరించలేదు?

అమిత్ షా రాజీనామా కోరడం హాస్యాస్పదం: బీజేపీ

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ.. కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలనడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ విమర్శించింది. పోలీసులతో కలిసి నిరంతరంగా పనిచేస్తూ ఢిల్లీలో పరిస్థితుల్ని అదుపులో ఉంచడానికి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఢిల్లీ అల్లర్ల విషయం ప్రస్తావనకు రాలేదన్నారు.

నోబెల్ గ్రహీత, పాక్ హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్‌తో స్వీడన్ బాల పర్యావరణవేత్త గ్రెటా థన్‌బర్గ్. బ్రిటన్‌లో ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో చదివే మలాలాను అక్కడ కలిసినపుడు తీసిందీ ఫొటో.

భారత్ గొప్ప దేశం: ట్రంప్

స్వదేశానికి చేరుకున్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: భారత్ ఎంతో గొప్ప దేశమని, తన పర్యటన పూర్తిస్థాయిలో విజయవంతమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేశారు. ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్, కుమార్తె ఇవాంకా, అల్లుడు జేర్డ్ కుష్నర్, ఇతర ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి భారత్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకున్న ఆయన బుధవారం అమెరికాకు చేరుకున్నారు. స్వదేశానికి వెళ్లిన వెంటనే ట్రంప్ 'భారత్ చాలా గొప్ప దేశం. నా పర్యటన విజయవంతమైంది'అని ట్వీట్ చేశారు.

అధ్యక్ష ఎన్నికలయ్యాక రావాలనుకున్నా..

ఈ ఏడాది నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలు పూర్తయ్యాక భారత పర్యటనకు రావాలని భావించానని ట్రంప్ చెప్పారు. మోదీకి ఆ ఆలోచన నచ్చకపోవడంతో ముందే వచ్చానన్నారు. రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం విందులో ట్రంప్ ఈ విషయం చెప్పారు. 'భారత్‌కి మళ్లీ మళ్లీ వస్తూ ఉండాలని ఆశపడుతున్నాను'అని ట్రంప్ అన్నారు.

ట్రంప్ ప్లేటర్‌ను ఆస్వాదించిన ట్రంప్

ట్రంప్, భార్య మెలానియా భారత్ పర్యటనలో బస చేసిన ఐటీసీ మౌర్యలో వారి కోసమే ప్రత్యేకంగా తయారు చేసిన ట్రంప్ ప్లేటర్ భోజనాన్ని ఎంజాయ్ చేస్తూ తిన్నారు. టేబుల్ సైజ్‌లో ఉండే నాన్, మటన్ లెగ్‌తో తయారు చేసిన సికందరి నాన్ రుచికి వారు ఫిదా అయ్యారని హోటల్ వర్గాలు వెల్లడించాయి. వారు వెళ్లేటపుడు ఎంఎఫ్ హుస్సేన్ గుర్రం చిత్రం ముద్రించిన అప్రాన్‌లను హోటల్ యాజమాన్యం అధ్యక్షుడికి కానుకగా ఇచ్చింది.

మేరీల్యాండ్‌లోని వైమానిక స్థావరానికి చేరుకున్న ట్రంప్ దంపతులు

ప్రధానిని పొగడడంపై లాయర్ల సంఘాల్లో విభేదాలు

న్యూఢిల్లీ: గతవారం జరిగిన అంతర్జాతీయ న్యాయ సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా ప్రధాని మోదీని ప్రశంసించడంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రధాని మోదీని జస్టిస్ అరుణ్ మిశ్రా ప్రశంసించడం అభ్యంతరకరమని పేర్కొంటూ ఒక తీర్మానం చేసినట్లు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) అధ్యక్షుడు దుష్యంత్ దవే పేరుతో బుధవారం ప్రకటన వెలువడింది. జస్టిస్ మిశ్రా తీరును విమర్శిస్తూ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఒక ప్రకటన చేసింది. ప్రధానిని పొగడుతూ జస్టిస్ మిశ్రా చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ స్వతంత్రత, నిష్పక్షపాతంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. అయితే జస్టిస్ మిశ్రాను ఎస్సీబీఏ అధ్యక్షుడు విమర్శించడం హ్రస్వ దృష్టికి నిదర్శనమని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ ఓ ప్రకటనలో అన్నారు.

నదిలో పడ్డ బస్సు

రాజస్తాన్‌లో 24 మంది మృతి

కోటా: రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ప్రమాదవశాత్తు నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 24 మంది మృతి చెందారు. మృతుల్లో 11 మంది మహిళలు సహా ముగ్గురు చిన్నారులు ఉన్నారు. రాజస్తాన్‌లోని బుండి జిల్లా కోటా-దౌసా జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సవాయి మాధోపూర్ నగరంలో జరగనున్న వివాహ వేడుకకు హాజరయ్యేందుకు 29 మంది బుధవారం ఉదయం కోటా నుంచి బస్సులో బయల్దేరారు. పాన్‌డీ గ్రామం సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే డ్రైవర్ బస్సును నియంత్రించలేకపోయాడు. ఈ బ్రిడ్జికి గోడ కానీ రెయిలింగ్ కానీ లేకపోవడంతో దాదాపు 20-25 అడుగుల ఎత్తు నుంచి బస్సు మెజ్ నదిలో పడిపోయింది.

ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: దాదాపు ఆరు నెలలుగా ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రబీ సీజన్ నేపథ్యంలో ఉల్లి ధర పడిపోయే అవకాశముంది. దీంతో రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. 'ఉల్లి ధరను స్థిరీకరించిన ప్పటి నుంచి ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది మార్చిలో 40 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఉల్లి పండే అవకాశముంది' అని ఆహార శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

వుహాన్‌కు భారత్ మందులు

15 టన్నుల మందులతో బయల్దేరిన విమానం

న్యూఢిల్లీ/సియోల్/బీజింగ్: కోవిడ్-19 వైరస్ ప్రభావిత ప్రాంతమైన చైనాలోని వుహాన్ ప్రాంతానికి భారత్ సుమారు 15 టన్నుల మందులను పంపింది. భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన విమానంలో బుధవారం ఈ మందులను తరలించారు. వుహాన్‌కు వెళ్లేందుకు భారత్‌కు చెందిన విమానాలకు అనుమతులివ్వడంలో చైనా కావాలనే ఆలస్యం చేస్తోందని గత వారం భారత్ ప్రకటించడం తెల్సిందే. విమానం తిరిగొస్తూ 80 మంది భారతీయులు, చుట్టుపక్కల దేశాల నుంచి 40 మందిని భారత్‌కు తీసుకురానుంది. విమానంలో మాస్కులు, గ్లోవ్స్, ఇతర అత్యవసర వైద్య పరికరాలను పంపిస్తున్నట్లు తెలిపింది.

ద.కొరియాలో కోవిడ్ పైపైకి

చైనాలో కోవిడ్-19 (కరోనా వైరస్) బాధితుల సంఖ్య క్రమేపీ తగ్గుతుంటే మరోవైపు దక్షిణ కొరియాలో వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. బుధవారం ఒక్కరోజే 134 మంది కోవిడ్ బారిన పడ్డారు. చైనాలో కోవిడ్ తీవ్రత క్రమేపీ తగ్గుతోంది. చైనా జాతీయ ఆరోగ్య కమిషన్ అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. మంగళవారం 52 మంది వైరస్‌సోకి మరణించారు. ఇప్పటివరకూ ఈ వ్యాధితో మరణించిన వారి సంఖ్య 2715కు చేరుకోగా, వ్యాధితో ఉన్న వారి సంఖ్య 78,064కు చేరింది.

ఆగ్రహ జ్వాల

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో నిరసనల కార్యక్రమంలో పాల్గొన్న ఓ ఆందోళనకారుడు తనకు తాను నిప్పుపెట్టుకున్న దృశ్యం

అద్దె గర్భాల బిల్లుకు కేబినెట్ ఓకే

న్యూఢిల్లీ: మహిళలు తమ ఇష్టంతో గర్భాశయాన్ని ఇతరులకు అద్దెకివ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈ మేరకు అద్దె గర్భం నియంత్రణ బిల్లు-2020పై బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోద ముద్ర వేసింది. వితంతువులు, విడాకులు పొందిన వారూ ఇతరులకు తమ గర్భాన్ని అద్దెకు ఇవ్వొచ్చని బిల్లు స్పష్టం చేసింది. సరోగసీపై గతంలోని ముసాయిదా బిల్లులన్నింటినీ అధ్యయనం చేసి రాజ్యసభ సెలెక్ట్ కమిటీ ఇచ్చిన సూచనలు అన్నింటినీ తాజా బిల్లులో పొందుపరిచినట్లు కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ మీడియాతో చెప్పారు. సరోగసీని వాణిజ్యానికి వాడకుండా నిరోధించడం, మంచి ఉద్దేశమైతే సరొగసీకి సహకరించడం ఈ కొత్త బిల్లు లక్ష్యాలని మంత్రి చెప్పారు. కొత్త బిల్లు ప్రకారం.. దేశంలో భారత్‌కు చెందిన దంపతులు మాత్రమే సరోగసీ చేపట్టేందుకు వీలుంటుందని మరో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. అబార్షన్ మొదలుకొని సరోగసి వరకూ వేర్వేరు అంశాల్లో మహిళల హక్కులపై ప్రధాని మోదీ విశాల దృక్పథంతో వ్యవహరిస్తున్నారని ఆమె చెప్పారు.

సరోగసీ చట్టాలను సవరిస్తూ గత ఆగస్టులో లోక్‌సభ ఒక ముసాయిదా బిల్లును ఆమోదించింది. అయితే దగ్గరి బంధువులే అద్దెకు గర్భాన్ని ఇవ్వొచ్చనే నిబంధనపై విమర్శలొచ్చాయి. దీంతో బిల్లును రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపింది. బీజేపీ ఎంపీ భూపేందర్ యాదవ్ నేతృత్వంలోని కమిటీ సరోగసీకి సంబంధించి అన్ని వర్గాల వారితోనూ చర్చించి బిల్లులో సవరణలను ప్రతిపాదించింది. సూచనలు చేసింది. వీటిని పొందుపరిచిన బిల్లును బుధవారం కేబినెట్ ఆమోదించగా బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే వీలుంది.

కశ్మీర్‌లో కేంద్ర చట్టాల అమలుకు ఆదేశాలు

కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో ఉమ్మడి జాబితాలోని 37 కేంద్ర చట్టాలు అమలు చేసే ఆదేశాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. గత ఆగస్టులో అవిభక్త కశ్మీర్ రాష్ట్రానికున్న ప్రత్యేక ప్రతిపత్తి హోదా(ఆర్టికల్ 370)ను రద్దుచేసి రాష్ట్రాన్ని 'జమ్మూకశ్మీర్', 'లడాక్' కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చడం తెల్సిందే. దేశం మొత్తానికి అన్వయించే కేంద్ర చట్టాలు (జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయించి) ఇకపై ఈ కేంద్ర పాలిత ప్రాంతాలకూ వర్తిస్తాయని అప్పట్లో ఒక ప్రకటన వెలువడింది. కేంద్రం ఆమోదంతో జమ్మూ కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ కింద ఆదేశాలు జారీ చేసేందుకు మార్గం సుగమమైంది. బుధవారం నాటి కేంద్ర కేబినెట్ సమావేశంలో హరియాణా, తమిళనాడుల్లో రెండు ఆహార సంబంధిత సంస్థలకు జాతీయ స్థాయి కల్పిస్తూ నిర్ణయం జరిగింది. ఇందుకు అనుగుణంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్,మేనేజ్‌మెంట్ చట్టానికి సవరణలు చేశామని జవదేకర్ తెలిపారు. జాతీయ స్థాయి గుర్తింపు తర్వాత ఆ సంస్థలు విదేశీ సంస్థల నుంచి నేరుగా సాయం పొందొచ్చు.

బిల్లులోని ముఖ్యాంశాలు

- కేంద్రం, రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల స్థాయిల్లో జాతీయ సరోగసీ బోర్డుల ఏర్పాటు
- అద్దెకు గర్భాన్ని ఇచ్చే మహిళకు చేసే బీమా మొత్తాన్ని 36 నెలలకు పెంచారు.
- మానవ పిండాలు, గామేట్స్ (బీజం) కొనుగోలు, విక్రయాలపై నిషేధం. నైతిక సరోగసికి మాత్రమే అనుమతి. భారతీయ దంపతులు, భారతీయ సంతతి దంపతులు, 35-45 ఏళ్ల వితంతు మహిళ లేదా విడాకులు పొందిన మహిళలకే సరోగసి అనుమతి లభిస్తుంది.

ట్రాక్‌పైకి కంబళ వీరుడు!

మంగళూరు: కంబళ పోటీల్లో ఉసేన్‌బోల్ట్ కంటే వేగంగా పరుగెత్తాడన్న రికార్డు సొంతం చేసుకున్న శ్రీనివాస గౌడ త్వరలో రన్నింగ్ ట్రాక్‌పైకి ఎక్కనున్నాడు. బురదతో నిండిన పొలంలో బర్రెలతో కలిసి పరుగెత్తే కంబళ పోటీల్లో గౌడ వంద మీటర్ల దూరాన్ని కేవలం 9.55 సెకన్లలో పూర్తి చేసి సంచలనం సృష్టించిన విషయం తెల్సిందే. ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) దక్షిణభారత విభాగం డైరెక్టర్ అజయ్ భేల్, ఇతర అధికారులు కాసరగోడ్ జిల్లాలోని పైవలికేలో శ్రీనివాసతో మాట్లాడి శిక్షణకు ఆయనను ఒప్పించారు. బెంగళూరులోని శాయ్ కేంద్రంలో శ్రీనివాసకు శిక్షణనివ్వనున్నారు. ఈ ఏడాది కంబళ పోటీలు ముగిశాక, ఏప్రిల్‌లో శ్రీనివాస శిక్షణ కేంద్రంలో చేరే అవకాశముంది. మూడుబిద్రిలో నిర్మాణ రంగ కార్మికుడిగా పనిచేస్తున్న శ్రీనివాస ఈ ఏడాది కంబళ పోటీల్లో ఏకంగా 39 పతకాలు కైవసం చేసుకోవడం విశేషం.

సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 27

ఈ ధోరణి ప్రమాదకరం!

దేశ రాజధాని ఢిల్లీ అల్లర్లు కేవలం దురదృష్టకర ఘటనలా? నియంత్రించగలిగీ అదుపుతప్పిన అరాచకాలా? రాజకీయ వ్యవస్థ తీవ్రంగా ఆలోచించవలసిన విషయం. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం, తాజా ఘటనల్ని అత్యంత ప్రమాదకరమైన పరిణామాలుగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోక పోతే దేశ ప్రజానీకంలోనే కాదు కనీసం ఢిల్లీ వాసుల్లోనూ విశ్వాసం కలిగించలేదు. క్రమంగా సగటు పౌరుల గుండెల్లో గూడుకట్టుకుంటున్న భయాందోళనల్ని తొలగించలేదు. భద్రతకు భరోసా ఇవ్వలేదు. ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిపోయింది. రెండు డజన్లకుపైగా విలువైన ప్రాణాలు గాల్లో కలిశాయి. వందలమంది క్షతగాత్రులై, కోట్ల రూపాయల ఆస్తులు బుగ్గిపాలైన దుర్ఘటనలు ఏ ప్రమాణాలతో చూసినా తీవ్రంగా గర్హించదగినవే! అనుచిత ఉపేక్ష, తీవ్ర నిర్లక్ష్యం, ఘోర వైఫల్యం... వెరసి ఈ దురవస్థ! ఒక ప్రభుత్వ విధానానికి అనుకూల, ప్రతికూల కలహాలు క్రమంగా మతఘర్షణల రూపుదిద్దుకున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం చుట్టూ రగులుకుంటున్న ఘర్షణల అగ్నికి ద్వేషపు మాటలు ఆజ్యం పోశాయి. నియంత్రణ లేని అసాంఘీక శక్తుల విచ్చలవిడి తనం హింసాకాండను రగిల్చింది. ఇది ఇంకే దారుణాలకు దారి తీస్తుందోనన్న భయం సర్వత్రా అలుముకుంటోంది. ఇటువంటి విపరిణామాల పట్ల నిశిత పరిశీలన, సరైన అవగాహన, లోతైన అధ్యయనం అవసరం. అంతకు మించి రాజకీయ నిబద్ధత ముఖ్యం. తక్షణ నివారణ చర్యలు అత్యవసరం. మీరే కారణమంటే, కాదు మీరే... అంటూ పరస్పరం విమర్శించుకునే సమయం కాదిది. నిఘా, నియంత్రణ వ్యవస్థలు సమర్థంగా పనిచేయడమే కాక రాజకీయ పక్షాలన్నీ సంయమనంతో వ్యవహరించి, వెంటనే శాంతి నెలకొల్పాల్సిన అవసరమెంతో ఉంది. ఇవి రాత్రికి రాత్రి చెలరేగిన అల్లర్లు కావు. ఉద్రేకం కట్టలు తెగి అక్కడికక్కడ జరిగిన అనూహ్య పరిణామాలూ కావు! చిన్న చిన్నగా మొదలై దేశ రాజధాని, ఈశాన్య ఢిల్లీలో దాదాపు రెండు రోజుల పాటు దమనకాండ కొనసాగుతూనే ఉంది. మత విద్వేషం కట్టలు తెంచుకోవడంతో నడిరోడ్లలో నెత్తురు చిందింది. ఇంటి దిక్కు కన్ను మూసిన ఎన్నో కుటుంబాల్లో విషాదం మిగిలింది. ఇటీవల కొంత కాలంగా ఢిల్లీలోనే జరుగుతున్న వరుస పరిణామాల్లో తాజా అల్లర్లకు సంబంధించిన మూలాలు సుస్పష్టంగానే ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ముసుగు దుండగుల అరాచకాల నుంచి జామియా మిలియా విశ్వవిద్యాలయంలో మారణాయుధాలతో జరిగిన దాడుల వరకు అన్నీ భవిష్యత్ ప్రమాదాలకు సంకేతాలే! 'తోటకూర నాడే...' అన్న సామెత చందంగా, నాటి దాడుల్ని తీవ్రంగా పరిగణించి, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని ఉంటే స్పష్టమైన సంకేతాలు వెళ్లి ఉండేవి. తెగించి ఉన్మాదులు ఇంతలా చెలరేగడానికి ఆస్కారం ఉండేది కాదు. నాటి దాడులకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకునుంటే అంతో ఇంతో ఫలితాలిచ్చేవి. తగిన చర్యలు తీసుకోలేని దుస్థితి తాజా దాష్టీకాలకు దారులు పరిచింది. వాటిని అంచనా వేయడంలో, రాగల ప్రమాదాల్ని శంకించడంలో, నివారణ చర్యలు తీసుకోవడంలో వివిధ వ్యవస్థలు విఫలం చెందిన పర్యవసానమిది. ముఖ్యంగా పోలీసు, నిఘా వ్యవస్థల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అందుకే సుప్రీంకోర్టు పోలీసుల పనితీరును తప్పుబట్టింది. ఇది పోలీసుల వృత్తిపరమైన నైపుణ్యాల లోపమా? విధి నిర్వహణలో పోలీసులు స్వేచ్ఛా-స్వతంత్ర్యాల్ని కోల్పోయిన తీరు ఫలితమా? ఆలోచించాలి. మొదటిదైనా, రెండోదైనా... రెండూ కారణమైనా ఇందులో పాలనావ్యవస్థల పాపమూ ఉన్నట్టే! పరిస్థితిని సరిగా అంచనా వేసి, పరిణామాల్ని విశ్లేషించి వృత్తి నైపుణ్యంతో పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా ప్రతి విపత్కర పరిస్థితిలోనూ... పాలకుల సైగల కోసమో, సంకేతాల కోసమో చూసే దుస్థితి ఉండకూడదన్న న్యాయస్థానం వ్యక్తీకరణ పరిస్థితికి అద్దం పట్టింది.

పరస్పర విరుద్ధ భావాలు, భిన్నాభిప్రాయాలతో ఏ విషయంలోనైనా ప్రతిష్టంభన ఏర్పడ్డపుడు తొలగించుకునేందుకు ప్రజాస్వామ్యంలో అనేక ప్రక్రియలున్నాయి. సంప్రదింపు మార్గాలున్నాయి, న్యాయస్థానాలున్నాయి. రాజకీయ ప్రతిష్టంభనలు తొలగించుకునేందుకు చర్చల ప్రక్రియ ప్రపంచ వ్యాప్తంగా ఆమోదం పొందిన పరిష్కార మార్గం. పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక, అనుకూల వర్గాలు తమ అతివాద ధోరణి వీడి సంయమనం పాటించాలి. ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు తమ వంతు కృషి చేయాలి. ప్రభుత్వం చొరవ తీసుకొని చర్చల ప్రక్రియ ద్వారా సమస్యను పరిష్కరించే సామరస్య సాధనకు చిత్తశుద్ధితో యత్నించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత! భావోద్వేగాల్ని ప్రేరేపించే, ఉద్రిక్తతలు సృష్టించే ఏ పరిస్థితికీ ఆస్కారం ఇవ్వకూడదు. అలా జరుగవచ్చని అనుమానించినపుడు ప్రభుత్వం వాటిని నియంత్రించే నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. మత ఘర్షణల వంటి సున్నిత, ఉద్రిక్త వాతావరణం నెలకొన్నపుడు వదంతుల వ్యాప్తి నిరోధానికి యత్నించినట్టే విద్వేష ప్రసంగాలనూ ప్రభుత్వం కట్టడి చేయాలి.

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి శాసనసభ వేదికగా 'అల్లరి మూకలు అల్లరి మూకల చేతిలో హతమయ్యాయి...' అని ఇటీవల చేసిన ఒక వ్యాఖ్య పాలకుల బాధ్యతారాహిత్యాన్నే వెల్లడి చేస్తోంది. కొంతమంది పాలకపక్ష నాయకుల ద్వేష ప్రసంగాలు ఢిల్లీలో పరిస్థితిని దిగజార్చాయనడానికి, సదరు ప్రసంగాలపై పాలక బీజేపీలో వ్యక్తమైన భిన్నాభిప్రాయాలే నిదర్శనం. సదరు వక్తలపై కేసు నమోదు చేయకపోవడాన్ని న్యాయస్థానమూ తప్పుబట్టింది. తాజా ఘర్షణలపై ఇటీవలి ఢిల్లీ శాసన సభ ఎన్నికల ఫలితాల సరళి ప్రభావం కూడా ఉందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఢిల్లీ అల్లర్లు మరో ప్రమాద సంకేతాన్నీ వెల్లడించాయి! మారణాయుధాలతో పెట్రేగిన అల్లరి మూకలు తమకు చేజిక్కిన వారి మతం నిర్ధారించుకొని మరీ దాడులకు పాల్పడ్డాయని వచ్చిన వార్తలు నిజమైతే.. అది అత్యంత ప్రమాదకర పరిణామం! ఏం చేసైనా ఈ ప్రమాదకర పోకడల్ని మొగ్గలోనే తుంచాల్సిన అవసరం ఉంది. శాంతి పునరుద్ధరణ సమిష్టి బాధ్యత!

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.చవితి రా.3.45 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం రేవతి రా.10.43 వరకు, తదుపరి అశ్విని వర్జ్యం ఉ.9.26 నుంచి 11.12 వరకు, దుర్ముహూర్తం ఉ.10.15 నుంచి 11.02 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.40 వరకు అమృతఘడియలు... రా.8.03 నుంచి 9.50 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

ఈ 'దీవెనలు' బడుగుల వెలుగుదివ్వెలు

బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఉన్నతి కోసం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా తీసుకొస్తున్న అమ్మ ఒడి, పూర్తి ఫీజులు-విద్యాదీవెన-జగనన్న వసతి దీవెన వంటి పథకాలు తాడిత, పీడిత, అణగారిన కులాల్లో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలుకుతాయి. అనుభవజ్ఞులు, తలలు పండిన మేధావులకు, రాజకీయవేత్తలకు, సిద్ధాంతకర్తలకు, సంఘసంస్కర్తలకు, ఉద్యమకారులకు, ప్రజాసంఘాలకు రాని ఈ ఆలోచన చిన్న వయసులోనే వైఎస్ జగన్‌కు రావడం విశేషం. ఎవరి ఊహలకు అందని విధంగా ఈ స్కీములను ప్రవేశపెట్టారు. భావితరాలకు దుఃఖానికి తావులేని, ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలకు తావులేని సమాజాన్ని నిర్మించే పథకాలివి. ప్రజలను శాశ్వతంగా అభివృద్ధి చేస్తూ తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ముందుచూపుతో ఈ పథకాలను ప్రవేశపెట్టడం చరిత్రాత్మకం.

విశ్లేషణ

ఆర్. కృష్ణయ్య

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మొన్న ప్రారంభించిన జగనన్న వసతి దీవెన-విద్యాదీవెన, అంతకు ముందు ప్రకటించిన అమ్మ ఒడి పథకం బలహీన వర్గాల ప్రజల జీవితాలకు కాంతి రేఖలు-వెలుగు దివ్వెలు. చదువుల విప్లవం. ఈ పథకాల ద్వారా దశాబ్దకాలంలో అణగారిన కులాల్లో సమూలమైన మార్పు జరుగుతుంది. సమగ్రమైన అభివృద్ధి జరుగుతుంది. తాడిత, పీడిత, అణగారిన కులాల్లో ఇది ఒక విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలుకుతుంది. పదేళ్ల తర్వాత ఏపీలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో గుణాత్మకమైన మార్పులు జరుగుతాయి. ఈ స్కీమ్ పెట్టడంతో ప్రతి పేదవారు పాఠశాల విద్యతో పాటు ఉన్నత విద్యను చదువుకునే ప్రోత్సాహం లభించింది. కూలీ-నాలీ చేసుకునే కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదివించే అవకాశం కలిగింది. చదువు విలువ తెలియని కుటుంబాల వారు కూడా ఈ డబ్బు వస్తుందనే ఆశతో తమ పిల్లలను తప్పనిసరిగా చదివించడానికి ముందుకు వస్తారు.

దేశంలో, ప్రపంచంలో ఎక్కడ కూడా లేని పథకాలు ఇవి. ఎవరి ఆలోచనలకు అందని పథకాలు ఇవి. రాజకీయాలకతీతంగా ఈ పథకాల అమలును ప్రతిపక్షాలు కూడా ప్రశంసించాలి. ఈ స్కీములు పెట్టడం సీఎం వైఎస్ జగన్ సాహసోపేతమైన చర్య. ఈ స్కీము వలన డాక్టర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే కలలుగన్న జ్ఞాన సమాజం వస్తుంది. ఈ స్కీము పెట్టి ముఖ్యమంత్రి జీవితం చరితార్థం అయ్యింది. తండ్రిని మించిన తనయుడుగా చరిత్రలో నిలిచిపోతారు. అనుభవజ్ఞులు, తలలు పండిన మేధావులకు, రాజకీయవేత్తలకు, సిద్ధాంతకర్తలకు, సంఘసంస్కర్తలకు, ఉద్యమకారులకు, ప్రజాసంఘాలకు రాని ఈ ఆలోచన చిన్న వయసులోనే వైఎస్ జగన్‌కు రావడం విశేషం. ఈ పథకాలు పెట్టాలని ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు, ఏ ప్రజాసంఘం ఉద్యమాలు చేయలేదు. ఎవరి ఊహలకు అందని విధంగా ఈ స్కీమును ప్రవేశపెట్టారు. భావితరాలకు దుఃఖానికి తావులేని, ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలకు తావులేని సమాజాన్ని నిర్మిస్తుంది.

ఈ జగనన్న విద్యా వసతి దీవెన పథకం కింద 11 లక్షల 87 వేల మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల నుండి 20 వేల వరకు స్కాలర్ షిప్ లభిస్తుంది. ఈ పథకం కింద రూ. 2300 కోట్ల వ్యయం అవుతుంది. అలాగే జగనన్న విద్యా దీవెన కింద కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరుచేసే పథకం కింద రూ.3,700 కోట్లు ఖర్చవుతాయి. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తి ఫీజుల స్కీము పెడితే 2012లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో అనేక షరతులతో నీరుగార్చారు. ఇప్పుడు ఆ పథకాన్ని పునరుద్ధరించడంతో బలహీన వర్గాల పిల్లలు ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ, డిగ్రీ తదితర ఉన్నత విద్యా కోర్సులు చదివే అవకాశం కలిగింది. అలాగే అమ్మ ఒడి పథకం కింద 42 లక్షల మంది తల్లుల ఖాతాలలో 82 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 15 వేల చొప్పున రూ. 6,400 కోట్లు ఇప్పటికే జమ కావడం ప్రారంభమయ్యింది. మొత్తం ఈ పథకాలకు రూ.12,400 కోట్లు ఖర్చవుతాయి. ఇంత భారీ మొత్తంతో

దేశంలో, ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రీ ఈ పథకాలను ప్రవేశపెట్టలేదు. చివరగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో కూడా ఇలాంటి స్కీములు లేవు. ప్రత్యేకంగా ఈ స్కీము వలన లబ్ధి పొందేది 95% మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలే.

ఈ పథకాల వ్యయాన్ని ఖర్చు కోణంలో చూడరాదు. ఇవి పెట్టుబడి పథకాలు. ఈ పథకాల వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజాభివృద్ధిలో పెద్ద ఎత్తున ప్రభావం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇంకా విప్లవాత్మకమైన మార్పులుంటాయి. ఒకసారి ఒక కుటుంబంలో ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ, తదితర కాలేజీ కోర్సులు చదివితే ఆ కుటుంబం శాశ్వతంగా, సమగ్రంగా, అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వ ఉద్యోగం వస్తుంది, లేదా ఐటీ కంపెనీలో ఉద్యోగం వస్తుంది లేదా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వస్తుంది లేదా స్వయం ఉపాధి పథకాలు, పరిశ్రమలు, కంపెనీలు పెట్టుకొని, అలాగే కాంట్రాక్టులు చేపట్టి అభివృద్ధి చెందుతారు. అలాగే ఇంజనీరింగ్, ఇతర పీజీ కోర్సులు, మెడిసిన్ చదివే వారు, విదేశాలకు వెళ్లి ఉద్యోగం లేదా ఉపాధి పొందుతున్నారు. దీని మూలంగా దేశానికి, విదేశ మారక ద్రవ్యం లభిస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి చేయూతనిస్తుంది.

ఇక ప్రభుత్వ కోణంలో చూస్తే, ఒకసారి ఒక కుటుంబం ఉన్నత చదువులు చదివితే, ఆ కుటుంబం ప్రభుత్వ రాయితీల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండదు. ఆదాయం పెరగడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముఖ్యంగా సబ్సిడీ బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణ పథకంపై ప్రభుత్వ భారం తగ్గిపోతుంది. పదేళ్ల కాలంలో 40 శాతం, మరో పదేళ్ల కాలంలో మరో 50 శాతం మొత్తం 20 ఏళ్ల కాలంలో 90% సబ్సిడీ పథకం కింద లబ్ధి పొందేవారు, అభివృద్ధి పథకాల కింద లబ్ధి పొందేవారు అభివృద్ధి చెంది పెన్షన్ పథకం, సబ్సిడీ పథకాలు వద్దనే స్థాయికి ఈ కుటుంబాలు ఎదిగిపోతాయి. వీటిపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లో 90 శాతం బడ్జెట్ తగ్గిపోతుంది. అంతేకాదు ఈ విద్యా పథకాల భారం కూడా 20 ఏళ్ల తర్వాత ఉండదు. దీనిపై పెట్టే బడ్జెట్ భారం తగ్గిపోతుంది. ఒక తరంపై ఖర్చు పెడితే రెండవ తరంకు ఈ విద్యా పథకం స్కీముల అవసరం ఉండదు. చదువు మూలంగా అనేక కుటుంబాలు అభివృద్ధి చెంది, అధిక ఆదాయం పెరుగుతుంది. ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ ఇతర ఉన్నత విద్యా కోర్సులు చదివే వారి సంఖ్య పెరుగుతున్న కొద్దీ సబ్సిడీ స్కీములు, ఇతర విద్యాస్కీములు పొందేవారి సంఖ్య క్రమక్రమంగా తగ్గుతుంది. కాబట్టి పేదరికం అనే అర్హత ఉండదు. ఇక రెండవ తరం నుంచి సబ్సిడీ పథకాలు, విద్యా పథకాల అవసరముండదు. వీటిపై పెట్టే వేల కోట్ల బడ్జెట్ ఇతర పథకాలకు మళ్ళించవచ్చు.

పాలకులు ప్రతి ఒక్కరూ ఏ పథకం పెడితే ఓట్లు వస్తాయనే ఆశతో జనాకర్షక పథకాలు పెడతారు. అంతేకాని దీర్ఘకాలంలో సమాజాభివృద్ధి ఎలా జరుగుతుంది అని ఆలోచించరు. పెన్షన్లు, సబ్సిడీ రుణాలు, కలర్ టీవీలు, ఇతర పథకాలు పెట్టి ఎప్పుడూ ప్రభుత్వంపై ఆధారపడే యాచకులను చేస్తారు. కానీ జగన్ పథకాల ద్వారా ప్రజలను శాశ్వతంగా అభివృద్ధి చేస్తూ తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ముందుచూపు-విజన్‌లో ఈ పథకాలను ప్రవేశపెట్టడం చరిత్రాత్మకం. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీల సమగ్ర అభివృద్ధికి, సాధికారతకు అనేక స్కీములు పెట్టారు. ముఖ్యంగా నామినేటెడ్ పదవులలో 50 శాతం కోటా కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేశారు. అలాగే కాంట్రాక్ట్ వర్క్‌లలో 50 శాతం కోటా ఇచ్చి, పారిశ్రామిక పాలసీలలో 50 శాతం కోటా కల్పించి, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేశారు. ఈ స్కీములతో ఈ వర్గాలు కాంట్రాక్టర్లుగా, పరిశ్రమ అధిపతులుగా ఎదుగుతారు.. ఇంతవరకూ ఈ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రెండు శాతం ప్రాతినిధ్యం కూడా లేదు. ఇప్పుడు 50 శాతం ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఇదొక గొప్ప మలుపు.

దివంగత వైఎస్సార్ పేద పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలని ఫీజు రీయింబర్స్‌మెంట్, కాలేజీ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు పెడితే, కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి అంతకుమించి ఎవరి అంచనాలకు అందనంతగా అమ్మ ఒడి, పూర్తి ఫీజులు-విద్యాదీవెన- జగనన్న వసతి దీవెన పథకాలతో చరిత్ర సృష్టించారు. భవిష్యత్తులో ఇలాంటి పథకాలను ఏ రాష్ట్రం పెట్టినా, దేశం పెట్టినా జగన్ వారికి మార్గదర్శకుడుగా ఉంటారు. ఇవే కాక అనేక స్కీములు పెట్టారు. అన్నిరకాల పెన్షన్లు భారీగా పెంచారు, సబ్సిడీ పథకం కింద సన్న బియ్యం ఇస్తామన్నారు, లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేశారు, విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ 20 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో కట్టుబట్టలతో వెళ్ళింది. కేంద్ర సహాయం కూడా అంతంతే. పైగా బాగా ఆదాయాన్నిచ్చే ఎక్సైజ్ శాఖలో పాక్షికంగా మద్యపాన నిషేధం విధించడంతో వేల కోట్ల ఆదాయం తగ్గింది. ఇన్ని ప్రతికూల పరిస్థితులలో ఇన్ని విప్లవాత్మకమైన రూ. వేల కోట్ల ఖర్చు అయ్యే స్కీములు అమలు చేయడం ఒక్క జగన్‌కే సాధ్యం. విద్య ఒక్కటే మానవ వికాసానికి మార్గం. విద్య ద్వారానే బడుగు వర్గాలకు సాంఘిక సమానత్వం-సామాజిక న్యాయం దక్కుతుంది 10 నుంచి 20 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ భారత దేశంలోనే శక్తివంతమైన రాష్ట్రంగా రూపొందుతుంది. అజ్ఞానం, అంధకారం, అమాయకత్వం నుంచి ప్రజలను విముక్తి చేసి ఒక విజ్ఞానవంతమైన, శాస్త్రీయ జ్ఞానంతో కూడిన సమాజాన్ని నిర్మాణం చేయగలం.

వ్యాసకర్త అధ్యక్షులు, జాతీయ బి.సి. సంక్షేమ సంఘం
మొబైల్ : 90000 09164

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కారణం



"24వ తేదీ తీసిన ఈ వీడియోలో రోడ్డుపై పడి వున్న వ్యక్తి పేరు వినోద్ కుమార్, గాయపడినవారిలో ఆయన కుమారుడు నితిన్ కూడా ఉన్నాడు. మృత్యువుతో పోరాడి వినోద్ ఈ రోజు రెండు గంటల క్రితం మరణించాడు. అల్లరిమూకలు హఠాత్తుగా దాడికి పాల్పడటానికి తన బైక్‌పై ఉన్న జైశ్రీరామ్ స్టిక్కర్ తప్ప వేరే కారణమేమీ కనిపించడం లేదని నితిన్ నా దగ్గర వాపోయాడు. వాళ్లు అతని బైక్‌ని కూడా దగ్ధం చేశారు. ఆ నందు మొదట్లో ఉన్న అల్లరి మూకలు అల్లాహో అక్బర్ అని నినదించడం కూడా మీరు వీడియోలో చూడొచ్చు"

- స్వాతి గోయెల్ శర్మ, జర్నలిస్ట్

విన్నా

"మీ మాటలు విన్నా. మీ బాధను అర్థం చేసుకున్నా. కానీ, ఈ దేశం మాది కాదు. మేము ఈ దేశానికి చెందిన వాళ్లం కాదు. మేము అనాథలం, శరణార్థులం, ఎవరికీ ఏమీ కానివాళ్లం. కానీ ఈ రోజు నేను నిజం కళ్లల్లోకి సూటిగా చూడాలని అనుకుంటున్నా. అది మీ నుంచి ఎటువంటి క్షమాపణ కోరదు"

- సిద్రా, కవయిత్రి

క్షమించండి

"ప్రతి ఒక్క భారతీయ ముస్లింకూ నేను క్షమాపణ చెబుతున్నా. నా దగ్గర వున్నవి కాసిన్ని ఖాళీ మాటలు మాత్రమే. అవి కూడా సరిపోవు. రాజ్యం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతి చర్యకూ, నా మతం పేరిట జరుగుతున్న ప్రతి ఒక్క దాడికీ నేను క్షమాపణ చెబుతున్నా. ఈ దేశం మీదే. ఏదో ఒక రోజు అది మీ అనుభవంలోకి వస్తుంది"

- షాబీ నెల్లి, హక్కుల కార్యకర్త

అర్హత

"బాధతో పెడుతున్నవారి ట్వీట్లు చూస్తున్నా. కానీ ఏం మాట్లాడలేకపోతున్నా. పరిస్థితులేవీ సవ్యంగా లేనప్పుడు ఎవరైనా ఏం చెప్పగలరు. మాకు క్షమించమని అడిగే అర్హత కూడా ఉందని అనుకోవడం లేదు. ఇదంతా ఓ పీడకలగా మిగిలిపోయే రోజుకోసం నేను ప్రార్థన చేస్తున్నా. భారత్ తిరిగి మనందరికీ ఇల్లులా మారుతుందని ఆశిస్తున్నా"

- బను శివన్, రచయిత్రి

దాడులు

"ఒక ముస్లింగా ఇవి కేవలం హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలు కావని స్పష్టమవుతోంది. ఈ దాడులకు కారణమైనవారికి అండగా నిలుస్తున్నది ఢిల్లీ పోలీసులు, కేంద్రంలోని పెద్దలు. నేను వాళ్ల పథకం పారనివ్వను. హిందూ సోదర సోదరీమణులందరినీ ఏకమొత్తంగా నేను ద్వేషించను"

- అహ్మద్ బిలాల్, విద్యార్థి

రాజీనామా

"శాంతిభద్రతలను అధ్వానంగా నిర్వహిస్తున్నారని ఢిల్లీ హైకోర్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తప్పుబట్టింది. ఢిల్లీ తగులబడుతుంటే అడ్డుకోలేకపోయిన షాపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా విశ్వాసాన్ని కోల్పోయారు. ఇక మీరు ఎప్పుడు రాజీనామా చేస్తున్నారు?"

- స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

పిల్లల్ని చెరబట్టందే చదువు చెప్పలేమా?

సందర్భం

అచ్యుతరావు

ఒకరు వీపు విమానం మోత మోగిస్తారు, ఒకరు ఒళ్లు హూనం అయ్యేలా బాదుతారు. ఒకరు బెత్తం విరిగేదాకా కొట్టి చేతులు విరగ్గొడతారు, మరొకరు వెంటాడుతూ విద్యార్థి భవనం నుండి దూకి ప్రాణాలు కోల్పోయినా మా తప్పు కాదు తప్పంతా చచ్చిన విద్యార్థిదే అని నిస్సిగ్గుగా చెబుతారు. ఓ టీచరమ్మ పిల్లల్ని తనకున్న పశువులను కట్టేసే అపార అనుభవంతో స్కూల్లోనే పిల్లల్ని తాళ్లతో కట్టేస్తారు. ఇదేమంటే తాను పని చేసుకుంటుంటే పిల్లలు అల్లరి చేస్తున్నారని అంటారు. తన పని ఇంటిపని బడిలో చేసుకోవడం కాదని పాఠశాలకి వచ్చినప్పుడు పాఠాలు చెప్పాలనే జ్ఞానం లేకుండా మాట్లాడుతారు. మరోసారి వారు మా బడికి పోనీటైల్ వేసుకొస్తే శిగ తరుగుతామని అన్న ఆ పెద్ద సారువారు అన్నంత పనీ తన టీచర్లతో చేయించారు. నిత్యం ఎక్కడోచోట సారీ ఎన్నోచోట్ల పిల్లల్ని చెరబట్టందే పాఠాలు చెప్పలేమని సిద్ధాంతీకరించిన మన చండా మార్కుల వారసులైన కొందరు పంతుళ్లు, పంతులమ్మలకు పిల్లల్ని కొట్టి, తిట్టి నానా హింసలకు గురి చేయందే నిద్రపట్టదు. ఇలా పిల్లలకు బాల్యమన్నది లేకుండా ఆ మధుర స్మృతులు సైతం మదిలోకి రాకుండా చేస్తున్నారు.

పిల్లలమీద జరుగుతున్న ఈ ఘోరాలను ఆపాలని ఎవరికీ మనసురాదు. అవి అసలు ఘోరాల కిందకే లెక్కకు రావన్నట్టు అధికార గణం గణిస్తుంది. ఈ ఘోరాల్లో కొన్ని ఘటనలు మహారాజశ్రీ మన పోలీసు వారి దగ్గరికి వస్తే అటూ, ఇటూ పుస్తకాలు తిరగేసి న్యాయ సలహాదారుల అభిప్రాయం సేకరించి చివరకు ఓ చిన్న కేసుతో సరిపెట్టి, ఫైలును పక్కనపెట్టేసి.. ఇదెక్కడి పిల్ల కాకుల గోల మా చిన్నప్పుడు మమ్మల్ని మాత్రం తన్నంది బుద్ధి వచ్చిందా అని సూత్రీకరిస్తున్నారు.

పిల్లల్ని శారీరక, మానసిక హింసకు గురి చేయరాదని బాలల హక్కుల చట్టాలలో రాసి ఉన్నా.. అవి చదివే తీరిక, అమలు చేసే కోరికా ఏ అధికారికీ లేదన్నది నిజం. ఈ చట్టాలన్నీ తెలిసి వాటిని తు.చ. తప్పకుండా పాటించాల్సిన విద్యాశాఖ అధికార గణం తు.చ. ఇవేమీ పాడు చట్టాలు 'దొరకొడుకునైననూ తొడ పాశములుబెట్టి, బుగ్గలు నలుపంది బుద్ధి రాదు' అన్న పాత, పాడుబడిన పద్యాలు వల్లెవేసుకొని.. చదువు చెప్పినవాడు చావబాదడం నేరమా? ఛీ ఇవేం చట్టాలు అని ఆ చట్టాలను హేళన చేయడం తప్ప పిల్లలపై పంతుళ్ల, పంతులమ్మల దౌర్జన్యాలు జరిగినప్పుడు చర్యలు చేపట్టాలన్న ఇంగిత జ్ఞానాన్ని మరిచిపోతున్నారు. పిల్లల్ని చీల్చి చెండాడిన చండా మార్కులకే వంతపాడుతూ, వత్తాసు పలుకుతున్నారు. ఇటు పోలీసు, అటు విద్యా శాఖ అధికారుల తీరు ప్రైవేటు పాఠశాలలకూ, పిల్లల్ని హింసించే గురువర్యులకు కొంగు బంగారంగా మారుతోంది. పిల్లలు చచ్చిపోయినా సరే చదువు నేర్పి తీరాల్సిందే అనే వైఖరి పాటిస్తుంటేనే పాఠశాలలంటేనే పిల్లలకు పై ప్రాణాలు పైనే పోయి చదవడం కన్నా చాకిరీ చేసుకోవడమే మిన్న అని పిల్లలు బాల కార్మికులుగా మారిపోతున్నారు. ప్రభుత్వ పెద్దలు మాత్రం వారింకా పిన్నవారే కదా.. వారికి ఓటు హక్కు వస్తేనే కదా మన అవసరం అని అనుకుంటున్నారు. కానీ అక్షరాస్యత పెరగాలంటే బాల కార్మిక వ్యవస్థ సమూలంగా పోవాలంటే, బడి అంటే భయం కాదు ప్రేమ కలిగించాలి. చదువు అంటే కష్టం కాదు, ఇష్టం అనిపించాలని..

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 27-2-2020

మైండ్ స్టోరీ

డిజిటల్ డీటాక్సిఫికేషన్

చేతులకు పత్యం పెట్టండి

శరీరంలో ఉన్న మలినాలను బయటకు పంపడానికి వారంలో ఒకరోజు ఉపవాస దీక్ష ఎలా చేపడ్తామో.. బంధాలు, అనుబంధాలు పెంచుకోవడానికి డిజిటల్ డిటాక్సిఫికేషన్ దీక్ష అలా అవసరం.

లంకణం పరమౌషధం అన్నారు పెద్దలు. పొట్టను మాడిస్తే జబ్బు పారిపోతుందని అంటారు. మరి చేతులను మాడిస్తే? వాటికి ఫోన్ దొరక్కుండా చేస్తే? కంప్యూటర్ దొరక్కుండా చేస్తే? టీవీ రిమోట్ దొరక్కుండా చేస్తే? చేతులకు పత్యం పెడితే? ఈ పత్యం చాలా మంచిది అంటున్నారు నిపుణులు. సోషల్ మీడియాకు, స్మార్ట్‌ఫోన్ వ్యసనానికి వారానికి ఒకసారి లంకణం పెట్టిస్తే కుటుంబ అనుబంధాలు దగ్గరికి వస్తాయి. మనుషులు దగ్గర అవుతారు. సంతోషం దగ్గరికొస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే దూరమైనవన్నీ దగ్గరకొస్తాయి.

ఒక కుటుంబం.. అత్యంత సన్నిహితులతో ఆత్మీయసమ్మేళనం జరుపుకుంటోంది. చిన్నాపెద్దా, యూత్ అంతా కలిసి పాతిక మంది వరకూ ఉన్నారు. కాని ఆ ఇంట్లో ఏమాత్రం సందడి లేదు. హాల్లో వినిపిస్తున్న, కనిపిస్తున్న ఎల్ఈడీ టీవీ సౌండ్ తప్ప. వయసులో పెద్దవాళ్లు నలుగురైదుగురు టీవీలో లీనమయ్యారు. మిగిలిన వాళ్లంతా స్మార్ట్ ఫోన్స్‌తో ఎంగేజ్ అయ్యారు. పిల్లలు ఎవరికి వారే తమ చేతుల్లో ఉన్న ట్యాబ్స్‌లో గేమ్స్ ఆడుకుంటున్నారు. మధ్యవయస్కులు యూట్యూబ్‌లో వీడియోలు చూసుకుంటున్నారు. మగవాళ్లు తాము కూర్చున్న చోటే కాస్త పక్కకు తిరిగి ఫోన్ మాట్లాడుకుంటున్నారు. మెసేజ్ చేసుకుంటున్నారు. ఆడవాళ్లు సెల్ఫీలు దిగుతున్నారు. ఆ సమ్మేళనానికి హాజరైన వారితోనే ఫ్యామిలీ గ్రూప్‌లో చాట్ చేసుకుంటున్నారు. అక్కడే వాళ్ల సమక్షంలో దిగిన ఫోటోలనే అందులో పెడుతున్నారు. వాళ్ల పక్కనే ఉన్న వాళ్లు.. 'వావ్ .. నైస్.. భలే ఉంది చీర.. డిజైన్ చేయించావా?' ' హేయ్.. నీ ఫొటో వెనక కనపడుతున్న షో పీస్ భలే ఉంది... అమెజాన్‌లో కొన్నావా?' అంటూ కామెంట్లు పెడుతున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలదైతే అదో లోకం. పబ్జీ నుంచి టిక్‌టాక్‌ల దాకా.. ఈ మూల ఒకరు.. ఆ బాల్కనీలో ఒకరు.. కారిడార్‌లో ఒకరు.. కిచెన్‌లో ఒకరు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కోచోట ఒక్కో యాప్‌లో బిజీ. తీరా ఎప్పటికో పెద్దవాళ్లకు ఆకలేసి టీవీలోంచి మొహం బయటపెట్టి మిగిలిన వాళ్లను పలకరించే ప్రయత్నం చేశారు. ఎవరూ ఈ లోకంలో లేరు. అంతలోకే ఫోన్‌లోంచి తన చుట్టూ ఉన్న పరిసరాల మీదకు దృష్టి మరల్చిన ఆ ఇంటి కోడలికి పరిస్థితి అర్థమై ఆ ఫ్యామిలీ గ్రూప్‌లోనే మెసేజ్ పెట్టింది 'లంచ్ చేద్దామా?' అంటూ.

'యెస్' అంటూ ఒకరివెంట ఒకరు రిప్లయ్. లంచ్ చేసేప్పుడు కూడా చిన్న పిల్లలు తమ చేతుల్లోంచి ట్యాబ్స్ తీసి పక్కన పెట్టలేదు. నిజానికి ట్యాబ్స్ తీసేస్తే ముద్ద మింగడం లేదు వాళ్లు. దాంతో తల్లులు అందులో రైమ్స్ పెట్టి.. అన్నం తినిపించడం మొదలుపెట్టారు. ఆ ట్యాబ్ వంకే కళ్లప్పగించి గబగబా ముద్దలు మింగేస్తున్నారు. ఏం తింటున్నామో.. దాని రుచి ఏంటో కూడా తెలియనంతగా.

• • •

అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్న ఫ్రెండ్స్ గ్రూప్ ఒకటి సినిమాకు వచ్చింది. అందరూ కలిసి సినిమా చూడాలని ప్లాన్ చేసుకొని మరీ వచ్చారు. సినిమా టైమ్‌కు కంటే కాస్త ముందే వచ్చారు. 'హాయ్' అంటూ విష్ చేసుకోవడం తప్ప వాళ్లు మాట్లాడుకున్నదేమీ లేదు. ఎవరి ఫోన్లో వాళ్లు మెసేజ్‌లు, వీడియోలు చూసుకుంటూ ఉన్నారు. ఇంతలోకే సినిమా టైమ్ అయింది. అలాగే ఫోన్లు చూసుకుంటూనే లోపలికి వెళ్లారు. సీట్లు వెదుక్కొని కూర్చున్నారు. సినిమా విన్నారు.. సెల్‌ఫోన్ చూసుకున్నారు.

• • •

పెళ్లవుతోంది...

పెళ్లికి హాజరైన అతిథుల్లో చాలామంది చేతుల్లో ఫోన్లు. ఆ ఫోన్లలోనే వాళ్ల దృష్టంతా. పెళ్లిని చూసిందే లేదు. నవ్వుకుంటూ ఆటపట్టించుకోవడమూ లేదు. సెల్ఫీలు దిగారు. వీడియోలు తీసుకున్నారు. ఎన్నాళ్లుగానో కలవని చాలామంది ఆ పెళ్లిలో కలుసుకున్నారు. ఆ ఆనందం ఎవరి మొహాల్లోనూ లేదు పెద్దగా. మాటామంతీ జరపలేదు. కాలక్షేపం అంతా స్మార్ట్‌ఫోన్‌తోనే జరిగింది.

• • •

పైన చెప్పిన ఉదంతాలన్నీ 'హికికొమోరి'కి దగ్గరగా ఉన్నాయి. జపాన్‌లోని యువతను, మధ్య వయస్కులను ఇంకా చెప్పాలంటే స్కూల్‌కు వెళ్లే పిల్లలనూ పీడిస్తున్న మానసిక జాడ్యం హికికొమోరి. ఒక వ్యక్తి తనంతట తానుగా ఇంటికే పరిమితమైపోయి బాహ్య పరిసరాలు, మనుషులకు దూరమైపోవడం ఈ జాడ్యం లక్షణం. ప్రస్తుతం మన దేశంలో మనుషులంతా కలిసి ఒకే చోట ఉన్నా ఫోన్ల వల్ల ఎవరికి వారుగానే ఉన్నారు. అందరూ కలిసి ఒక వినోదాన్ని ఆస్వాదించాలని వచ్చినా ఎవరికి వారే సోషల్ నెట్‌వర్క్‌లో వినోదాన్ని వెదుక్కుంటున్నారు. కళ్లముందు వేడుక జరుగుతున్నా మనుషులను, పరిసరాలను గమనించడం లేదు.. గ్రహించడం లేదు. ఎలక్ట్రానిక్ డివైజే నేస్తం.. దానితోనే చెలిమి.. అదే ఒక బంధం.. బంధనంగా బతుకుతున్నారు.

దాన్ని నిరోధించాలంటే జీవన శైలి మార్చుకోవాలి అంటున్నాను మానసికవైద్య నిపుణులు, మనస్తత్వ శాస్త్రవేత్తలు. డిజిటల్ డిటాక్సిఫికేషన్ చేయాలి అంటున్నారు. అంటే శరీరంలో ఉన్న మలినాలను బయటకు పంపడానికి వారంలో ఒక రోజు ఉపవాస దీక్ష ఎలా చేపడ్తామో కుటుంబంతో పాటు చుట్టాలు, స్నేహితులు, నిత్యం మనం మెదిలే పరిసరాలతో బంధాలు, అనుబంధాలు పెంచుకోవడానికి డిజిటల్ డిటాక్సిఫికేషన్ దీక్ష అవసరం అంటున్నారు.

వారానికి ఒకరోజు సెల్‌ఫోన్‌తోపాటు దానికి అనుసంధానంగా ఇంటర్నెట్, అది వాహకంగా ఉన్న సోషల్ మీడియాకు దూరంగా ఉండడం, రోజంతా దాన్ని ఉపయోగించకుండా మన చుట్టూ భౌతిక ప్రపంచానికి దగ్గరగా మెదలడమే డిజిటల్ డిటాక్సిఫికేషన్. మనుషులను ఆక్రమించుకున్న ఈ సాధనాల వల్ల కలిగే దుష్పరిణామాలు అర్థమై ఇప్పుడు అంతా వాటిని ఉపవసించే పనిలో పడ్డారు. ఈ ఉపవాస దీక్ష ఒక ధోరణిలా మొదలైనా... ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు దీన్నొక శుభ పరిణామంగా అనుకోవచ్చు.

– కథనం : సాక్షి ఫ్యామిలీ

అసలు జీవితం చిన్నదైపోతుంది

స్మార్ట్‌ఫోన్‌కు అలవాటు పడిన మెదడు పూర్తిగా స్మార్ట్‌ఫోన్ మీదే ఆధారపడిపోతుంది. అసలు జీవితం చిన్నదైపోతుంది. చేతిలోనో కనుచూపు మేరలోనో ఫోన్ కనిపించకపోతే ఏదో అభద్రతగా అనిపిస్తుంది. ఇదొక వ్యసనం. అందులోంచి బయట పడడానికి ఈ డిజిటల్ డీటాక్సిఫికేషన్ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుంది. ఒక్కసారిగా ఫోన్‌కు దూరంగా ఉండకుండా.. నెమ్మదిగా అంటే ముందు ఓ గంట, తర్వాత గంటన్నర, ఆ తర్వాత రెండు గంటలు.. ఇలా రోజురోజుకు దాన్ని దూరంగా ఉంచే సమయాన్ని పెంచుకుంటూ పోయి వారానికి ఒకరోజు పూర్తిగా ఫోన్ ఉపయోగించక పోవడం.. ఆ తర్వాత వారానికి రెండు రోజులు.. ఇలా పెంచుకుంటూ పోయి.. ఆ వ్యసనాన్ని మానుకోవచ్చు. ఈ అడిక్షన్ ఆల్కహాలు, స్మోకింగ్ లాంటిదే. అలవాటు పడిన మెదడు ఊరుకోదు. అందుకే ఫోన్‌లో గేమ్స్ ఆడాలి. అయితే ఒక్క విషయం... ఈ డిజిటల్ డిటాక్సిఫికేషన్ ప్రక్రియ ముందు పెద్దల నుంచే స్టార్ట్ అవ్వాలి. అప్పుడే పిల్లలు మనల్ని అనుసరిస్తారు.

– డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, సైకియాట్రిస్ట్

కరిష్మా కపూర్

మెంటల్‌హుడ్

మార్చి 11 నుంచి ఆల్ట్-బాలాజీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో కరిష్మా కపూర్ నటిస్తున్న 'మెంటల్‌హుడ్' వెబ్ సిరీస్ మొదలవుతున్నాయి. మదర్‌హుడ్ (మాతృత్వం) కి దగ్గరగా ఉన్న ఈ మెంటల్‌హుడ్ అనే మాటలో.. పిల్లలు తల్లికి ఎంతగా పిచ్చిపట్టిస్తారో చెప్పే అర్థం గుంభనంగా ఉంది. ఈ సిరీస్ కథాంశం కూడా అదే. పిల్లల్ని సముదాయించడం కోసం తల్లి నిత్యం వేసే ఆసనాలను ఏక్తాకపూర్ చూపించబోతున్నారు. ''నాకు వచ్చిన అవార్డులన్నీ ఒక ఎత్తు, నా పిల్లలు ఒక ఎత్తు. నా కెరీర్ మొత్తం ఒకటి, వీళ్లిద్దరూ ఒకటి'' అని మెంటల్‌హుడ్ ట్రైలర్ విడుదల సందర్భంగా కూతురు సమీరను, కొడుకు కయాలను చూపిస్తూ కరిష్మా అన్నారు. కరిష్మకు 2003లో సంజయ్ కపూర్ అనే బిజినెస్‌మేన్‌తో పెళ్లయింది. 2016లో ఆయనతో విడిపోయారు.

ఉచితం

స్కాట్లాండ్

దేశవ్యాప్తంగా పీరియడ్ ప్రొడక్ట్స్‌ని ఉచితంగా పంపిణీ చేసే బిల్లుకు స్కాట్లాండ్ పార్లమెంటు బుధవారం ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. త్వరలోనే ఆ దేశంలోని కమ్యూనిటీ సెంటర్‌లలో, మందుల షాపులలో శానిటరీ న్యాప్‌కిన్స్, టాంపన్స్ వంటివి ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందుకోసం ప్రభుత్వానికి ఏటా 200 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

చెట్టు నీడ

అంతవరకే

బుద్ధుడిని చూడడం కోసం ఓ రోజు అనేక మంది వచ్చారు. ఆ సమయంలో బుద్ధుడు ఓ చెట్టు కింద ఉన్న అరుగు మీద కూర్చుని ఉన్నారు. బుద్ధుడి చేతిలో ఓ పట్టు రుమాలు ఉండటం చూసి అక్కడున్న వారందరికీ ఆశ్చర్యం వేసింది. విలాసాలకూ, ఖరీదైన వస్త్రాలకూ ఆమడదూరంలో ఉండే బుద్ధుడి దగ్గర పట్టు రుమాలు ఉండటమేమిటని అందరూ చెవులు కొరుక్కున్నారు. అక్కడ మౌనం ఆవరించిన తర్వాత బుద్ధుడు తన చేతిలో ఉన్న రుమాలుని చూపిస్తూ 'ఏమిటిది?' అని అడిగారు. అందరూ ఒక్క మాటగా అది పట్టు రుమాలు అని చెప్పారు. అనంతరం బుద్ధుడు ఆ రుమాలుతో అయిదు ముడులు వేసి చూపిస్తూ 'ఇప్పుడిదేమిటీ?' అని అడిగారు. అందరూ మళ్లీ ఒక్క మాటగా అది పట్టు రుమాలు అనే చెప్పారు.

అప్పుడు బుద్ధుడు ఇలా చెప్పారు. 'ఈ రుమాలకు అయిదు ముడులు ఉన్నాయి. అవి ఏంటంటే.. హింసకు పాల్పడకపోవడం, చైతన్యం కలిగి ఉండటం, అత్యాశకు దూరంగా ఉండటం, అబద్ధం చెప్పకపోవడం, నిజాయితీతో కూడిన సత్ప్రవర్తన కలిగి ఉండటం. ఈ అయిదూ అనుసరించగలిగితే ఎవరితోనూ ఏ గొడవలూ రావని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ అయిదు పురోగతికీ, మానసిక ప్రశాంతతకూ ఎంతో అవసరం' అన్నారు. నిజానికి ఈ విషయం చెప్పడానికే బుద్ధుడు అయిదు ముడులు వేశారు. కానీ ఆ వచ్చినవాళ్లెవరూ ఆ ముడులు ఏమిటి అని అడక్కుండా.. అసలు ఆ ముడులనే పట్టించుకోకుండా.. ఆ రుమాలు పట్టు వస్త్రం అన్నంత వరకే గమనించగలిగారు.

– యామిజాల జగదీశ్

అర నిముషం

నిర్ణయం వారిదే

• ఎలాన్ మస్క్, పాప్ గాయని గ్రిమ్

కెనడా పాప్ గాయని గ్రిమ్.. రేపో మాపో తల్లి కాబోతున్నారు. నెలలు నిండుతున్నప్పటి ఫొటో ఒకదాన్ని తాజాగా ఆమె తన ట్విట్టర్ అకౌంట్‌లో పోస్ట్ చేయగానే అభిమానులు ఎంతగానో సంతోషించారు. వారిలో ఒకరు.. 'మీ కడుపులో ఉన్నది మగబిడ్డా, ఆడబిడ్డా?' అని అడగనే అడిగారు. అందుకు గ్రిమ్ సరైన సమాధానమే ఇచ్చారు. ఏ జెండర్‌గా పుట్టాలన్నది పూర్తిగా ఆ పుట్టే వాళ్ల నిర్ణయమే' అని అన్నారు. 31 ఏళ్ల గ్రిమ్ స్పందించిన తీరులోని పరిణతి.. ఇక ముందు ఇలాంటి ప్రశ్నలకు తావు లేకుండా చేయవచ్చు. 48 ఏళ్ల వయసు గల ఆమె బాయ్‌ఫ్రెండ్ (మ్యాన్‌ఫ్రెండ్ అనాలేమో) ఎలాన్ మస్క్ వల్ల ఆమె గర్భిణి అయ్యారు. ప్రఖ్యాత టెస్లా కంపెనీ సీఈవో అయిన ఎలాన్.. దక్షిణాఫ్రికా సంతతికి చెందిన తెల్లజాతీయుడు.

మీరూ చేరొచ్చు

దేశంలో మొదటిసారిగా 'ప్రెగ్నెన్సీ' కోర్సు మొదలవబోతోంది. అయితే ప్రెగ్నెంట్ అవడం ఎలా అనే సెక్స్ ఎడ్యుకేషన్ కోర్సు కాదు అది. గర్భం ధరించాక తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సిలబస్‌లో ఉంటుంది. అలాగే ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి అనేవి కూడా ఉంటాయి. లక్నో విశ్వవిద్యాలయం ప్రవేశపెట్టిన ఈ కోర్సు పేరు 'గర్భ సంస్కారం'. ఈ విద్యా సంవత్సరం నుంచే కోర్సును ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళలకు ఉపకరించే ఈ కోర్సును మగవాళ్లు కూడా చేయవచ్చా అనే సందేహం అక్కర్లేదు. గర్భిణి జాగ్రత్త గర్భిణిది మాత్రమే కాదు కదా. కోర్సుకు త్వరలోనే నోటిఫికేషన్ రాబోతోంది. అబ్బాయిలూ మీరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వీరప్పన్ కూతురు

• విద్యారాణి

గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌ను అతడి 52 ఏళ్ల వయసులో తమిళనాడు స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కాల్చి చంపారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ అడవుల్లో అతి భయంకరుడిగా అధికారులకు కంట కునుకు లేకుండా చేసిన వీరప్పన్ ఏనాడూ కుటుంబసభ్యులతో కలిసి ఉండలేదు. జీవితమంతా దొంగచాటుగానే గడిచింది. అతడు చనిపోయాకే అతడి భార్య ముత్తులక్ష్మి గురించి ప్రపంచానికి తెలిసింది. ఇద్దరు కూతుళ్లు విద్యారాణి, ప్రభ పేర్లు కూడా అప్పుడే బయటికి వచ్చాయి. విద్యారాణి 'లా' చదివారు. తండ్రి చేసిన నేరాలకు ప్రాయశ్చిత్తంగానో ఏమో సోషల్ సర్వీస్ చేస్తున్నారు. ఇప్పుడు బీజేపీలో చేరడం ద్వారా వార్తల్లోకి వచ్చారు.

ఇంటిప్స్

పీల్‌తో బోలెడు ప్రయోజనాలు

అరటిపండులో పోషకాలు మెండు. పండును తినేసి తొక్కను పడేస్తుంటాం. కానీ, వస్తువుల వాడకంలో అరటిపండు తొక్కను ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకుంటే పడేయడానికి ఇక చెత్తబుట్టను వెతకాల్సిన పనిలేదు.

• స్టీల్, వెండి వస్తువులపై మరకలు పోవడానికి, డిష్‌వాషర్ సోప్ రసాయనాలను తొలగించడానికి అరటిపండు తొక్కతో రుద్ది కడగాలి. సేంద్రీయ పోషకాలు ఉంటాయి కాబట్టి ఈ నీటిని మొక్కలకు పోయవచ్చు • నాన్‌స్టిక్ వంటపాత్రల లోపలి భాగాన్ని అరటిపండు తొక్కతో రుద్ది, కడిగితే కోటింగ్ త్వరగా పోదు • దుమ్ము లేకుండా తడి క్లాత్‌తో తుడిచి, ఆ తర్వాత అరటిపండుతొక్కతో రుద్దితే షూ శుభ్రపడి, మెరుస్తాయి • కట్టె ఫర్నీచర్, కట్టెతో తయారు చేసిన వస్తువులను అరటిపండు తొక్కతో రుద్ది, తడి క్లాత్‌తో తుడిస్తే మరకలు, గీతలు పోయి కొత్తవాటిలా మెరుస్తాయి • ఇంకు మరకలు పోవాలంటే అరటిపండు తొక్కతో రుద్ది, కడగాలి.

'నవ'తరం

బామ్మగారి బ్యాగులు

లతికా చక్రవర్తి వయసు 90 ఏళ్లు. ఈ వయసులో ఇంక పనులేం చేస్తారు.. 'కృష్ణా, రామా.. అనుకుంటూ రోజులు వెళ్లబుచ్చక..' అనుకుంటారు ఎవరైనా. కానీ, ఈ బామ్మ భారతదేశం నలుమూలలా ఆ ప్రాంతాలకే ప్రత్యేకమైన పాత చేనేత చీరలు, కుర్తాలు, బట్టలు సేకరించి వాటితో అందమైన 'పాట్లి' బ్యాగులు, పర్సులు తయారు చేస్తున్నారు. చేత్తో పట్టుకునే సంచులు, పర్సులను రీసైక్లింగ్ చేయడం అంటే ఈ బామ్మకు మహా ఇష్టం. "ఆడవాళ్లు ప్రతి బ్యాగ్‌తోనూ ఒక బంధాన్ని, ఓ ప్రత్యేకమైన కథను కలిగి ఉంటారు" అని చెబుతుంది. ఏ తరానికైనా పనికివచ్చే ఎన్నో ముచ్చట్లతో పాటు, పనే దైవంగా భావించాలని చెబుతున్న ఈ బామ్మ గారి గురించి తప్పక తెలుసుకోవాల్సిందే!

లతిక 1930లో అస్సాంలోని ధుబ్రి పట్టణంలో జన్మించారు. ''చదువులో ఎప్పుడూ ముందంజలో ఉండేదాన్ని. కానీ, మా కుటుంబ సంప్రదాయ పద్ధతులు పై చదువులకు వెళ్లకుండా నన్ను అడ్డుకున్నాయి. కాలేజీలో చేరకుండానే కృష్ణ లాల్ చక్రవర్తితో పెళ్లైంది. తను సర్వే ఆఫ్ ఇండియాలో సర్వేయర్‌గా చేసేవారు. ఆయన ఉద్యోగరీత్యా తను ఏ రాష్ట్రానికి వెళితే నేనూ అక్కడికి వెళ్లాను. బయటకు వెళ్లి గుర్తింపు తెచ్చే పనులు చేయాలని ఉండేది. కానీ, నా భర్తకు నేను బయటకు వెళ్లి సంపాదించడం ఇష్టం లేదు. ముగ్గురు పిల్లలు. వాళ్ల ఆలనా పాలనతో ఇంట్లోనే ఉండిపోయాను. కానీ, నా జీవితం ఇలాగే నాలుగ్గోడల మధ్య ఉండిపోకూడదు అనిపించేది. ఒక ఏడాది ఇంట్లో ఆర్థిక సమస్యలు వచ్చాయి. ఆ సమయంలో టీచర్‌గా పనిచేయాలనే ఆలోచనతో తొలిసారి బయటికి అడుగుపెట్టాను. పనిలో ఉన్న ఆనందం, స్వయంకృషితో సంపాదించే డబ్బు నాకు ఎనలేని సంతృప్తిని ఇచ్చాయి. ఆ తర్వాత ఎప్పుడూ ఇంటిపట్టున ఉండాలనే ఆలోచన కూడా చేయలేదు. మా రోజులు చాలా భిన్నంగా ఉండేవి. ఇప్పటిలా అప్పుడు చాలా వస్తువుల అవసరం లేదు. ఒకసారి వాడిన వస్తువులను తిరిగి చక్కగా ఉపయోగించుకునేవాళ్లం. ఎలాంటి భేషజాలు లేవు. ఒకరితో పోల్చి చూసుకోవడం ఉండేది కాదు. దీంతో చాలా సంతోషంగా ఉండేవాళ్లం'' అంటూ గతాన్ని గుర్తుచేసుకుంటారు లతిక.

వృథా ఇష్టం ఉండదు

యాభైఏళ్ల వయసులో భర్తను కోల్పోయిన లతిక పిల్లలతో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటూ రోజులు గడిపేశారు. అయితే, ఆమె స్వయంకృషి, అభిరుచి.. తొమ్మిది పదులకు చేరువవుతున్న దశలో మరో అధ్యాయానికి శ్రీకారం చుట్టేలా చేశాయి. ఇప్పుడు ఆమె ఒక బిజినెస్ ఉమెన్. తను తయారు చేసిన అందమైన 'పొట్లి' సంచులను తయారు చేస్తూ వాటిని అమ్ముతున్నారు. ''పాత బట్టలను పడేయడం అంటే ఇష్టముండేది కాదు. ఆ మాటకొస్తే ఏదైనా వృథా అవుతుంటే నా మనసు చివుక్కుమంటుంది. పాత చీరలతో పిల్లలకు కుర్తాలు కుట్టేదాన్ని. కుర్తాలతో పర్సులు, సంచులు తయారు చేసేదాన్ని. అయితే వాటిని అమ్మాలని ఎప్పుడూ అనుకోలేదు. మా బంధువుల్లోనే ఎవరైనా అడిగితే ఇచ్చేదాన్ని..'' అంటూ తన వ్యాపారం ఎలా మొదలైందీ వివరిస్తారు లతిక. రెండు-మూడు రోజుల్లో ఒక బ్యాగును తయారు చేస్తారామె. అలా.. మొదట ఓ 300ల బ్యాగులను తయారు చేశారు. బామ్మ ఆసక్తిని చూసిన మనవడు 'లతికాస్ బ్యాగ్' పేరుతో ఆమె కోసం ఒక వెబ్‌సైట్‌ని ప్రారంభించాడు. బామ్మ కుట్టిన బ్యాగులను వెబ్‌సైట్‌లో పెట్టడంతో వాటికి డిమాండ్ పెరిగింది. న్యూజిలాండ్, జెర్మనీ నుంచి కూడా లతిక బ్యాగులకు ఇప్పుడు గిరాకీ వస్తోంది!

లతికా చక్రవరి

సంతోషాన్నిచ్చే వ్యాపకం

''నా భర్త 65 ఏళ్ల క్రితం ఓ కుట్టుమిషన్‌ని కానుకగా ఇచ్చాడు. దానిమీదే ఈ బ్యాగులను కుట్టడం మొదలుపెట్టాను. మా కోడలు, కూతుళ్లు వాడేసిన చీరలూ తీసుకున్నాను. పాత క్లాత్‌తో కుట్టిన ఈ బ్యాగులకే టాజిల్స్, ఎంబ్రాయిడరీతో కొత్తగా రూపు కడతాను. అయితే బ్యాగులను అమ్మాలనే ఉద్దేశంతో ఈ పనిని మొదలుపెట్టలేదు. వీటి తయారీలో ఒక ఆనందాన్ని పొందుతాను. నా వయసును మర్చిపోతాను. నా భక్తి అంతా నా బ్యాగ్ రూపకల్పనలోనే ఉంటుంది. నా హృదయంతో వీటిని తయారు చేస్తాను. ఈ తరం అమ్మాయిలకు కూడా నా బ్యాగులు నచ్చుతున్నాయంటే ఎంతో గర్వంగా అనిపిస్తుంది. వయసు మీద పడినవాళ్లు కూడా నా బ్యాగులను ఇష్టపడతారు..' అంటూ బ్యాగుల గురించి ఎన్నో విషయాలను చెబుతారు లతిక.

ఈ బామ్మ తన వయసు పెరుగుతుందనే భావన దర చేరనీయరు. అందుకే తన గదిలో ఒక్క అద్దాన్నీ ఉంచుకోరు. ఎంతసేపూ స్నేహితులతో గడపడం, నలుగురి మధ్యలో మాట్లాడుతూ ఉండటాన్ని ఇష్టపడతారు. ముడతలు పడిన చేతులతో ముచ్చటగా తీర్చిదిద్దే ఒక్కో బ్యాగ్‌కు ఒక్కో అందమైన పేరు పెట్టి మురిసిపోతుంటారు

– ఆరెన్నార్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
27-2-2020

● ప్రభాస్

50 ఇయర్స్ స్పెషల్

ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ 50వ వసంతంలోకి అడుగు పెడుతుంది. ఈ సందర్భంగా బుధవారం స్పెషల్ అనౌన్స్‌మెంట్ చేశారు. సావిత్రి బయోపిక్ 'మహానటి' తెరకెక్కించిన నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ సినిమా ఉంటుందని ప్రకటన విడుదల చేశారు. తండ్రి అశ్వనీదత్‌తో కలసి స్వప్నా దత్, ప్రియాంకా దత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం. ప్రభాస్‌గారికి థ్యాంక్స్. ప్రస్తుతానికి సినిమా గురించి ఏం చెప్పదల్చుకోలేదు. ఇది ప్యాన్ ఇండియన్ సినిమా కాదు.. ప్యాన్ వరల్డ్ సినిమా'' అన్నారు నాగ్ అశ్విన్.

● ప్రభాస్, అశ్వనీదత్, నాగ్ అశ్విన్

బ్యాచిలర్ తొలి పాట రెడీ

● అఖిల్

అఖిల్, పూజా హెగ్డే జంటగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై 'బన్నీ' వాసు, వాసు వర్మ నిర్మిస్తున్నారు. గోపీసుందర్ సంగీతం అందించగా, సిద్ శ్రీరామ్ పాడిన ఈ చిత్రంలోని మొదటి పాటని మార్చి 2న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు, వాసు వర్మ మాట్లాడుతూ –''ఇటీవల విడుదల చేసిన అఖిల్, పూజా హెగ్డే ఫస్ట్ లుక్‌కి అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ముఖ్య తారాగణంతో పాటు అఖిల్, పూజా హెగ్డే ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఇటీవల సిద్ శ్రీరామ్ పాడిన ప్రతి పాట మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ చైర్ కొట్టేస్తున్నాయి. ఇదే తరహాలో మార్చి 2న విడుదల కానున్న మా సినిమా తొలి పాట కూడా ఆడియన్స్ విష్ లిస్ట్‌లో మొదటిస్థానంలో నిలుస్తుంది'' అన్నారు.

హిందీకి..

'ఘాజీ, అంతరిక్షం' చిత్రాలతో దర్శకుడిగా తన ప్రతిభను, ప్రత్యేకతను చాటుకున్నారు యంగ్ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి. తన మూడో సినిమాను బాలీవుడ్‌లో చేయడానికి సంప్రదింపులు చేస్తున్నారు. ఆల్రెడీ ఆ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు కూడా సిద్ధం చేస్తున్నారు. తాజాగా మరో బాలీవుడ్ సినిమా కూడా కమిట్ అయినట్లు సమాచారం. విద్యుత్ జమాల్ హీరోగా ఓ సినిమా తీయడానికి కథ సిద్ధం చేయమని విద్యుత్ తండ్రి సంకల్ప్‌ని కోరారట. ఆ కథను కూడా సిద్ధం చేసే పనిలో ఉన్నారట సంకల్ప్. ఈ రెండు ప్రాజెక్ట్స్‌లో ఏది ముందు సెట్స్ మీదకు వెళ్తుందో వేచి చూడాలి.

● సంకల్ప్ రెడ్డి

ఇంకా షాక్‌లోనే ఉన్నా

● శంకర్

వారంరోజుల క్రితం 'ఇండియన్ 2' సెట్లో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. భారీ క్రేన్ షూటింగ్ చేస్తున్న యూనిట్‌పై పడటంతో ముగ్గురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఇది జరిగి వారం అయింది. ''ఈ సంఘటన జరిగినప్పటి నుంచి నేను షాక్‌లోనే ఉన్నాను. నా అసిస్టెంట్ డైరెక్టర్, టీమ్‌లో ఇద్దరు చనిపోవడం నన్ను నిద్రలేని రాత్రులకు గురి చేస్తోంది. నేను ప్రమాదాన్ని తృటిలో తప్పించుకున్నప్పటికీ, ఆ క్రేన్ ఏదో నా మీద పడుంటే బావుండు అనిపిస్తోంది. చనిపోయినవారి కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను'' అని బుధవారం ట్వీట్ చేశారు శంకర్.

అపరిచితుల ప్రయాణం

● ఇంద్రజ, సుమంత్ అశ్విన్, ప్రియ వడ్లమాని

నలుగురు అపరిచితులు.. 3,450 కిలోమీటర్లు రోడ్డుపై ప్రయాణం.. వాళ్ల ప్రయాణం దేనికోసం? ఆ సమయంలో వాళ్లు ఎదుర్కొన్న అనుభవాలేంటి? అనే కథాంశంతో ఓ సినిమా మొదలైంది. సుమంత్ అశ్విన్, శ్రీకాంత్, ఇంద్రజ, ప్రియ వడ్లమాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకులు రామ్‌గోపాల్ వర్మ, పూరి జగన్నాథ్, నగేష్ కుకునూర్ వద్ద పని చేసిన గురుపవన్ ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయమవుతున్నారు. గురప్ప పరమేశ్వర ప్రొడక్షన్స్ పతాకంపై జి. మహేష్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కెమెరామేన్ సి. రాంప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, ఎన్.బి. బాలసుబ్రహ్మణ్యం క్లాప్ ఇచ్చారు. గురుపవన్ మాట్లాడుతూ –''భిన్న నేపథ్యాలు కలిగిన నలుగురు అపరిచితులు హైదరాబాద్ నుంచి బైకులపై చేసే ప్రయాణమే ఈ సినిమా. మార్చి 2న తొలి షెడ్యూల్ మొదలుపెడతాం'' అన్నారు. ''శ్రీకాంత్, ఇంద్రజ వంటి మంచి నటులతో పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది'' అన్నారు సుమంత్ అశ్విన్. ''శ్రీకాంత్, నేను 'జంతర్ మంతర్' సినిమాతో హీరో హీరోయిన్లుగా పరిచయమయ్యాం. ఇన్నాళ్లకు ఆయనతో మళ్లీ సినిమా చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది'' అన్నారు ఇంద్రజ. ''గురు పవన్ చెప్పిన కథ నచ్చడంతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నా'' అన్నారు మహేష్. ప్రియ వడ్లమాని, సంగీత దర్శకుడు సునీల్ కశ్యప్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చిరంజీవి ఎల్. మాట్లాడారు. అమ్ము అభిరామి, నాజర్, పృథ్వీ, ఈశ్వరీ రావు, సప్తగిరి తదితరులు ఇతర పాత్రల్లో నటించనున్నారు.

ఏడుసార్లు చెంపదెబ్బ తిన్నా

● తాప్సీ

ఆర్టిస్టుల తప్పిదం వల్లో, సాంకేతిక కారణాల వల్లో, దర్శకుడు సంతృప్తి చెందకపోవడం వల్లో కొన్నిసార్లు చేసిన సన్నివేశాన్నే మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తుంది. 'తప్పడ్' సినిమా షూటింగ్‌లో అలాంటి సందర్భమే ఒకటి ఎదురైందట తాప్సీకి. ఒక సన్నివేశం కోసం ఆమె సుమారు ఏడు సార్లు చెంపదెబ్బ తిన్సాలి వచ్చిందట. అనుభవ్ సిన్హా దర్శకత్వంలో తాప్సీ నటించిన తాజా చిత్రం 'తప్పడ్' (చెంపదెబ్బ అని అర్థం). ఈ సినిమాలో ఓ సన్నివేశంలో తాప్సీ చెంపదెబ్బ తినాలి. సినిమాలో చాలా కీలకమైన సన్నివేశం అది. కథను మలుపు తిప్పే చెంపదెబ్బ అది. కరెక్ట్‌గా రావడం కోసం సుమారు ఏడు టేక్‌లు చేశారట తాప్సీ, నటుడు పావైల్ గులాటీ. అంటే... ఏడుసార్లు చెంప దెబ్బ తిన్నారట తాప్సీ. ''చెంపదెబ్బ కొట్టడానికి నా కోస్టార్ పావైల్ సంకోచించారు. చాలా టెన్షన్ పడ్డారు. ఆరు టేక్‌లు పూర్తయ్యాయి. సరిగ్గా రావడం లేదు. 'ఏం ఆలోచించకు. లాగిపెట్టి కొట్టేయ్' అన్నాను. ఏడో టేక్ సరిగ్గా వచ్చింది'' అని ఆ సీన్ తీయడానికి వెనక జరిగిన స్టోరీ చెప్పారు తాప్సీ. 'తప్పడ్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది.

జైలుకి హార్వీ వెయిన్‌స్టీన్

తమపై లెంగిక వేధింపులు జరిపాడు అంటూ హాలీవుడ్ బడా నిర్మాత హార్వీ వెయిన్‌స్టీన్‌పై ఆరోపణలు చేశారు పలువురు హాలీవుడ్ నటీమణులు. దాంతో 'మీటూ' ఉద్యమం ఊపందుకుంది. తాజాగా హార్వీ వెయిన్‌స్టీన్‌పై వచ్చిన ఆరోపణలు నిజమే అంటూ జ్యూరీ తేల్చింది. పన్నెండు మంది (ఏడుగురు మగవాళ్లు, ఐదుగురు ఆడవాళ్లు) సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ జ్యూరీ ఐదురోజులపాటు సమీక్షించి వెయిన్‌స్టీన్‌పై వచ్చిన ఆరోపణలోని నిజానిజాలు తేల్చారు. ఈ కేసులో వెయిన్‌స్టీన్‌కి ఐదేళ్ల నుంచి 25 ఏళ్లు జైలు శిక్ష పడే అవకాశం ఉందట. మార్చి 11న వెయిన్‌స్టీన్ జైల్‌కి వెళ్లనున్నారు. అయితే ఆయన ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరారు. ''వెయిన్‌స్టీన్ గురించి బయటకు వచ్చి మాట్లాడిన వాళ్లకి, ఇన్ని రోజులు ఆ బాధను అనుభవించిన వాళ్లందరికీ ధన్యవాదాలు. మీ ధైర్యం ప్రపంచంలో ఎందరో మహిళలకు పబ్లిక్ సర్వీస్‌లాంటిది. మరోసారి అందరికీ థ్యాంక్స్'' అన్నారు నటి ఆష్లే జూడ్. వెయిన్‌స్టీన్ గురించి తొలిసారి బాహాటంగా ఆరోపణ చేశారామె. ఆ తర్వాత మిగతావాళ్లు బయటికొచ్చారు.

● హార్వీ వెయిన్‌స్టీన్

స్వేచ్ఛలాంటి సినిమాలు అవసరం

- మాజీ మంత్రి తీగల కృష్ణారెడ్డి

● తీగల కృష్ణారెడ్డి, చమ్మక్ చంద్ర, రాజు నాయక్, మంగ్లీ

''అక్కినేని నాగేశ్వర రావు, ఎన్టీఆర్‌ల కాలంలో సినిమాలు వంద రోజులు ఆడటం మనం చూశాం. ప్రస్తుతం ఆ రోజులు లేవు. ఎన్నో మార్పులు వచ్చాయి. అయినా కొత్త తరహా సినిమాలు వస్తున్నాయి.. కొత్త హీరోలు వస్తున్నారు'' అని మాజీ మంత్రి తీగల కృష్ణారెడ్డి అన్నారు. గాయని మంగ్లీ లీడ్ రోల్‌లో కెపీఎన్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'స్వేచ్ఛ'. రాజు నాయక్ నిర్మించిన ఈ సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ– ''స్త్రీ జాతికి జరుగుతున్న అన్యాయంపై సందేశాత్మకంగా నిర్మించిన 'స్వేచ్ఛ'లాంటి చిత్రాల అవసరం నేటి సమాజానికి ఎంతైనా ఉంది'' అన్నారు. ''ఆడపిల్లలను రక్షించండి.. చెట్లను సంరక్షించండి అనే సందేశంతో 'స్వేచ్ఛ' తీశారు. ఇందులో మంచి పాత్ర చేశాను'' అన్నారు నటుడు చమ్మక్ చంద్ర. ''ఇది బంజారాలకు సంబంధించిన సినిమా కాదు.. ప్రజలకు సంబంధించిన చిత్రం'' అన్నారు మంగ్లీ. ''ఇలాంటి సినిమాలకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లాంటి వారు సహకారం అందించాలి'' అన్నారు దర్శకుడు, హీరో కేపీఎన్ చౌహాన్. ''మా సినిమా మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది'' అన్నారు రాజు నాయక్. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు భోలే, సరస్వతీ డెవలపర్స్ రాజు నాయక్, సతీష్ నాయుడు, తారకేష్, బాలనటుడు చక్రి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కుదిరింది

ఐదేళ్ల డేటింగ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టారు బాలీవుడ్ తారలు అలీ ఫజల్, రీచా చద్దా. త్వరలోనే ఈ జంట పెళ్లి చేసుకోబోతోంది. 2012లో 'ఫక్రీ' సినిమాలో కలసి నటించిన ఈ ఇద్దరూ 2015 నుంచి డేటింగ్ చేస్తున్నారు. 2017లో వీళ్ల రిలేషన్‌షిప్‌ని అధికారికంగా ప్రకటించారు. ఇటీవలే మాల్దీవుల్లో హాలిడేకి వెళ్లారు రీచా, అలీ. అక్కడ రీచాను అలీ పెళ్లి చేసుకుందామని ప్రపోజ్ చేయడం, ఆమె అంగీకరించడం జరిగిపోయాయట. ఏప్రిల్ 15న ఢిల్లీలో కుటుంబ సభ్యుల మధ్య వివాహం చేసుకోవాలనుకుంటున్నారట. ఆ తర్వాత ముంబైలో రిసెప్షన్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు.

● అలీ ఫజల్, రీచా చద్దా

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ గురువారం
27-2-2020

సెప్టిసీమియా

రక్తానికి ఇన్ఫెక్షన్

మన దేహంలోని ఏ భాగానికైనా ఇన్ఫెక్షన్ రావడం మనం చూస్తుంటాం. కళ్లకు వస్తే కళ్లకలక (కంజెక్టివైటిస్) అనీ, కాలేయానికి వస్తే హెపటైటిస్ అనీ, అపెండిక్స్‌కు వస్తే అపెండిసైటిస్ అని చెప్పుకోవడం మనందరికీ తెలిసిందే. మరి శరీరంలోని అన్ని అవయవాలకూ వచ్చినప్పుడు రక్తానికి కూడా ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందా? ఉంది. కాకపోతే దీని గురించి మనకు అంతగా తెలియదు. రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్‌ను మనం వాడుక భాషలో 'రక్తం విషంగా మారిపోయింది' అని వ్యవహరిస్తుంటాం. నిజానికి ఈ పరిస్థితి చాలా ప్రమాదకరమైది. ప్రతి ఏటా చాలా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ రక్తానికి ఇన్ఫెక్షన్ వచ్చే కండిషన్ బారిన పడుతున్నారు. వైద్య పరిభాషలో సెప్టిసీమియా లేదా సెప్సిస్ అని పిలిచే ఈ కండిషన్ ఎందుకు ఏర్పడుతుంది? అదెంత ప్రమాదకరం? అలాంటి పరిస్థితుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?... ఇలాంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

ముందుగా సెప్టిసీమియా అంటే ఏమిటో చూద్దాం. ఓ వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రక్తంలో ఎలాంటి సూక్ష్మజీవులూ ఉండకూడదు. రక్తంలోకి బ్యాక్టీరియా లేదా వైరస్ చొరబడితే అవి రక్తప్రవాహంలోకి ప్రమాదకరమైన రసాయనాలను విడుదల చేస్తూ ఉంటాయి. రక్తం మన దేహంలోని ప్రతి అవయవానికీ చేరి పోషకాలను అందిస్తుంది కాబట్టి... ఈ హానికారక సూక్ష్మజీవులు, అలాగే ఆ ప్రమాదకర రసాయనాలు సైతం ప్రతి అవయవానికీ చేరి అంతర్గత అవయవాలన్నీ వాచే ప్రమాదం ఉంది. అంటే ఏదైనా అవయవానికి ఇన్ఫెక్షన్ వస్తే అది చాలా సేపటి వరకు ఆ అవయవానికి మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉందోమోగానీ... రక్తానికి ఇన్ఫెక్షన్ వస్తే మాత్రం అది చాలా త్వరితంగా దేహమంతా పాకే ప్రమాదం పొంచి ఉంటుంది. ఇలా రక్తం ఇన్ఫెక్షన్‌కు గురికావడాన్ని సెప్టిసీమియా అంటారు. దీన్నే డాక్టర్లు సంక్షిప్తంగా 'సెప్సిస్' అని కూడా వ్యవహరిస్తుంటారు.

ఎందుకిలా జరుగుతుంది?

నిజానికి సెప్సిస్ అనేది ఓ ప్రాణాంతకమైన పరిస్థితే అయిన్పటికీ... ఇది ఒక అనివార్యమైన స్థితి. ఎందుకంటే... మన దేహంలో ఏదైనా అవయవానికి ఇన్ఫెక్షన్ సోకడమో, గాయాలు కావడమో జరిగినప్పుడు మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందిస్తుంది. అలాంటి ప్రతిస్పందన కాస్తా వికటించి, దేహమంతా పాకుతూ పోయినప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

సెప్సిస్‌లో రకాలు

సెప్సిస్ రెండు రకాలుగా కనిపిస్తుంది. 1. సెప్సిస్, 2. సెప్టిక్ షాక్. ఈ రెండు పరిస్థితుల్లోనూ యాంటీబయాటిక్స్ ఇస్తూ సదరు ఇన్ఫెక్షన్‌ను కట్టడి చేసేలా చికిత్స చేయాల్సి ఉంటుంది.

ప్రమాదకరమైన స్థితి ఎవరెవరిలో...

సెప్టిసీమియా లేదా సెప్సిస్ ఎవరికైనా సోకవచ్చు. అయితే కొంతమందిలో సెప్సిస్ ఏర్పడే పరిస్థితి మరింత ఎక్కువ. దీనికి తేలిగ్గా గురయ్యే వారు ఎవరంటే...

- బాగా పసివాళ్లు, పిల్లలు, వయోవృద్ధులు
- డయాబెటిస్, క్యాన్సర్, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులతో బాధపడుతున్నవారు
- తీవ్రంగా ఒళ్లు కాలిపోయి గాయాలకు గురైనవారు, ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులు.
- శస్త్రచికిత్స చేయించుకున్న పేషెంట్లు
- రోగనిరోధకవ్యవస్థ బాగా బలహీనంగా ఉన్న ఎయిడ్స్ రోగులు, కీమోథెరపీ చేయించుకుంటున్న వ్యక్తులు.

డా. వెంకట్ రామన్ కోలా,
సీనియర్ ఇంటెన్సివిస్ట్,
క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.

సెప్సిస్ లక్షణాలు - ముందస్తు హెచ్చరికలు

సెప్సిస్‌కు సంబంధించిన ఈ లక్షణాలను ముందస్తు హెచ్చరికలుగా భావించి, అత్యవసర వైద్యచికిత్స అందించాలి. ఈ లక్షణాలను గుర్తించడం, ప్రతిస్పందించడం సెప్సిస్ ఏర్పడిన వ్యక్తిని రక్షించుకోవడంలో చాలా కీలక భూమిక వహిస్తాయి.

- జ్వరం వల్ల శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగిపోతూ ఉంటుంది. లేదా కొంత మందిలో దేహ ఉష్ణోగ్రత చాలా తక్కువకు పడిపోయి చలితో వణికిపోతూ ఉంటారు.
- గుండె అధిక వేగంతో కొట్టుకుంటుంది.
- శ్వాసవేగమూ విపరీతంగా పెరిగిపోతుంది.
- విపరీతంగా చెమటలు పడుతుంటాయి.
- చర్మంలోని చిన్న రంధ్రాల నుంచి రక్తస్రావమై దద్దుర్లు ఏర్పడతాయి.
- రోగి మానసిక స్థితిలోనూ తీవ్రమైన మార్పులు వస్తాయి. నిద్రమత్తు ఆవరిస్తుంది. రోగి అయోమయానికి గురవుతాడు. ప్రతి విషయంలోనూ నిరాసక్తత.

సెప్సిస్ మరింత తీవ్రంగా మారినప్పుడు ఇంకా ప్రమాదకమైన లక్షణాలు కనిపిస్తాయి. ఇది సెప్టిక్ షాక్ స్థితి. ఈ లక్షణాలు కనిపించినప్పుడు తక్షణం రోగిని ఆసుపత్రికి తరలించాలి. ఆ వ్యక్తికి ఇటీవలై ఏవైనా ఇన్ఫెక్షన్లు సోకి ఉన్నా, లేదా శస్త్రచికిత్సలేమైనా జరిగినా, ఇతర ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉన్నా సెప్సిస్ చికిత్సకి ముందుగానే డాక్టరుకు ఆ విషయాన్ని తప్పక తెలియజేయాలి.

సెప్టిక్ షాక్‌లో...

- రోగి చురుకుదనాన్ని పూర్తిగా కోల్పోయి, అయోమయానికి గురవుతాడు.
- తన పరిస్థితి పూర్తిగా దిగజారిందనీ, మరణం ఖాయమని అనిపిస్తోందని చెబుతుంటాడు.
- తలతిరుగుతున్నట్లు అనిపిస్తుంది. మాటలు తొట్రుపడుతుంటాయి. వేగంగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తుంటాడు.
- పొట్టలో వికారం, వాంతులు, విరేచనాలు
- విపరీతమైన కండరాలనొప్పి
- మూత్రం కొద్దిగా మాత్రమే వస్తుంది.
- చర్మం చల్లబడుతుంది. వివర్ణమవుతుంది.
- స్పృహ ఉండదు.

చికిత్స

సెప్సిస్ ప్రధానంగా బ్యాక్టీరియా వల్లనే ఏర్పడుతుంది. అది ఏ బ్యాక్టీరియా కారణంగా వచ్చిందన్న అంశాలను పక్కనబెట్టి, రోగి రక్తానికి ఇన్ఫెక్షన్ వచ్చిందని తెలియగానే అత్యవసరంగా రెండు అంచెల్లో చికిత్స అందించాల్సి ఉంటుంది. మొదటిది యాంటీబయాటిక్స్ ఇవ్వడం. రెండోది దేహంలోని అంతర్గత అవయవాలను రక్షించడం. ఇందుకోసం కృత్రిమంగా శ్వాస అందిస్తారు. సెలైన్‌తో సహా అవసరమైన ఇతర ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం మొదలుపెడతారు. సెప్సిస్ అని అనుమానించినప్పుడు అందుకు కారణం అయివుంటుందనుకున్న బ్యాక్టీరియాను అదుపు చేసేందుకు అవసరమైన యాంటీబయాటిక్స్ ఇవ్వడం మొదలుపెట్టేస్తారు. ఆ వెంటనే... సదరు ఇన్ఫెక్షన్‌కు కారణమైన సూక్ష్మజీవిని గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు చేసి, నిర్దిష్టంగా ఆ సూక్ష్మజీవిని నిర్ధారణ చేశాక అందుకు అవసరమైన మందులను మారుస్తారు. రోగి శరీరంలో సెప్సిస్ ఏ భాగం నుంచి వ్యాపించడం ప్రారంభమైందో గుర్తించి వెంటనే దాన్ని తొలగించేందుకు ప్రయత్నిస్తారు. ఇందులో భాగంగా ఇన్ఫెక్షన్ వ్యాప్తి చేస్తున్న కణజాలాన్నీ, వాచిన ప్రాంతంలోని చీమును తొలగించడం మొదలు పెడతారు. ఇందుకోసం అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స లేదా శస్త్రచికిత్స చేసిన వారికి ఉపయోగించిన ట్యూబ్స్ ద్వారా ఇన్ఫెక్షన్ వస్తోందని గుర్తించినప్పుడు వాటిని తొలగించడమో చేస్తారు.

నివారణ...

ఒక అంచనా ప్రకారం దేశ జనాభాలో ప్రతీ ఏటా దాదాపు రెండు శాతం మంది సెప్సిస్ బారినపడుతున్నారు. ఒక ఉజ్జాయింపుగా ప్రతి ఏటా రెండున్నర కోట్ల మందికి సెప్సిస్ సోకుతోంది. కొద్దిపాటి జాగ్రత్తలతో దీన్ని నివారించుకోవచ్చు.

- ఫ్లూ, నిమోనియా వంటివి సోకకుండా ఎప్పుడూ చేతులను పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- గాయాలైనప్పుడు లేదా చర్మం గీసుకుపోయినప్పుడు ఆ ప్రాంతాన్ని శుభ్రంగా కడుక్కుని గాయం తగ్గే చికిత్స తీసుకోవాలి.
- గోళ్లు శుభ్రంగా ఉంచుకోవాలి. డయాబెటిస్ రోగులు శరీరంపై ఎక్కడా పుండ్లు, గాయాలు లేకుండా జాగ్రత్త పడాలి.

సెప్సిస్‌ను గుర్తించి వెంటనే చికిత్స తీసుకుంటే ప్రాణాపాయాన్ని తప్పించవచ్చు. అది ఇతర కీలకమైన అవయవాలకు చేరితే చాలా ప్రమాదకరమని గుర్తించి జాగ్రత్త పడాలి.

అపోహ - వాస్తవం

వేళ్లు విరుచుకున్నప్పుడు చిటుకూ చిటుకూ అనడం ప్రమాదమా?

అపోహ: చాలాసేపు పనిచేశాక రిలాక్స్ అవడంలో భాగంగా చాలా మంది వేళ్లను విరుస్తుంటారు. ఇలా వేళ్లను వెనక్కి విరవగానే చిటుకూ... చిటుకూ అని ఓ శబ్దం వినిపించడం మనందరికీ అనుభవమే. అలాగే కొద్దిసేపటి వ్యవధిలోనే మళ్లీ రెండోసారి విరిస్తే ఈసారి అదే చిటపట శబ్దం రాదు. ఇలా... మరికాసేపటి తర్వాత రెండోసారి విరిచినప్పుడు ఎందుకు

చిటపటలాడలేదు, ముందెందుకు శబ్దం చేశాయి, దీనివల్ల ఏదైనా ప్రమాదమా... అనే అపోహ కొందరిలో ఉంటుంది.

వాస్తవం: చేతి వేళ్ల కీళ్లు పట్టేశాక వాటిని విరిచినప్పుడు చిటుక్కుమని శబ్దం చేయడం వల్ల ఎలాంటి అనర్థమూ వాటిల్లదు. దాంతో ఏదైనా ముప్పు కలుగుతుందన్నది అపోహ మాత్రమే. వేళ్ల కణుపుల దగ్గర (ఆ మాటకొస్తే ప్రతి కీలు దగ్గర) సైనోవియల్ ఫ్లూయిడ్ అనే కందెన లాంటి పదార్థం ఉంటుంది. వేళ్లలో కీళ్లమధ్య ఈ ఫ్లూయిడ్ చేరి, అక్కడున్న వాయువులతో ఓ చిన్న బబుల్‌లా ఏర్పడుతుంది. మనం వేళ్లను విరిచినప్పుడు, వాయువుతో నిండిన ఆ చిన్న చిన్న బుడగలు చటుక్కున పేలినట్లవుతాయి. వేళ్లు విరిచినప్పుడు మనం వినే శబ్దం ఆ బుడగలు పేలినప్పుడు వచ్చేదే. దీనివల్ల ఎలాంటి అనర్థమూ ఉండదు. ఒకసారి విరిచాక బబుల్స్ పగిలి, అవి మళ్లీ ఏర్పడటానికి కొంత సమయం తీసుకుంటుంది. అందుకే మళ్లీ విరిస్తే శబ్దం రాదు.

కాకర

చేదైనా సరే తినండి... చేటు తప్పించుకోండి

చాలామంది కాకరకాయను చూడగానే ముఖం చిట్లిస్తారు. చేదంటూ దాని జోలికే వెళ్లరు. కానీ కాయ చేదైనా దాంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. అందుకే వారంలో ఒకసారైనా కాకరకాయను ఏదో ఒక వంటకంగా చేసుకుని తినండి. వంట ప్రక్రియలో చేదును విరిచేసే ప్రక్రియలూ ఉంటాయి. వాటిని అనుసరించి కాకరకాయను తరచూ ఆహారంలో భాగంగా చేసుకోవడం కలిగే ప్రయోజనాలివే...

- కాకరకాయలో క్యాలరీలు చాలా తక్కువ అందుకే స్థూలకాయం, ఊబకాయం రాకుండా నివారిస్తుంది. క్యాలరీలు తక్కువగా పోషకాలు మాత్రం చాలా ఎక్కువ.
- ఇందులో విటమిన్ బి1, బి2, బి3, సి...లతో పాటు జీర్ణక్రియకు దోహదం చేసే పీచు ఎక్కువగా ఉంటుంది.
- మెగ్నీషియ్, ఫోలేట్, జింక్, ఫాస్ఫరస్, మాంగనీస్, ఐరన్, క్యాల్షియం, పొటాషియం వంటి ఖనిజ లవణాలూ ఎక్కువ.
- కాకరలోని విటమిన్-సి దేహంలోని ఫ్రీరాడికల్స్‌ను తొలగిస్తుంది. మన దేహంలో పుట్టే ఫ్రీరాడికిల్స్ మ్యాలిగ్నంట్ కణాల (క్యాన్సర్ కారక కణాలు) ఉత్పత్తికి దోహదం చేస్తాయి. ఇలా కాకర సాధారణ క్యాన్సర్లనే కాకుండా, లుకేమియా లాంటి బ్లడ్‌క్యాన్సర్లనూ నివారిస్తుంది.
- కాకర కాయ కడుపులో చేరిన పరాన్నజీవులను హరిస్తుంది. కడుపులో నిల్వ చేరిన విషపూరితమయ్యే వ్యర్థాలను తొలగిస్తుంది.
- కాకర మలేరియా బ్యాక్టీరియానూ తుదముట్టించగలదు. చికెన్‌పాక్స్, మీజిల్స్, హెర్పిస్, హెచ్ఐవి కారక వైరస్‌లను శక్తిహీనం చేస్తుంది.
- కాకర గింజలు గుండె పనితీరును క్రమబద్ధం చేస్తాయి. ఇవి రక్తనాళాల్లోని కొవ్వును కరిగించి గుండె గదులు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టకుండా రక్షిస్తాయి.
- డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు కాకర మంచి స్వాభావికమైన ఔషధంగా అనుకోవచ్చు. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచడానికి దోహదం చేస్తుంది. రక్తంలో గ్లూకోజ్ నిల్వలను తగ్గిస్తుందన్న విషయం చాలా మందికి తెలిసిందే.
- బ్లడ్‌ప్రెషర్‌లో హెచ్చుతగ్గులు లేకుండా చూస్తుంది.
- కాలేయంపై పడే అదనపు భారాన్ని కూడా కాకర నివారిస్తుంది.

వేళకు తినండి...

హాయిగా, సులువుగా బరువు తగ్గండి

ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కీ కనీసం 12 నుంచి 13 గంటల వ్యవధి పడుతుంది. రాత్రి ఎలాగూ నిద్రపోతుంటాం కాబట్టి ఆకలి అనిపించదు. ఈ మార్గం ద్వారా బరువు తగ్గడం సులువు. శ్రమ ఉండదు. పైగా ఆరోగ్యకరం కూడా. ఇలా వేళకు తినడం, రాత్రి నిద్రపోవడం ద్వారానే బరువు తగ్గవచ్చు. ఇది ఆరోగ్యకరమైన మార్గం కూడా.

రాత్రి వేళల్లో పని చేసేవారు...

సాధారణంగా రాత్రివేళల్లో పనిచేసేవారు లేదా రాత్రి నిద్రపట్టక మెలకువతో ఉండేవారు సాధారణంగా రాత్రంతా ఏదో ఒకటి తింటూ ఉంటారు. దాంతో బరువు పెరిగే అనర్థం చోటుచేసుకుంటుంది. నిజానికి మన ఆరోగ్యానికీ, భోజనవేళలకూ సంబంధం ఉంటుంది. మన మెదడులో ఉండే జీవగడియారం (బయలాజికల్ క్లాక్) ద్వారా ఆ రెండు అంశాలూ అనుసంధానమై ఉంటాయి. పగతిపూట వెలుతురు ఉండే సమయం పని కోసం, రాత్రి మన నిద్రకోసం... ఇలా ఆ వేళలకు తగినట్లుగా మన శరీరం ప్రోగ్రామ్ అయి ఉంటుంది. అందుకే మన శరీరం పగలు చురుగ్గానూ, రాత్రి నిద్రవస్తూ ఉంటుంది. దీన్నే 'సర్కాడియన్ రిథమ్'గా పేర్కొంటాం.

ఒక గడియారం పగలూ రేయికీ... మరొకటి ఆహారానికి...

వెలుగు, చీకట్లకు సంబంధించిన జీవగడియారంతో పాటు దానికి అనుసంధానితమై ఆహారానికి కూడా ఒక జీవగడియారం ఉంది. పగటివేళలో ఉన్నట్లే రాత్రివేళ్లలో కూడా కళ్లు మిరిమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో కృత్రిమ వెలుగును సృష్టించి, ఎప్పుడూ అంతే వెలుగులో ఉండటం వల్ల మనకు ఆరోగ్య సమస్యలు ఎదురైనట్లుగానే... పగలూ రేయీ చూసుకోకుండా అదేపనిగా తింటూ ఉండటం వల్ల కూడా సమస్యలు ఎదురవుతాయి. జీర్ణరసాలూ, జీవరసాయనాలూ పగలూ రేయీ తేడా లేకుండా అదేపనిగా స్రవిస్తుంటాయి. ''మనం ఎప్పుడూ తింటూనే ఉంటే మన రక్తంలో గ్లూకోజ్ పాళ్లు నిత్యం ఎక్కువగానే ఉంటుంటాయి'' అంటారు కాలిఫోర్నియా, శాన్‌డియాగోకు చెందిన రూత్ పాటర్‌సన్ అనే నిపుణుడు. దాంతో గ్లూకోజ్‌ను అదుపుచేసేందుకు ఇన్సులిన్ కూడా అస్తమానం స్రవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా అదేపనిగా ఇన్సులిన్ స్రవించడం అన్న అంశం క్యాన్సర్‌కు కారణాలైన ప్రీక్యాన్సరస్ కణాలను ప్రేరేపించడానికో లేదా పుట్టేలా చేయడానికో దారితీయవచ్చు. ఇలా అదేపనిగా రాత్రంతా తింటూ ఉండేవారిలో ఫ్యాటీలివర్ వచ్చే అవకాశాలూ ఎక్కువే. అలాగే కొలెస్ట్రాల్ మోతాదులూ విపరీతంగా పెరుగుతాయి. అలా కాకుండా రోజూ రాత్రివేళ మెలకువ లేకుండా, హాయిగా నిద్రపోవడం ద్వారా రాత్రివేళలో భోజనానికీ, ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కూ మధ్య కనీసం 12 నుంచి 13 గంటల వ్యవధి ఇచ్చేవారిలో డయాబెటిస్, ఫ్యాటీలివర్, గుండె జబ్బులు, రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలూ తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

జీర్ణవ్యవస్థకు రెస్ట్ ఇస్తే...

''రాత్రి నిద్రపోయే సమయంలో తిండి తినకుండా ఉండటం పెద్ద సమస్య ఏమీ కాదు. ఇక్కడ తిండిని ప్రయత్నపూర్వకంగా నిగ్రహించుకోవాల్సిన అవసరమూ ఉండదు. రాత్రి కనీసం 8 గంటలప్పుడు భోజనం చేసి... మర్నాడు ఉదయం మళ్లీ 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ చేస్తే చాలు... ఆటోమేటిగ్గా పన్నెండు గంటల వ్యవధి దొరుకుతుంది. ఈ పన్నెండు గంటల్లో జీర్ణవ్యవస్థ తనకు అవసరమైన విశ్రాంతి పొందుతుంది. ఈ మాత్రం విశ్రాంతి ఇస్తే అది సమర్థంగా పనిచేస్తుంది'' అంటారు పాటర్‌సన్. అయితే బ్రేక్‌ఫాస్ట్ ను ఎలాంటి పరిస్థితుల్లోనూ తప్పించకూడదు. ''బ్రేక్‌ఫాస్ట్ అంటేనే రాత్రి సుదీర్ఘంగా కొనసాగే ఉపవాసాన్ని (ఫాస్టింగ్‌ను) బ్రేక్ చేసేది అని అర్థం. రాత్రంతా నిద్ర టైమ్‌లో కొనసాగే ఉపవాసంలో ఒకవేళ మెలకువగా ఉన్నా ఎలాంటి ఆహారం తీసుకోకపోవడమే ఫాస్టింగ్ అంటే'' అంటూ వివరిస్తున్నారు సాల్క్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయలాజికల్ సైన్సెస్‌కు చెందిన పరిశోధకులు. బరువు తగ్గడానికి ఉపవాసాలు ఉండటం, డైటింగ్ చేయడమూ అవసరం లేదు. మన భోజన వేళలను కాస్తంత మార్చుకొని, రాత్రంతా తినకుండా ఉంటే చాలు. బరువు తగ్గడానికి ఇది చాలా మంచి మార్గం'' అంటారు హార్వర్డ్‌కు చెందిన మరో న్యూట్రిషన్ నిపుణుడు ఫ్రాంక్‌ష్యర్.

ఆరోగ్యకరంగా బరువు తగ్గడానికి కొన్ని సూచనలు!

- రోజులో సగం ఉపవాసం ఉండండి. అది నిద్రవేళ అయితే మరీ మంచిది. మీరు తినాలనే టెంప్టేషన్‌కు దూరంగా ఉంటారు. ఇలా చేయడం వల్ల రోజులో సగం వ్యవధి పాటు మీ జీర్ణవ్యవస్థకు విశ్రాంతి కూడా దొరుకుతుంది.
- రాత్రంతా నిద్రలో శరీరానికి భోజనం ఉండదు కాబట్టి... మళ్లీ రోజును ప్రారంభించగానే దినంలో కావాల్సిన శక్తి (ఎనర్జీ) కోసం బ్రేక్‌ఫాస్ట్‌ను కాస్త ఎక్కువ మొత్తంలోనే తినాలి. ఆ తర్వాత మధ్యాహ్న భోజనం మామూలుగా ఓ సామాన్యుడి భోజనంలా ఉండాలి. రాత్రి మాత్రం ఒకింత తక్కువే తినడం మంచిది. ఇలా ఉదయం తిండి భారీగా, మధ్యాహ్న భోజనం ఓ మోస్తరుగా... రాత్రి భోజనం మితంగా ఉండటం ఆరోగ్యదాయకం.
- రాత్రి మరీ పొద్దుపోయాక భోజనం చేయకండి. కాస్త పెందళాడే భోజనం చేయండి.
- రాత్రివేళలో నీళ్లు మాత్రమే తాగండి...
- నిద్రవేళల్లో ఒకవేళ మీరు మెలకువతో ఉన్నా ఏమీ తినవద్దు. మంచినీళ్లు మాత్రం తాగుతూ ఉండండి.
- ఇలా క్రమబద్ధంగా తింటూ, రాత్రిళ్లు హాయిగా నిద్రపోతూ మీ జీవగడియారాన్నీ, దాంతో అనుసంధానితమైన మీ భోజన జీవగడియారాన్ని సెట్ చేయండి. అది ఎల్లప్పుడూ మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

జీనత్ ఫాతిమా
కన్సల్టెంట్ డైటీషియన్,
కాంటినెంటల్ హాస్పిటల్,
హైదరాబాద్

epaper.sakshi.com

సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్వర్థయా వర్ధతే విద్య

గురువారం
27-2-2020

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

2020లో 1.5 లక్షల డేటాసైన్స్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అంచనా

ఆకర్షణీయ వేతనాలు అందిస్తున్న బీఎఫ్ఎస్ఐ

తర్వాతి స్థానాల్లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్‌లు

కెరీర్ కౌన్సెలింగ్

■ ప్రస్తుతం బీఏ(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ) చదువుతున్నాను. ఈ కోర్సు పూర్తయ్యాక ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి. ఉన్నత విద్యావకాశాల గురించి చెప్పండి?

-మహమ్మద్ షకీల్

ప్రస్తుతం బీఏలో(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ) సబ్జెక్ట్ కాంబినేషన్స్‌తో సర్టిఫికెట్ సొంతం చేసుకున్న వారికి ప్రభుత్వ విభాగాల్లో, ప్రైవేటు రంగంలో.. రెండింటిలోనూ మంచి ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రధానంగా సోషల్ వర్క్ ఆర్గనేజేషన్స్, ఎన్‌జీఓలు ఈ విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నాయి. ఇక.. విభాగాల వారీగా పరిశీలిస్తే.. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్ట్ ఆధారంగా ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ సంస్థల్లో అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. పొలిటికల్ సైన్స్‌పై పట్టుతో పొలిటికల్ క్యాంపెయిన్ స్పెషలిస్ట్, పొలిటికల్ అనలిస్ట్ వంటి ఉద్యోగాలతోపాటు మీడియా రంగంలోనూ కొలువులు అందుకోవచ్చు. సోషియాలజీతో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల

అమలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. బీఏలో(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ) కాంబినేషన్‌తో ఉద్యోగావకాశాల గురించి అన్వేషించడానికి బదులు.. బీఏ తర్వాత ఎంఏ స్థాయిలో ఈ మూడు సబ్జెక్ట్‌లలో ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌లో పీజీ చేస్తే మరింత ఉన్నత అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలు ముఖ్యంగా సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షల్లో వీరు మెరుగైన స్కోర్లు సాధించి ఎంపిక ప్రక్రియలో ముందంజలో నిలిచే అవకాశం ఉంది. కానీ నిపుణుల సలహా మేరకు పీజీ స్థాయిలో నిర్దిష్టంగా ఒక సబ్జెక్ట్‌లో స్పెషలైజేషన్ చేయడం వల్ల మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయి.

■ యూకేలో ఎంఎస్(ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) చేయాలనుకుంటున్నాను. ఈ కోర్సుతో ఎలాంటి అవకాశాలు లభిస్తాయి. ఎలక్ట్రికల్ విభాగంలో బెస్ట్ కోర్సులను సూచించండి?

-నరేంద్ర

యూకేలో ఎంఎస్ కోర్సుల్లో ఏ స్పెషలైజేషన్ అయినా.. 16 నెలల నుంచి రెండేళ్ల వ్యవధిలో ఉంటుంది. టాప్ యూనివర్సిటీల్లో మాత్రం రెండేళ్ల వ్యవధిలోనే కోర్సుల బోధన సాగుతుంది. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌కి సంబంధించి దాదాపు నలభైకి పైగా స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో.. ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రో ఆప్టికల్ ఇంజనీరింగ్, ఎంబెడెడ్ లైటింగ్ సిస్టమ్స్, లైటింగ్ డిజైన్ స్పెషలైజేషన్స్‌కు మంచి పేరుంది. వీటితోపాటు ఇటీవల కాలంలో పవర్ జనరేషన్ అండ్ సప్లయ్, రోబోటిక్ సిస్టమ్స్ వంటి ఆధునిక స్పెషలైజేషన్స్‌ను కూడా యూనివర్సిటీలు అందిస్తున్నాయి. కెరీర్ అవకాశాల కోణంలో ఇప్పుడు యూకేలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పీజీ ఉత్తీర్ణులకు డిమాండ్ నెలకొంది. ఈ విభాగంలో మానవ వనరుల డిమాండ్‌కు సరిపడే రీతిలో నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించకపోవడమే ఇందుకు కారణం. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ప్రధానంగా పవర్ జనరేషన్ సంస్థలు,ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో డిజైన్, డెవలప్‌మెంట్, రీసెర్చ్ విభాగాల్లో విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. యూకేలోని యూనివర్సిటీలు అందించే సర్టిఫికెట్లకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న కారణంగా ఆస్ట్రేలియా, కెనడా, యూఎస్, జపాన్ వంటి ఇతర దేశాల్లోనూ చక్కటి కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. వేతనాల పరంగా పీజీ స్థాయిలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులకు వారికి లభించిన హోదా ఆధారంగా సగటున 75 వేల యూరోల వార్షిక వేతనం అందుతోంది. డిజైన్, రీసెర్చ్ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకున్న వారికి లక్ష యూరోల వరకు వేతనం అందే అవకాశం ఉంది. ఈ కోర్సులో చేరాలంటే.. జీఆర్ ఈలో మంచి స్కోర్లు తప్పనిసరి. వెర్బల్ అండ్ క్వాంటిటేటివ్ విభాగాల్లో 150కు పైగా పర్సంటైల్ స్కోర్, అనలిటికల్ రైటింగ్‌లో నాలుగు పాయింట్ల వరకు స్కోర్ ఉంటే.. టాప్ యూనివర్సిటీల్లో ప్రవేశం సులభంగా లభిస్తుంది. దీంతోపాటు టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, పీటీఈ వంటి లాంగ్వేజ్ టెస్ట్ స్కోర్లు కూడా ఉండాలి.

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI
EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో మంచి ఉద్యోగం అందుకోవాలంటే.. ఏ కోర్సులో చేరాలి..ఏ టెక్నాలజీ నేర్చుకోవాలి.. ఏ విభాగంలో ఉద్యోగావకాశాలెక్కువ?! ఇలాంటి ప్రశ్నలకు సరైన సమాధానమే.. డేటాసైన్స్! 2020లో డేటాసైన్స్ విభాగంలో అబిరిపోయే అవకాశాలు లభిస్తాయని అంచనా..! ఇటీవల కాలంలో.. ఈ రంగం.. ఆ రంగం.. అనే తేడా లేకుండా అన్నింటా డేటాసైన్స్ దూసుకుపోతోంది. ఇదే విషయం పలు సర్వేల్లో స్పష్టమైంది. ఇప్పటికే ఎమర్జింగ్ కెరీర్‌గా వెలుగొందుతున్న డేటాసైన్స్.. 2020లో మరింత హాట్‌ఫేవరెట్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో.. డేటాసైన్స్ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

డేటాసైన్స్.. అవకాశాలు అదరహో!

కళ్లు చెదిరే ప్యాకేజీలు

డేటాసైన్స్.. దీన్నే డేటా అనలిటిక్స్, బిజినెస్ అనలిటిక్స్ అని కూడా పిలుస్తారు. ఈ విభాగంలో పనిచేసే నిపుణులను డేటాసైంటిస్ట్‌లుగా పిలుస్తారు. డేటాసైన్స్ నిపుణులకు కళ్లు చెదిరే ప్యాకేజీలు లభిస్తున్నాయి. 2019లో డేటాసైంటిస్టులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) రంగంలో సగటున రూ.13.56 లక్షల ప్యాకేజీ లభించింది. మ్యాన్యుఫ్యాక్చరింగ్‌లో సగటున రూ.11.8 లక్షల వేతనం, హెల్త్‌కేర్‌లో సగటున రూ.11.8 లక్షల వేతనం అందింది. ప్రస్తుతం దేశంలో డేటాసైన్స్ విభాగం మానవ వనరుల కొరత ఎదుర్కొంటోంది. 2020లో కొత్తగా 1.5లక్షల డేటాసైన్స్ ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నట్లు అంచనా. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య 62 శాతం అధికం. ఉద్యోగాల కల్పనకు సంబంధించి బీఎఫ్ఎస్ఐ రంగం ముందు వరుసలో నిలుస్తోంది. ఆ తర్వాతి స్థానాల్లో తయారీ, ఆరోగ్యం, ఐటీ, ఈ-కామర్స్ రంగాలు నిలవనున్నాయి. తాజాగా ఈడీ-టెక్ నిర్వహించిన సర్వేలో బీఎఫ్ఎస్ఐ రంగం అత్యధిక వేతనాలు అందిస్తున్నట్లు వెల్లడైంది.

2020 డేటాసైన్స్‌దే

ప్రస్తుతం ఏ విభాగం తీసుకున్నా.. డేటా భారీగా ఉత్పత్తి అవుతోంది. వ్యాపారం, సేవల విభాగాల్లో నిమగ్నమైన కంపెనీలకు అవసరమైన డేటాను సేకరించడం, విశ్లేషించడం కష్టంగా మారుతోంది. దీంతో ఆయా కంపెనీలకు డేటాసైన్స్ నిపుణుల అవసరం తప్పనిసరిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో డేటాసైన్స్ నిపుణులకు 2020 సంవత్సరం ఆశాజనకంగా ఉండనుందనే వార్తలు ఔత్సాహికులకు ఉత్సాహానిస్తున్నాయి. దేశంలో డేటా సైన్స్ నిపుణులకు భారీ డిమాండ్ నెలకొంది. అర్హులైన అభ్యర్థులు లేనికారణంగా 2019లో ఏకంగా 97,000 కొలువులు ఖాళీగా మిగిలిపోయాయి. కాబట్టి ఇప్పటికే డేటాసైన్స్ రంగంలో ఉన్నవారితో పాటు కొత్తగా ఈ రంగంలో ప్రవేశించాలనుకొనే వారు కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల కెరీర్‌ను సొంతం చేసుకొనే అవకాశం ఉంది.

నైపుణ్యాలు

డేటాసైన్స్ అభ్యర్థులకు తెలుసుకోవాలనే తృష్ణ, కష్టపడే తత్వం ఉండాలి. అదే విధంగా నూతన టెక్నాలజీలు, అల్గారిథమ్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి. కొత్త విషయాలను నేర్చుకోవాలనే తపన ఉన్న వారు డేటాసైన్స్‌లో రాణిస్తారు. మ్యాథ్స్‌లో పట్టు, కోడింగ్‌పై అవగాహన పెంచుకోవడం డేటా సైన్స్ కొలువుకు చాలాఅవసరం. ఇందులో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు మాత్రమే రాణించగలరనేది అపోహ మాత్రమే అంటున్నారు నిపుణులు. అనేక మంది నాన్ ఇంజనీరింగ్ నేపథ్యంతోనూ డేటాసైన్స్‌లో ప్రతిభ చూపుతున్నారు.

అగ్రగామి భారత్

మ్యాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్, రిటైల్, టెలికం, ఆయిల్ అండ్ గ్యాస్, ఎయిర్‌లైన్, ఇ-కామర్స్... ఇలా అన్ని రంగాల్లో సంస్థల నిర్వహణకు డేటా కీలకంగా మారింది. దీంతో సదరు కంపెనీలు డేటా బృందాలను పటిష్టం చేయడంపై దృష్టిపెట్టాయి. ప్రస్తుతం డేటాసైన్స్‌లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా కొనసాగుతోంది. మన దేశంలో కోడింగ్ పరిజ్ఞానం కలిగిన యువత పెద్ద సంఖ్యలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది.

కొలువులు ఇక్కడ

ప్రముఖ కంపెనీలన్నీ డేటాసైన్స్ నిపుణులను నియమించుకుంటున్నాయి. వాటిలో కొన్ని... » యాక్సెంచెర్ » ఆటోస్ » ఏంజెల్ బ్రోకింగ్ » హెచ్‌డీఎఫ్‌సీ » డెలాయిట్ » షాదీ.కామ్ » క్రెడిట్ విద్య » ఐబీఎం » ఆదిత్య బిర్లా » ఈగెన్ టెక్నాలజీస్ » డేటా ఫార్చూన్ » విజ్‌మైండ్స్ » ఇన్ఫోటెక్ » వాల్యూడైరెక్ట్.

కోర్సులు ఇవే

- రెగ్యులర్ కోర్సులతో మూక్స్ విధానంలోనూ డేటాసైన్స్ కోర్సులు పూర్తి చేయొచ్చు. ఆన్‌లైన్ విధానంలో కోర్సెరా, ఈడీఎక్స్, ఉడెమీ, ఎంయూనివర్సిటీ తదితర వేదికలు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు పలు ప్రయివేటు ఇన్‌స్టిట్యూట్‌లు డేటా అనలిటిక్స్ నైపుణ్యాలను అందిస్తున్నాయి.
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బిజినెస్, మార్కెట్ సంస్థల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో.. డేటాసైన్స్ నిపుణులు, రీసెర్చర్ల అవసరం పెరుగుతోంది. ఐఐటీలు సైతం బీటెక్‌లో డేటాసైన్స్ స్పెషలైజేషన్‌ను ప్రారంభించాయి.
- డేటాసైన్స్‌కు సంబంధించి ప్రాథమిక స్థాయిలో సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్‌లో మ్యాథ్స్‌ను ఒక సబ్జెక్టుగా చదివిన సైన్స్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు వీటిలో చేరవచ్చు. అలాగే మ్యాథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్‌తో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు డేటాసైన్స్ పీజీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులు.
- ఎంపీసీ గ్రూపుతో ఇంటర్ పూర్తి చేసిన వారు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సులో చేరవచ్చు. బీఎస్సీ(మ్యాథ్స్), బీఈ/ బీటెక్ (కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ సంబంధిత) కోర్సులను పూర్తి చేసిన అభ్యర్థులు రెండేళ్ల వ్యవధిలోని ఎమ్మెస్సీ బిగ్ డేటా అనలిటిక్స్‌లో చేరేందుకు అర్హులు.

కోర్సులు అందిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు

» ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్-కేరళ(ఐఐటీఎంకే) » ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బెంగళూరు » రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ » ఐఐటీ హైదరాబాద్ » ఐఐఐటీ ఢిల్లీ » ఐఐటీ ఖరగ్‌పూర్ » సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ-డాక్).

సవాళ్లు ఇవే

- డొమైన్ నాలెడ్జ్‌తోపాటు అనుబంధ నైపుణ్యాలైన మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పైథాన్, ఎస్‌క్యూఎల్, ఎస్ఏఎస్, బిగ్‌డేటా టూల్స్‌పై పట్టున్న వారికి జాబ్ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అభ్యర్థులు ఆయా నైపుణ్యాలు సొంతం చేసుకునేందుకు ప్రయత్నించడం మేలు.
- డేటాసైంటిస్టులకు డిమాండ్ పెరుగుతున్నా.. దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌లు ఆ స్థాయిలో కోర్సులు నిర్వహించడం లేదు. అంతేకాకుండా డేటాసైన్స్ డొమైన్‌లో అర్హత కలిగిన ఫ్యాకల్టీ కొరత ఎక్కువగా ఉంది.
- ప్రస్తుతం డేటాసైన్స్ ఔత్సాహికుల్లో కనిపిస్తున్న ప్రధాన లోపం మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌ను సరిగ్గా అనువర్తించలేకపోవడం. సింటాక్స్ స్థాయిలో మెషిన్‌లెర్నింగ్ నేర్చుకొని మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌పై దృష్టిపెట్టకపోవడంతో ఈ సమస్య వస్తోంది. కాబట్టి అభ్యర్థులు మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌పై దృష్టిసారించాలి.

టీఎస్ ఎంసెట్ 2020



తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్‌కు ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. ఇంటర్మీడియెట్ తర్వాత అత్యధిక మంది విద్యార్థులు రాసే పరీక్ష కూడా ఇదేకావడం విశేషం. టీఎస్ ఎంసెట్-2020 పరీక్షల నిర్వహణకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్‌తోపాటు మెడికల్ సంబంధిత కోర్సులు, అగ్రికల్చరల్, ఫార్మా కళాశాలల్లో ప్రవేశాలకు సైతం వీలు కల్పించే టీఎస్ ఎంసెట్-2020పై ప్రత్యేక కథనం...

» తెలంగాణ ఎంసెట్‌కు నోటిఫికేషన్ విడుదల
» దరఖాస్తులకు చివరి తేది: 30.03.2020
» మే 4,5,7 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్ష
» మే 9,11 తేదీల్లో అగ్రికల్చర్, మెడికల్ పరీక్ష

జేఎన్‌టీయూహెచ్ నిర్వహణ

ఈ ఏడాది టీఎస్ ఎంసెట్-2020 నిర్వహణను రాష్ట్ర ఉన్నత విద్యామండలి తరపున జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (హైదరాబాద్) చేపట్టింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ అత్యధిక పర్యాయాలు జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలోనే ఎంసెట్ జరిగింది. మరోసారి ఎంసెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్‌టీయూహెచ్ చేపట్టనుంది. సెట్ కన్వీనర్‌గా జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు. ఎంసెట్ పరీక్షను 2018 నుంచి ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే విధానం కొనసాగనుంది.

ప్రవేశాలు కల్పించే కోర్సులు

బీఈ, బీటెక్/బీటెక్ బయోటెక్నాలజీ/బీటెక్ డెయిరీ టెక్నాలజీ/బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్/ బీఫార్మసీ/బీటెక్ ఫుడ్ టెక్నాలజీ/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్/బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్/ బీఎస్సీ ఫారెస్ట్రీ/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ.

విద్యార్హతలు

» టీఎస్ ఎంసెట్-2020కు దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణత లేదా రెండో ఏడాది పరీక్షలు రాయనున్న విద్యార్థులు అర్హులు.

» **బీఈ/బీటెక్; బీటెక్ బయోటెక్నాలజీ; బీటెక్ డెయిరీ టెక్నాలజీ, బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఫార్మసీలో 50 శాతం సీట్లకు అర్హతలు:** ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సుల్లో ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/ బయోటెక్నాలజీ/ బయాలజీ సబ్జెక్టులు చదివి ఉండాలి. వీటికి సమానమైన వొకేషనల్ కోర్సులతోపాటు బ్రిడ్జి కోర్సు చేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసినవారు, చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

» బీఫార్మసీ మినహా మిగతా కోర్సులకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఇంటర్(ఎంపీసీ)లో 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి. రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు వస్తే సరిపోతుంది.

» బీఫార్మసీలో మిగతా 50 శాతం సీట్లకు బైపీసీ అభ్యర్థులు అర్హులు.

» ఫార్మా డీ కోర్సులో 50 శాతం సీట్లు ఎంపీసీ అభ్యర్థులతో, మరో 50 శాతం సీట్లు బైపీసీ అభ్యర్థులతో భర్తీ చేస్తారు.

అగ్రికల్చరల్/మెడికల్ విభాగం అర్హతలు

» **బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చరల్, బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చరల్:** ఫిజికల్‌సైన్స్, బయలాజికల్ సైన్స్/నేచురల్ సైన్స్, అగ్రికల్చరల్, వొకేషనల్ ఇన్ అగ్రికల్చరల్ సబ్జెక్టులో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు తప్పనిసరిగా చదివి ఉండాలి.

» **బీఎస్సీ ఫారెస్ట్రీ:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ లేదా మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు చదవాలి.

» **బీవీఎస్సీ:** ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ లేదా నేచురల్ సైన్స్‌లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు చదవాలి. » **బీఎఫ్ఎస్సీ:** ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్/ నేచురల్ సైన్స్, ఫిషరీ సైన్స్‌లో ఒకేషనల్ కోర్సు.. వీటిల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు చదివి ఉండాలి.

» **బీటెక్ ఫుడ్ టెక్నాలజీ:** మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ లేదా బయలాజికల్ సైన్స్/నేచురల్ సైన్స్‌లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు చదవాలి.

» **బీటెక్ బయోటెక్నాలజీ:** ఇంటర్‌లో బైపీసీతోపాటు బ్రిడ్జి కోర్సులో మ్యాథ్స్ ఉత్తీర్ణులు అర్హులు.

వయసు

» ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 2020 డిసెంబర్ 31 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధనలేదు.

» బీటెక్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల విద్యార్థులకు 2020 డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్లు పూర్తవ్వాలి. గరిష్టంగా 22 ఏళ్ల వయసు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల వయసు 25 ఏళ్లు మించరాదు. ఫార్మా-డి కోర్సుకు 17 ఏళ్లు పూర్తయి ఉండాలి.

పరీక్ష విధానం

టీఎస్ ఎంసెట్‌ను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) నిర్వహిస్తారు.పరీక్ష కాలవ్యవధి మూడు గంటలు. ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 160 ప్రశ్నలు-160 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష జరుగుతుంది.. ఇందులో 80 ప్రశ్నలు మ్యాథ్స్, 40 ఫిజిక్స్, మరో 40 కెమిస్ట్రీ నుంచి ఇస్తారు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/తెలుగు లేదా ఇంగ్లిష్/ ఉర్దూలో ఉంటుంది.

» అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో.. మొత్తం 160 ప్రశ్నలు-160 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ఇందులో 80 ప్రశ్నలు బయాలజీ (బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 40 ప్రశ్నల చొప్పున అడుగుతారు.

ర్యాంకు ఇలా

» ఎంసెట్ ర్యాంక్‌తోపాటు ఇంటర్మీడియెట్ మార్కులకు వెయిటేజీ కేటాయించి తుది ర్యాంక్ ప్రకటిస్తారు. ఇందులో ఎంసెట్‌కు 75 శాతం వెయిటేజీ, ఇంటర్‌లో గ్రూప్ సబ్జెక్టుల మార్కులకు 25 శాతం వెయిటేజీ లభిస్తుంది.

» ఎంసెట్ మొత్తం మార్కుల్లో కనీసం 25 శాతం సాధిస్తేనే అర్హులుగా పరిగణిస్తారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎలాంటి అర్హత మార్కుల నిబంధన లేదు.

పరీక్షా జోన్లు ఎక్కడెక్కడ

» **తెలంగాణ:** హైదరాబాద్‌లో ఐదు జోన్లు, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట.

» **ఆంధ్రప్రదేశ్:** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలులో కేంద్రాలు ఉన్నాయి.

పరీక్షల షెడ్యూల్ ఇలా

» **ఇంజనీరింగ్ విభాగం:** మే 04, 05, 07 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు; మధ్యాహ్నం 3 నుంచి 6 గంటలకు వరకు.. రెండు షిఫ్ట్‌ల్లో పరీక్ష నిర్వహిస్తారు.

» **అగ్రికల్చరల్, మెడికల్ విభాగం:** మే 09, 11 తేదీల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు; మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటలకు వరకు పరీక్ష జరుగుతుంది.

ముఖ్య సమాచారం

» ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 30.03.2020 (ఆలస్య రుసుం లేకుండా)

» **ఏప్రిల్ 6:** ఆలస్య రుసుం రూ.500 తో దరఖాస్తుకు అవకాశం ఉంది,

» **ఏప్రిల్ 13 వరకూ:** ఆలస్య రుసుం రూ.1000 తో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **ఏప్రిల్ 20 వరకూ:** 5వేల ఆలస్య రుసుంతో దరఖాస్తుకు వీలుంది.

» **ఏప్రిల్ 27 వరకూ:** పదివేల ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **హాల్‌టికెట్లు:** ఏప్రిల్ 20 నుంచి మే 1 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దరఖాస్తు ఫీజు

» **ఇంజనీరింగ్:** ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.400, ఇతరులకు రూ.800.

» **అగ్రికల్చరల్, మెడికల్:** ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.400, ఇతరులకు రూ.800.

» రెండు పరీక్షలు రాయాలనుకునే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలు రూ.800, ఇతరులు రూ.1600 చెల్లించాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పులు సరిదిద్దుకునే అవకాశం:** మార్చి 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు

అర్హతగల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజును తెలంగాణలోని టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లు, ఏపీలోని ఏపీ ఆన్‌లైన్ సెంటర్లలో క్రెడిట్, డెబిట్ కార్డులతోపాటు నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు.

దరఖాస్తు సమయంలో సిద్ధంగా ఉంచుకోవాల్సినవి

ఇంటర్/10+2 పరీక్షల హాల్‌టికెట్ నెంబర్, ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, పదో తరగతి హాల్‌టికెట్ నెంబర్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర సమాచారం దరఖాస్తు సమయంలో సిద్ధంగా ఉంచుకోవాలి.

» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://eamcet.tsche.ac.in

5 షరపోవా సాధించిన గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ (2004-వింబుల్డన్; యూఎస్ ఓపెన్-2006; ఆస్ట్రేలియన్ ఓపెన్-2008; ఫ్రెంచ్ ఓపెన్-2012, 2014)

36 కెరీర్‌లో నెగ్గిన సింగిల్స్ టైటిల్స్ సంఖ్య

1 అత్యుత్తమ ర్యాంకింగ్ (ఆగస్టు 22, 2005)

21 కెరీర్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగిన వారాలు

2001 ప్రొఫెషనల్‌గా మారిన ఏడాది

373 ప్రస్తుత ర్యాంక్

అందం అల్విదా చెప్పింది

టెన్నిస్‌కు షరపోవా గుడ్‌బై

రిటైర్మెంట్ ప్రకటించిన రష్యా స్టార్

కెరీర్‌లో ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సొంతం

ఆటతో పాటు అందం కూడా కలిసి నడిచే మహిళల టెన్నిస్‌లో ఒక శకం ముగిసింది. 16 ఏళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను అలరించిన రష్యన్ బ్యూటీ మారియా షరపోవా టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పింది. ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గినా... వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ సాధించినా... తన అందంతోనే ఎక్కువగా ఆకర్షించిన ఈ బుట్టబొమ్మ తన రాకెట్‌ను పక్కన పెడుతున్నట్లు ప్రకటించింది. తన పేరుతో పెట్టిన క్యాండీ 'షుగర్‌పోవా'లాగే ఎన్నో తీపి జ్ఞాపకాలను పదిలపర్చుకొని వీడ్కోలు పలుకుతున్నట్లు వెల్లడించింది.

పారిస్: రష్యా టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నంబర్‌వన్ మారియా షరపోవా ఆట నుంచి తప్పుకుంది. 'టెన్నిస్-నేను గుడ్‌బై చెబుతున్నా' అంటూ ప్రకటించింది. నాలుగు వేర్వేరు గ్రాండ్‌స్లామ్‌లను నెగ్గిన అతి కొద్ది మంది ప్లేయర్లలో ఆమె కూడా ఉండటం విశేషం. 32 ఏళ్ల షరపోవా కొన్నేళ్లుగా వరుస గాయాలతో సతమతమవుతోంది. కోలుకొని అప్పుడప్పుడూ బరిలోకి దిగుతున్నా ఫలితాలు అన్నీ ప్రతికూలంగా వచ్చాయి. ఒకప్పుడు వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచిన ఆమె ఇప్పుడు 373వ ర్యాంక్‌కు పడిపోయింది. దాంతో ఆట నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకుంది. ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో పుట్టినా... ఏడేళ్ల వయసులోనే ఆమె కుటుంబం అమెరికాకు వలస వెళ్లిపోయింది. ఆటలో మాత్రం రష్యాకు ప్రాతినిధ్యం వహించడాన్ని షరపోవా కొనసాగించింది. 2004 వింబుల్డన్ ఫైనల్లో అమెరికా నల్లకలువ సెరెనా విలియమ్స్‌ను ఓడించి 17 ఏళ్ల వయసులోనే తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఈ భామ ఇక వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఆమె చక్కటి ఆటకు అందం తోడై అత్యంత పాపులర్ ప్లేయర్‌గా షరపోవాకు గుర్తింపు తెచ్చి పెట్టాయి. వరుసగా 11 ఏళ్ల పాటు అత్యధిక ఆర్జన ఉన్న మహిళా క్రీడాకారిణిగా 'ఫోర్బ్స్' జాబితాలో నిలిచింది.

> 28 ఏళ్ల ఆట, 5 గ్రాండ్‌స్లామ్‌ల తర్వాత గుడ్‌బై చెబుతున్నా. వేరే రంగంలో పోటీ పడి మరింత ఎత్తుకు ఎదిగే సత్తా నాలో ఇంకా ఉంది. నేను నా జీవితాన్ని టెన్నిస్‌కు ఇస్తే టెన్నిస్ నాకు జీవితాన్ని ఇచ్చింది. ఎంతగా శ్రమిస్తే అంత గొప్ప ఫలితాలు సాధించవచ్చని నేను నమ్మా. గతం గురించో, భవిష్యత్తు గురించో అతిగా ఆలోచించకుండా వర్తమానంలో కష్టపడటం వల్లే ఈ విజయాలు దక్కాయనేది నా భావన. టెన్నిస్ కోర్టుకు సంబంధించి అన్ని జ్ఞాపకాలూ పదిలంగా నా మనసులో ఉంటాయి. అవి కోల్పోతున్న బాధ నాకూ ఉంది. టెన్నిస్ అనేది నాకు శిఖరంలాంటిది. అక్కడికి చేరే క్రమంలో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూసినా ఒక్కసారిగా పైకి ఎక్కిన తర్వాత వచ్చే ఆనందమే వేరు. ఇక ముందు కూడా జీవితంలో కొత్త లక్ష్యాలు పెట్టుకొని శ్రమిస్తా. మరిన్ని విజయాలు అందుకున్నా.
>
> -వీడ్కోలు సందేశంలో షరపోవా

645 మొత్తం గెలిచిన మ్యాచ్‌లు

171 మొత్తం ఓడిన మ్యాచ్‌లు

3,87,77,962 డాలర్లు (రూ. 277 కోట్ల 76 లక్షలు) కెరీర్‌లో సాధించిన ప్రైజ్‌మనీ

'చాంపియన్' రాకెట్

సత్తా చాటుతున్న సౌజన్య • భారత ఫెడ్ కప్ టెన్నిస్ జట్టులో చోటు • స్పాన్సర్ల కోసం ఎదురుచూపులు

ఏడాది క్రితం ఆ అమ్మాయి ఆటను వదిలేయడానికి సిద్ధమైంది! దేశంలోని ఎంతో మంది టెన్నిస్ క్రీడాకారులాగే ఆర్థిక పరమైన సమస్యలు కెరీర్‌ను అర్ధాంతరంగా ముగించాలనే ఆలోచనకు కారణంగా నిలిచాయి. అయితే మరొక్క ప్రయత్నం అంటూ మైదానంలో నిలబడిన ఆమెకు 'డబుల్' జాతీయ చాంపియన్ రూపంలో ప్రతిఫలం దక్కింది. దానికి కొనసాగింపుగా భారత సీనియర్ జట్టులో చోటు లభించడం కూడా ఆమె శ్రమకు దక్కిన గుర్తింపు. రాకెట్ పడేయాలన్న ఆలోచనను పక్కన పెట్టి మరింత గొప్ప ప్రదర్శన ఇచ్చేందుకు ఇవి ఆమెకు స్ఫూర్తినిచ్చాయి. ఇకపై మరిన్ని విజయాలు సాధిస్తానంటున్న ఆ టెన్నిస్ క్రీడాకారిణి సౌజన్య బవిశెట్టి. భారత ఫెడ్ కప్ జట్టులో రిజర్వ్ క్రీడాకారిణిగా ఆమె ఎంపికైంది.

సాక్షి, హైదరాబాద్

భారత్ తరఫున అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో అనేక మంది అమ్మాయిలు నిలకడగా రాణిస్తూ విజయాలు సాధిస్తున్నారు. వారిలో సౌజన్య బవిశెట్టి కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గత అక్టోబరులో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో ఆమె ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇదే టోర్నీలో డబుల్స్ విభాగంలో కూడా టైటిల్ సాధించడం విశేషం. నాలుగుసార్లు జాతీయ చాంపియన్ అయిన ప్రేరణా బాంబ్రీని సౌజన్య ఫైనల్లో ఓడించడం విశేషం. అదే ఆమెకు భారత ఫెడ్ కప్ జట్టులో రిజర్వ్ ప్లేయర్‌గా కూడా చోటు కల్పించింది. ఆసియా-ఓసియానియా గ్రూప్‌లో భాగంగా దుబాయ్‌లో మార్చి 3 నుంచి జరిగే పోరులో భారత జట్టు తలపడుతుంది. దీని కోసం సౌజన్య ప్రస్తుతం సన్నద్ధమవుతోంది.

ఐటీఎఫ్‌లో విజయాలు...

సౌజన్య స్వస్థలం కర్నూలు. ఆమె సోదరి అంజలి టెన్నిస్ క్రీడాకారిణి. ఆమె స్ఫూర్తితో రాకెట్ పట్టిన సౌజన్య ప్రతిభను చూసి కోచ్‌లు ప్రోత్సహించారు. దాంతో హైదరాబాద్‌లో శిక్షణ కొనసాగించిన సౌజన్య వేగంగా దూసుకుపోయింది. ఇంటర్ యూనివర్సిటీ పోటీల నుంచి జాతీయ క్రీడల వరకు పలు పతకాలు సొంతం చేసుకుంది. ముందుగా ఐటీఎఫ్ జూనియర్ గ్రేడ్ విజయాలతో మొదలు పెట్టి సీనియర్ విభాగంలో మంచి విజయాలు సాధించింది. ఐటీఎఫ్ కెరీర్‌లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో కలిపి 26 ఏళ్ల సౌజన్య ఇప్పటి వరకు 11 టైటిల్స్ సాధించింది. మరో 5 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచింది. జాతీయ చాంపియన్‌షిప్‌లో రెండు టైటిల్స్ గెలుచుకోవడంతో పాటు ఇటీవల జరిగిన దక్షిణాసియా క్రీడల్లో 2 స్వర్ణాలు, ఒక రజతం సాధించింది.

గ్రాండ్‌స్లామ్‌లో పాల్గొనే లక్ష్యంతో...

ఎడంచేతి వాటం ప్లేయర్ అయిన సౌజన్య బలం ఫోర్ హ్యాండ్. జాతీయ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన తర్వాత సౌజన్య ఆత్మవిశ్వాసం మరింతగా పెరిగింది. ఇటీవల జరిగిన రెండు ఐటీఎఫ్ టోర్నీలలో తనకంటే ఎంతో మెరుగైన ర్యాంకింగ్ ఉన్న ప్లేయర్లను ఆమె ఓడించగలిగింది. కెరీర్‌లో ఎదిగే క్రమంలో స్పెయిన్‌లో సాంచెజ్ అకాడమీలో కూడా సౌజన్య శిక్షణ పొందింది. జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ గౌరవ్ ఉప్పల్ ప్రణాళిక ప్రకారం ఫెడ్ కప్ టోర్నీలో అదృష్టం కలిసొస్తే ఆమె మ్యాచ్ ఆడే అవకాశం కూడా ఉంది. నగరంలోని ఎస్‌కే టెన్నిస్ అకాడమీలో ఆమె ఫెడ్ కప్ కోసం ప్రత్యేకంగా సన్నద్ధమవుతోంది. కోచ్, తన భర్త సురేశ్ కృష్ణతో పాటు ఫిట్‌నెస్ ట్రెయినర్ హర్ష మార్గనిర్దేశనంలో ఆమె మరింత ఫిట్‌గా మారింది. ర్యాంక్‌ను మరింత మెరుగుపర్చుకొని గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పాల్గొనే లక్ష్యంతో సౌజన్య శ్రమిస్తోంది.

స్పాన్సర్‌షిప్ లేకపోయినా...

చాలా మంది టెన్నిస్ క్రీడాకారిణులు ఎదుర్కొనే సమస్య సౌజన్యకు కూడా ఎదురైంది. టెన్నిస్ సర్క్యూట్‌లో శిక్షణ మొదలు టోర్నీల్లో పాల్గొనడం భారీ ఖర్చుతో కూడుకున్నది కావడం, ఆర్థికపరమైన అండదండలు లేనిదే సొంత డబ్బులతో ఆటను కొనసాగించడం అంత సులువు కాదు. ఇదే కారణంగా ఆమె తప్పుకునేందుకు కూడా సిద్ధమైంది. ఇప్పటి వరకు సౌజన్యకు ఏ రకమైన ప్రైవేట్ స్పాన్సర్‌షిప్ లభించలేదు. ఇది ఆమె భవిష్యత్ అవకాశాలను దెబ్బ తీస్తోంది. కెరీర్ బాగా సాగుతున్న ఈ దశలో యూరోప్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని కూడా ఆమె భావిస్తోంది. గతంలో తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. అయితే టెన్నిస్‌లో మరిన్ని విజయాలు సాధించాలనే సౌజన్య పట్టుదల ముందు ఇవన్నీ పెద్ద అవరోధాలు కాకపోవచ్చు.

సీనియర్ స్థాయిలో విజేతగా నిలవడం నా ఆత్మవిశ్వాసాన్ని ఎన్నో రెట్లు పెంచింది. తర్వాతి ఐటీఎఫ్ టోర్నీలలో దాని ఫలితం కూడా కనిపించింది. ఫెడ్ కప్‌లో చోటు దక్కడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఎన్ని ఐటీఎఫ్ టోర్నీలు ఆడినా భారత్ తరఫున ఒక టీమ్ ఈవెంట్‌లో ఆడే అవకాశం రావడం గొప్ప విషయం. ప్రస్తుతం నా కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్నాను. ఇదే జోరు కొనసాగించి ర్యాంక్‌ను మెరుగుపర్చుకునేందుకు బరిలోకి దిగుతున్నా. గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో బరిలోకి దిగాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాను.

-సౌజన్య

కార్పొరేట్ కంపెనీల స్పాన్సర్‌షిప్ కోసం ప్రయత్నిస్తున్నాం. ఇంకా ఫలితం రాలేదు. ఆర్థికపరమైన అంశాల ఒత్తిడి లేకపోతే ప్లేయర్ పూర్తిగా ఆటపైనే దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుంది. విదేశీ టోర్నీల్లో ఆడటం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి చాలా జాగ్రత్తగా, ఆసియా లోపలే టోర్నీలను ఎంచుకోవాల్సి వస్తోంది. యూరోపియన్ సర్క్యూట్‌లో ఆడగలిగితే సౌజన్య ఆట మెరుగుపడుతుంది. ఇప్పటి వరకు ఆమె ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. చిన్న చిన్న లోపాలు సరిదిద్ది మరింతగా రాటుదేల్చే ప్రయత్నంలో ఉన్నాం.

-సురేశ్ కృష్ణ (సౌజన్య కోచ్, భర్త)



ఆంధ్ర యూనివర్సిటీ జట్టుకు స్వర్ణం

కటక్: ఖేలో ఇండియా అఖిల భారత విశ్వవిద్యాలయాల క్రీడల్లో భాగంగా పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో ఆంధ్ర యూనివర్సిటీ జట్టు చాంపియన్‌గా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో పొదిలె శ్రీకృష్ణ సాయికుమార్, గారగ కృష్ణప్రసాద్, ప్రణయ్ రెడ్డి, కలగ జగదీశ్, ఆకాశ్ చంద్రన్, ఆదిత్య గోపరాజు బాపినీడు, గూడె సుదీశ్ వెంకట్‌లతో కూడిన ఆంధ్ర యూనివర్సిటీ జట్టు 3-1తో పంజాబ్ యూనివర్సిటీ (చండీగఢ్) జట్టుపై గెలిచింది. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ రెడ్డి (ఆంధ్ర) 6-21, 7-21తో కార్తీక్ జిందాల్ చేతిలో ఓడిపోయాడు. అయితే రెండో మ్యాచ్‌లో జగదీశ్ 21-16, 21-19తో అభిషేక్ సైనిపై నెగ్గడంతో స్కోరు 1-1తో సమమైంది. మూడో మ్యాచ్‌లో శ్రీకృష్ణ సాయికుమార్-కృష్ణప్రసాద్ జంట 12-21, 21-18, 21-15తో కార్తీక్ జిందాల్-హార్దిక్ జోడీపై గెలవడంతో ఆంధ్ర యూనివర్సిటీ ఆధిక్యం 2-1కి చేరింది. నాలుగో మ్యాచ్‌లో ఆదిత్య 21-14, 21-17తో హార్దిక్ మక్కర్‌ను ఓడించడంతో ఆంధ్ర యూనివర్సిటీ 3-1తో విజయాన్ని ఖాయం చేసుకొని స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.

రన్నరప్ సంజన

సాక్షి, హైదరాబాద్: తుదకంటా పోరాడినా... హైదరాబాద్ అమ్మాయి సంజన సిరిమల్ల ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ వైల్డ్ కార్డు క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించలేకపోయింది. న్యూఢిల్లీలో బుధవారం ముగిసిన రొలాండ్ గారోస్ జూనియర్ వైల్డ్‌కార్డు ఇండియా సిరీస్ టోర్నీలో సంజన రన్నరప్‌గా నిలిచింది. బాలికల సింగిల్స్ ఫైనల్లో వైష్ణవి ఆడ్కర్ (మహారాష్ట్ర) 4-6, 6-4, 7-6 (7/3)తో సంజనపై... బాలుర సింగిల్స్ ఫైనల్లో దేవ్ జావియా (గుజరాత్) 6-2, 6-1తో చిరాగ్ దుహాన్ (హరియాణా)పై గెలిచారు. తద్వారా వైష్ణవి, దేవ్ జావియా పారిస్‌లో జరిగే వైల్డ్‌కార్డు క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ తరపున బరిలో దిగే అవకాశాన్ని సంపాదించారు. ఫ్రాన్స్ మాజీ క్రీడాకారిణి, నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత మేరీ పియర్స్ విన్నర్స్, రన్నరప్‌లకు ట్రోఫీలు అందజేసింది. పారిస్‌లో జరిగే టోర్నీలో బ్రెజిల్, మెక్సికో, చైనా దేశాల ఆటగాళ్లతో వైష్ణవి, దేవ్ జావియా తలపడతారు. ఆ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ టోర్నీలో నేరుగా ప్రధాన 'డ్రా'లో బరిలోకి దిగుతారు.

మేరీ పియర్స్‌తో సంజన

హ్యాట్రిక్‌పై భారత్ గురి

- నేడు న్యూజిలాండ్‌తో పోరు
- మహిళల టి20 ప్రపంచకప్
- ఉదయం గం. 9.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

మెల్‌బోర్న్: టోర్నీ మొదలైన రోజే నాలుగుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను కంగుతినిపించిన భారత మహిళలు... అదే జోరుతో బంగ్లాదేశ్‌నూ చిత్తు చేశారు. ఇప్పుడు హ్యాట్రిక్‌పై కన్నేసిన హర్మన్‌ప్రీత్ సేన అందరికంటే ముందుగా సెమీస్ చేరాలని తహతహలాడుతోంది. మహిళల టి20 ప్రపంచకప్‌లో గ్రూప్ 'ఎ'లో ఇప్పటిదాకా ఎదురులేని భారత జట్టు గురువారం జరిగే పోరులో న్యూజిలాండ్‌తో తలపడనుంది. గత రెండు మ్యాచ్‌ల్లో మన అమ్మాయిలు ఇటు బ్యాటింగ్‌లోనూ, అటు బౌలింగ్‌లోనూ అదరగొట్టారు. 16 ఏళ్ల టీనేజ్ సంచలనం షఫాలీ వర్మ మెరుపుదాడి... టాపార్డర్ బ్యాట్స్‌మన్ జెమీమా రోడ్రిగ్స్ బాధ్యతాయుత బ్యాటింగ్ భారత ఇన్నింగ్స్‌కు బలంకాగా... బౌలింగ్‌లో పూనమ్ యాదవ్ తన స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతోంది. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ నుంచే ఇంకా అవసరమైన మెరుపులు రాలేదు. బహుశా కివీస్‌తో నేడు జరిగే మ్యాచ్‌లో ఆ లోటు తీర్చుకునే అవకాశముందేమో చూడాలి. జ్వరంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరమైన డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టులోకి రావడం భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను మరింత పటిష్టం చేసింది. మిడిలార్డర్‌లో దీప్తి శర్మతో పాటు వేద కృష్ణమూర్తి మెరుపులు మెరిపించగలరు. స్పిన్నర్ పూనమ్‌తో పాటు పేసర్ శిఖా పాండే వెటరన్ స్టార్ జులన్ గోస్వామి లేని లోటును సమర్థంగా భర్తీ చేస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో భారత విజయానికి బౌలింగ్ దళం ఎంతగానో దోహదపడింది. ఇక కివీస్ విషయానికొస్తే... భారత్‌పై ఆ జట్టుకు మంచి రికార్డు ఉంది. గత మూడు ముఖాముఖి పోటీల్లో న్యూజిలాండే గెలిచింది. కెప్టెన్, ఆల్‌రౌండర్ సోఫీ డివైన్, సుజీ బేట్స్... బౌలింగ్‌లో లియా తహుహు, అమెలియా కెర్ జట్టుకు ప్రధాన బలం కాగా... ఫామ్‌లో ఉన్న భారత్‌ను కివీస్ ఏ విధంగా ఎదుర్కొంటుందో చూడాలి.

కోహ్లి 'టాప్' ర్యాంక్ చేజారె...

దుబాయ్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో విఫలం కావడంతో... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ కోహ్లి తన 'టాప్' ర్యాంక్‌ను కోల్పోయాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లి 906 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ 911 రేటింగ్ పాయింట్లతో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. కోహ్లి కాకుండా బ్యాట్స్‌మెన్ టాప్-10 ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి రహానే, పుజారా, మయాంక్ వరుసగా ఎనిమిది, తొమ్మిది, పది ర్యాంక్‌ల్లో ఉన్నారు.

నైట్ సెంచరీ: ఇంగ్లండ్ భారీ విజయం

కాన్‌బెర్రా: కెప్టెన్ హెథర్ నైట్ (66 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీ... నటాలీ షివెర్ (52 బంతుల్లో 59 నాటౌట్; 8 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీ చేయడంతో మహిళల టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ జట్టు తొలి విజయం నమోదు చేసింది. థాయ్‌లాండ్ జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఇంగ్లండ్ 98 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 176 పరుగులు చేసింది. హెథర్ నైట్, షివెర్ మూడో వికెట్‌కు అజేయంగా 169 పరుగులు జోడించి ఇంగ్లండ్‌కు భారీ స్కోరు అందించారు. ప్రపంచకప్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్ 20 ఓవర్లు ఆడి 7 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 8 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది.

ఫెర్నాండో, మెండిస్ శతకాలు: శ్రీలంక గెలుపు

హంబన్‌టోట: అవిష్క ఫెర్నాండో (127; 10 ఫోర్లు), కుశాల్ మెండిస్ (119; 12 ఫోర్లు) శతకాల మోత మోగించగా... రెండో వన్డేలో శ్రీలంక జట్టు 161 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించింది. మరో వన్డే మిగిలుండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. మొదట శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 345 పరుగుల భారీస్కోరు చేసింది. అనంతరం వెస్టిండీస్ 39.1 ఓవర్లలో 184 పరుగులు చేసి ఆలౌటైంది.

IFCI LIMITED
(A Govt. of India Undertaking)
ప్రాంతీయ కార్యాలయం: IFCI లిమిటెడ్, 8వ అంతస్తు, తారామండల్ కాంప్లెక్స్, 5-9-13, సైఫాబాద్, హైదరాబాద్-50004.
టెలి: +91-040 23243505/06; ఫ్యాక్స్: +91-040 23241138; వెబ్‌సైట్: www.ifciltd.com
CIN: L74899DL1993GOI053677

సవరణ

విషయము: శ్రీ కృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (SKSTPL) - అమ్మకం నోటీసు తేదీ: 12.02.2020 మరియు టెండరు డాక్యుమెంట్ తేదీ: 12.02.2020కు సవరణ

మా అమ్మకం ప్రకటన తేదీ: 12.02.2020 మరియు టెండరు డాక్యుమెంట్ తేదీ: 12.02.2020కు ఇది నిర్దేశం.
2. సదరు నోటీసులో ఆస్తి వివరణను దిగువ తెలిపిన విధంగా చదువుకోగలరు:
"శ్రీ కృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్"కు స్వంతమైనది.
3. పైన తెలిపిన దానికి బదులుగా:
"శ్రీ తోట కన్నారావుకు స్వంతమైనది మరియు శ్రీ కృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజుకు ఇవ్వబడినది."
4. అమ్మకం నోటీసు తేదీ: 12.02.2020లోని అన్ని ఇతర అంశాలు యథాతథంగా ఉంటాయి.

ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 26.02.2020
సం/- అధీకృత అధికారి
IFCI లిమిటెడ్

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC Stadium, Labbipet, Bandar Road, Vijayawada

Tenders are hereby invited from reputed and experienced companies for following tenders.

S. No.	Tender ID	Name of the Work	Bid Starting Date	Bid End Date	Bid Opening Date
1	317247	Procurement of Wrestling mats, Rifle Shooting, Rugby balls, Hock Goal Keeper Kit, and Dummies Equipment for Sports Authority of Andhra Pradesh (SAAP)	24.02.2020	10.03.2020	10.03.2020
2	318730	Procurement of Sports Kits for conduct. of AP Legislators Sports Meet for the Year 2019-20 in the state for Sports Authority of Andhra Pradesh (SAAP)	25.02.2020	10.03.2020	10.03.2020

Tender documents are available on e-procurement platform **tender.apeprocurement.gov.in**. Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. For further details contact: 0866-2499699.

Sd/- Vice Chairman and Managing Director

DIPR RO. No.417PP/CL/ADVT/1/1/2019-20, Dt. 26.02.20

సాక్షి బిజినెస్
గురువారం
27-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
392 ▼	119 ▼
39,889	11,679

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	9,077	▲ 112
డోజోన్స్	27,193	▲ 111
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,042	▲ 25
డాక్స్	12,775	▼ 16
షాంఘై	2,988	▼ 25
నికాయ్	22,426	▼ 179

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఢామస్‌కుకి	70.82	73.48
£	బ్రిటన్ పౌండ్	ఢామస్‌కుకి	91.39	94.98
€	యూరో	ఢామస్‌కుకి	76.81	80.11
¥	జపాన్ ఎన్ (100)	ఢామస్‌కుకి	62.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఢామస్‌కుకి	46.14	48.57
S$	సింగపూర్ డాలర్	ఢామస్‌కుకి	50.46	52.93
SAR	సౌదీ రియాల్	ఢామస్‌కుకి	18.32	19.92
UAE D	యూఏఈ దిర్హామ్	ఢామస్‌కుకి	19.04	20.25
¥	చైనా యువాన్	ఢామస్‌కుకి	9.59	10.84

కోవిడ్ 'విశ్వ'రూపం... గుబేర్!

- కొనసాగుతున్న వైరస్ కల్లోలం...
- ఐదో రోజూ పతనమైన ప్రపంచ మార్కెట్లు
- క్యూ3 జీడీపీ అంచనాలు అంతంతమాత్రమే
- నాలుగో రోజూ నష్టపోయిన మన మార్కెట్
- 40,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్
- 392 పాయింట్ల పతనంతో 39,889 వద్ద ముగింపు
- 119 పాయింట్ల నష్టంతో 11,679కు నిఫ్టీ

చైనా కాకుండా కొత్త దేశాలకు కోవిడ్-19(కరోనా) వైరస్ విస్తరిస్తుండటం, ఆయా దేశాల్లో కొత్త కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ మార్కెట్లతో పాటే మన స్టాక్ మార్కెట్ కూడా బుధవారం నష్టపోయింది. ఈ క్యూ2లో 4.5 శాతంగా ఉన్న వృద్ధి రేటు ఈ క్యూ3లో కూడా అదే రేంజ్‌లో ఉండగలదన్న అంచనాలు ప్రతికూల ప్రభావం చూపాయి. రేపు (శుక్రవారం) ఈ క్యూ3 జీడీపీ గణాంకాలు వెలువడతాయి. సెన్సెక్స్ కీలకమైన 40,000 పాయింట్ల దిగువకు పతనం కాగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 200 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) దిగువకు క్షీణించింది. ఇంట్రాడేలో 521 పాయింట్ల మేర నష్టపోయిన సెన్సెక్స్ చివరకు 392 పాయింట్లు పతనమై 39,889 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 119 పాయింట్లు క్షీణించి 11,679 పాయింట్ల వద్దకు చేరింది. టెలికం రంగ సూచీ మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 19 పైసలు పుంజుకున్నా (ఇంట్రాడేలో), ముడి చమురు ధరలు 1.7 శాతం మేర పతనమైనా, మన మార్కెట్‌కు నష్టాలు తప్పలేదు.

మహమ్మారిగా కోవిడ్-19 వైరస్!

చైనాలో కొత్త కేసులు తగ్గినప్పటికీ, కోవిడ్-19 (కరోనా) వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య 2,700కు, వ్యాధి సోకిన వారి సంఖ్య 80,000కు పెరిగాయి. ఫ్రాన్స్, దక్షిణ కొరియా, ఇటలీ, ఆస్ట్రియా, స్పెయిన్ వంటి కొత్త దేశాలకు ఈ వైరస్ వ్యాపిస్తోంది. చైనా తర్వాత దక్షిణ కొరియాలో అధికంగా ఈ వైరస్ బాధితులున్నారు. ఈ దేశంలో కొత్త కేసుల సంఖ్య 169కు, మొత్తం బాధితుల సంఖ్య 1,146కు, మృతుల సంఖ్య 11కు పెరిగింది. కోవిడ్ 19 వైరస్ మహమ్మారిగా మారనున్నదని, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిపై ఈ వైరస్ ప్రభావం తీవ్రంగానే ఉండగలదన్న ఆందోళనతో ప్రపంచ మార్కెట్లు పతనమవుతున్నాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లో... యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ఈక్విటీ నుంచి పెట్టుబడులు సురక్షిత పెట్టుబడి సాధనాలైన అమెరికా బాండ్లు, డాలర్, పుత్తడిలోకి తరలిపోతున్నాయి.

- సన్ ఫార్మా 3.6% నష్టంతో రూ.375 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- బంధన్ బ్యాంక్ ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. బ్రాంచ్‌ల విస్తరణకు ఆర్‌బీఐ అనుమతినివ్వడంతో ట్రేడింగ్ మొదట్లో 5% లాభంతో రూ.423ను తాకింది. చివరకు 2.3% నష్టంతో రూ.394 వద్ద ముగిసింది.
- 300కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. హీరో మోటో, జిల్లెట్ ఇండియా, ఎల్ అండ్ టీ, థెర్మాక్స్.... తదితర షేర్లు జాబితాలో ఉన్నాయి.
- స్టాక్ మార్కెట్ నష్టపోయినా, ఇండియా సిమెంట్స్ షేర్ 20% అప్పర్ సర్క్యూట్‌తో రూ.105వద్ద ముగిసింది.

4 రోజుల్లో 1,434 పాయింట్లు డౌన్

వరుసగా నాలుగో రోజూ స్టాక్ మార్కెట్ పతనమైంది. గత 4 రోజుల్లో సెన్సెక్స్ 1,434 పాయింట్లు, నిఫ్టీ 402 పాయింట్ల మేర నష్టపోయాయి. ఈ నాలుగు రోజుల్లో రూ.5.5 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. నేడు(గురువారం) ఫిబ్రవరి సిరీస్ డెరివేటివ్స్ ముగింపు, నిఫ్టీ వీక్లీ అప్షన్ల ముగింపు కావడంతో సూచీలు తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

గత రెండు రోజుల్లో ఈ షేర్ 37% ఎగసింది. ఏస్ ఇన్వెస్టర్ రాధా కిషన్ దమానీ, ఆయన సోదరుడు గోపీకిషన్ దమానీ ఈ కంపెనీలో వాటాను 11.58%కి పెంచుకున్నారన్న వార్తలు దీనికి కారణం.

- ఒక్కో షేర్‌కు రూ.349 డివిడెండ్‌ను ప్రకటించడంతో సనోఫీ ఇండియాఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, రూ. 7,638ను తాకింది. చివరకు 1.6% లాభంతో రూ. 7,114 వద్ద ముగిసింది. గత ఏడాదికి గాను రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.106 డివిడెండ్‌ను, రూ.243 ప్రత్యేక డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ప్రపంచ ఎకానమీకి ముప్పే..

- కోవిడ్ వైరస్, అమెరికా-ఈయూ వాణిజ్య యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలను ప్రస్తావించిన ఈఐయూ
- 2020లో వృద్ధి 2.9 శాతమని అంచనా



న్యూఢిల్లీ: కోవిడ్-19 వైరస్, అమెరికా-యూరోపియన్ యూనియన్ వాణిజ్య యుద్ధం, అమెరికా-ఇరాన్ సంఘర్షణల నేపథ్యంలో తలెత్తుతున్న గల్ఫ్ ఉద్రిక్తతలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ముప్పుగా తయారయ్యాయని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణా దిగ్గజం- ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) విశ్లేషించింది. 2020లో ప్రపంచ ఆర్థికవృద్ధి రేటు కేవలం 2.9 శాతంగా అంచనావేసింది. ఇదే జరిగితే ఇది దశాబ్దపు కనిష్టస్థాయి అవుతుంది. ఈ మేరకు విడుదలైన ఒక శ్వేతపత్రంలోని కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- 2020లో ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. అమెరికా వృద్ధి రేటు అంతంతమాత్రంగానే ఉంటుంది. కోవిడ్ వైరస్ సంక్షోభం చైనాను కుదేలు చేయడమే కాకుండా, ఆసియా వృద్ధి అవకాశాలను దెబ్బతీస్తోంది.
- 2020లో ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సామాజిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. 2020లోనూ ఇదే కొనసాగవచ్చు. ఇది ఇటు విధాన నిర్ణేతలకూ అటు వ్యాపారవేత్తలకూ సమస్యగా ఉంటుంది.
- పలు ఆర్థిక వ్యవస్థలు రుణ భారాలను ఎదుర్కొంటున్నాయి. కరోనా సమస్యలతో వాణిజ్యపరమైన సరఫరాల సమస్య తలెత్తవచ్చు.

'కోవిడ్' ప్రభావాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నాం

ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ • అనుకున్న సమయానికే బ్యాంకింగ్ విలీనం

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థపై కోవిడ్-19 (కరోనా) వైరస్ ప్రభావాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం ఇక్కడ ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. అనుకున్న సమయంలో ఇది పూర్తవుతుందనీ, ఈ విషయంలో ఎటువంటి అనిశ్చితీ లేదనీ వివరించారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థికమంత్రి ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల చీఫ్‌లను ఉద్దేశించి ప్రసంగించారు. బ్యాంకర్లు తీసుకున్న వాణిజ్య నిర్ణయాల్లో నిజాయితీ ఉంటే, ఆయా నిర్ణయాల అమల్లో కొన్ని వ్యాపార కారణాల వల్ల తప్పు జరిగినా, బ్యాంకర్లకు వేధింపులు ఉండబోవని ఆర్థికమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 10 బ్యాంకుల విలీన కీలక నిర్ణయాన్ని గత ఆగస్టులో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విలీన ప్రక్రియ మొత్తం పూర్తయితే, 2017లో 27 ఉన్న మొత్తం ప్రభుత్వ బ్యాంకుల సంఖ్య 12కు తగ్గుతుంది. 2017 ఏప్రిల్‌లో భారతీయ మహిళా బ్యాంకుసహా అయిదు అనుబంధ బ్యాంకులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 2019లో విజయా బ్యాంకు, దేనా బ్యాంకులను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేశారు. కేంద్రం గతేడాది ప్రకటించిన ప్రభుత్వ రంగ బ్యాంకుల మెగా విలీన ప్రక్రియలో భాగంగా 10 బ్యాంకులను నాలుగింటిగా మార్చనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు 2020 ఏప్రిల్ 1 డెడ్‌లైన్‌గా కేంద్రం నిర్దేశించింది.

అక్టోబర్-డిసెంబర్ మధ్య వృద్ధి 4.5 శాతమే: ఎస్‌బీఐ

గత ఏడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో భారత స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు దాదాపు 4.5 శాతంగానే ఉంటుందని ఎస్‌బీఐ ఆర్థికవేత్తల నివేదిక అంచనావేసింది. 28వ తేదీ మూడవ త్రైమాసిక ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది. కోవిడ్-19 ప్రభావం భారత్ ఆర్థిక వ్యవస్థపై ఉంటుందని పేర్కొంది. చైనా నుంచి భారత్ వివిధ వస్తువులను దిగుమతి చేసుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. 2019-20లో భారత్ జీడీపీ దశాబ్దపు కనిష్ట స్థాయికి పడిపోయిన సంగతి తెలిసిందే. 2019-20లో వృద్ధి 4.7 శాతం ఉంటుందని ఎస్‌బీఐ ఎకనమిస్ట్ నివేదిక పేర్కొంది.

అప్పట్లో సచిన్, ఇప్పుడు విరాట్: సత్య నాదెళ్ల

కోడింగ్ కవిత్వం లాంటిదేనని వ్యాఖ్య

ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో నాదెళ్ల

న్యూఢిల్లీ: చాలా మంది భారతీయుల్లాగే సత్య నాదెళ్లకు క్రికెట్ అంటే ప్రేమే. కంప్యూటర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు సీఈఓగా వ్యవహరిస్తున్న నాదెళ్లకు ఇష్టమైన సబ్జెక్ట్ ఏదో మీరు ఊహించగలరా ? లెక్కలు, లేదా సైన్స్ అని ఊహిస్తే, మీరు పప్పులో కాలేసినట్లే. ఆయనకు ఇష్టమైన సబ్జెక్ట్.. చరిత్ర. ఇక కోడింగ్.. కవిత్వం లాంటిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ అనంత్ మహేశ్వరితో పిచ్చాపాటిగా జరిపిన సంభాషణలో ఆసక్తికరమైన విషయాలను సత్య నాదెళ్ల వెల్లడించారు.

ఎక్కడ ఉన్నా, మదిలో అదే...!

సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లిలో ఎవర్ని ఎన్నుకుంటారని అనంత్ అడుగగా, అప్పట్లో సచిన్ టెండూల్కర్ అని, ఇప్పుడైతే విరాట్ కోహ్లి అని సత్య నాదెళ్ల బదులిచ్చారు. తన పుస్తకం హిట్ రిఫ్రెష్‌లో క్రికెట్ ఆట తన వ్యక్తిగత, వృత్తిగత జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపిందో ఆయన పేర్కొన్నారు. తాను ఎక్కడ ఉన్నా, తన మదిలో క్రికెట్ క్రీడ మెదులుతూనే ఉంటుందని వివరించారు. కోడింగ్ కవిత్వం లాంటిదేనని పేర్కొన్నారు.

టయోటా హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ 'వెల్‌ఫైర్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ సెల్ఫ్ చార్జింగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ 'వెల్‌ఫైర్'ను భారత్‌లో ప్రవేశపెట్టింది. హైదరాబాద్ వేదికగా ఈ లగ్జరీ మల్టీ పర్పస్ వాహనాన్ని కంపెనీ బుధవారం విడుదల చేసింది. ఎక్స్ షోరూం ధర రూ.79.50 లక్షలు. డ్యూయల్ మోటార్స్‌తో 2.5 లీటర్ల గ్యాసోలిన్ హైబ్రిడ్ ఇంజన్ పొందుపరిచారు. 2800-4000 ఆర్‌పీఎంతో 198 ఎన్ఎం టార్క్, మైలేజీ లీటరుకు 16.35 కిలోమీటర్లు. భద్రత కొరకు 7 ఎస్ఆర్ఎస్ ఎయిర్ బ్యాగ్స్, వెహికిల్ డైనమిక్స్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, వెహికిల్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి ఫీచర్లను జోడించారు. 40 శాతం దూరం, 60 శాతం సమయం ఎలక్ట్రిక్ మోడ్‌లో ప్రయాణిస్తుంది. కళ్లు చెదిరే ఇంటీరియర్స్, ట్విన్ మూన్‌రూఫ్స్ దీని ప్రత్యేకత. నాలుగు రంగుల్లో లభిస్తుంది.

ధర రూ.79.50 లక్షలు

వెల్‌ఫైర్‌తో నవీన్ సోని, మసకజు యోషిమురా, విక్రమ్ కిర్లోస్కర్, సేల్స్ వైస్ ప్రెసిడెంట్ టడషి అసజుమ (ఎడమ నుంచి)

హైదరాబాద్ నుంచి 20%..: టెస్ట్ మార్కెట్‌గా పేరొందడంతోపాటు ప్రధాన మార్కెట్ కావడంతో వెల్‌ఫైర్‌ను హైదరాబాద్ వేదికగా విడుదల చేసినట్టు టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. తొలి 3 నెలల షిప్‌మెంట్స్ అమ్ముడైనట్టు టీకేఎం ఎస్‌వీపీ నవీన్ సోని వెల్లడించారు. ఒక్కో షిప్‌మెంట్లో 60 వాహనాలు ఉంటాయని వివరించారు. అమ్ముడైన వాహనాల్లో 20%పైగా హైదరాబాద్ నుంచే నమోదయ్యాయన్నారు. అంతర్జాతీయంగా 6 లక్షలకుపైగా వెల్‌ఫైర్ వాహనాలు విక్రయమయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుతం పూర్తిగా తయారైన వెల్‌ఫైర్ వాహనాలను జపాన్ నుంచి భారత్‌కు దిగుమతి చేసుకుంటున్నట్టు చెప్పారు. 1.5 కోట్ల యూనిట్ల ఎలక్ట్రిక్ వాహనాలను ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా విక్రయించామని టీకేఎం ఎండీ మసకజు యోషిమురా వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహన రంగంలో టయోటాకు 43% వాటా ఉందన్నారు.

నిబంధనలు సరళిస్తేనే మరిన్ని వీసాలు!

- అప్పుడే అక్కడ పెట్టుబడులు పెట్టగలం
- ట్రంప్‌తో భేటీలో టెక్ కంపెనీల వెల్లడి
- నిబంధనలను సడలిస్తున్నామన్న ట్రంప్
- 'సాక్షి'తో సైయంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి



ట్రంప్‌తో బీవీఆర్ మోహన్‌రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత టెక్నాలజీ కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టాలన్నా, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలన్నా నిబంధనల సరళీకరణ కీలకమని, సులభతర వ్యాపార నిబంధనలుంటేనే స్థానిక ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, ఉద్యోగాలూ వస్తాయని సైయంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి చెప్పారు. భారతీయ టెక్నాలజీ కంపెనీలు యూఎస్‌లో బిలియన్ల డాలర్ల కొద్దీ పెట్టుబడులు పెట్టి లక్షల ఉద్యోగాలను కల్పిస్తున్నాయని తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సీఈఓల సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాల్గొన్న మోహన్ రెడ్డి.. టెక్నాలజీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ట్రంప్ ముందు ప్రస్తావించారు. ఆ వివరాలు ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

''హెచ్1బీ వీసాలకు సంబంధించి యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గతేడాది నవంబర్‌లో 50:50 కంపెనీ చార్జెస్ నిబంధనలను తెచ్చింది. అంటే.. అమెరికాలోని భారతీయ కంపెనీల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది భారతీయులుంటే.. హెచ్1బీ వీసా కింద 4 వేల డాలర్లు, ఎల్1 కింద 4500 డాలర్ల రుసుము చెల్లించాలి. నిజానికి కొత్త హెచ్1బీ లేదా ఎల్1 వీసాల జారీలో ఈ నిబంధనలు ఓకే. కానీ రెన్యువల్ వీసాలకూ ఈ రుసుములు చెల్లించాలంటున్నారు. ఇది భారతీయ కంపెనీలకు పెనుభారమే. హెచ్1బీ ఉద్యోగుల స్థానంలో అమెరికన్స్‌కే ఉద్యోగాలిద్దామంటే.. ఉద్యోగ అనుభవం అడ్డొస్తుంది. కొత్తగా వెళ్లే కంపెనీలు కూడా 50:50 కంపెనీ చార్జీల భారాన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడి నుంచి ఉద్యోగులను తీసుకెళ్లే బదులు స్థానిక అమెరికన్స్‌కే ఉద్యోగాలిస్తున్నాయి. ఇక హెచ్1బీ వీసా వారి గ్రీన్‌కార్డ్ కోటా తొలగించటం వంటి లెజిస్లేటివ్ నిబంధనలూ ఇలాంటివే. ఈ విషయాన్ని ట్రంప్‌తో మేం ప్రస్తావించాం'' అని మోహన్‌రెడ్డి వివరించారు.

ట్రంప్ ఏం చెప్పారంటే...

వచ్చే 3-6 నెలల్లో అమెరికాలోని భారతీయ టెక్నాలజీ కంపెనీలకు సంబంధించి నియంత్రణలను సరళీకరిస్తామని ట్రంప్ హామీ ఇచ్చినట్లు మోహన్‌రెడ్డి వెల్లడించారు. ''గతంలో ఏ ప్రభుత్వమూ చేయనివిధంగా ట్రంప్ సర్కారు గత మూడేళ్లలో నియంత్రణల్ని సడలించినట్లు చెప్పారు. అడ్మినిస్ట్రేటివ్ నిబంధనల తొలగింపును ప్రారంభించామని, వాటిని నోటిపై చేయాల్సి ఉందని చెప్పారాయన'' అని మోహన్‌రెడ్డి వివరించారు.

2,000 నోటు ఇక కనుమరుగే..!

ఏటీఎంలలో ఎక్కువగా రూ.500 నోట్లే...

న్యూఢిల్లీ: బ్యాంకులు తమ ఏటీఎంల్లో ఎక్కువగా రూ.2,000కు బదులు రూ.500 నోట్లే ఉంచుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక విలువ కరెన్సీ నోట్లను క్రమంగా వెనక్కు తీసుకోడానికి ఇది సంకేతమనీ ఆ వర్గాలు సూచిస్తున్నాయి. సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం కింద అడిగిన ఒక ప్రశ్నకు గత ఏడాది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సమాధానం ఇస్తూ, రూ.2,000 నోట్ల ప్రింటింగ్‌ను నిలుపు చేసినట్లు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం..

- ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు ఏవీ లేనప్పటికీ, బ్యాంకులు తమకు తాముగా తమ ఏటీఎంలను తక్కువ విలువగల నోట్లతో నింపుతున్నాయి.
- ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ ఇప్పటికే ఒక ప్రకటన చేస్తూ, తమ ఏటీఎంల్లో రూ.2,000 నోట్ల వినియోగాన్ని నిలుపుచేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది.
- నిజానికి రూ.2,000 నోట్లను ఏటీఎంల్లో నింపడానికి వాటిని కొంత అప్‌గ్రేడ్ చేయాల్సిన పరిస్థితి. ఈ వ్యవహారం వ్యయాలపరంగా బ్యాంకింగ్‌పై అదనపు భారాన్ని మోపుతోంది. ఈ అంశం కూడా బ్యాంకులు రూ.2,000 నోట్లను ఏటీఎంలలో పెట్టడానికి కొంత వెనక్కుతగ్గేలా చేస్తోంది.
- సమాచార హక్కు చట్టం ప్రకారం, ఆర్‌బీఐ ఇచ్చిన సమాధానాన్ని చూస్తే, రూ.2,000కు సంబంధించి 2016-17లో 3,542.991 మిలియన్ నోట్లను ముద్రించడం జరిగింది. 2017-18లో ఈ సంఖ్య 111.507కు పడిపోయింది. 2018-19లో ఇది మరింతగా 46.690 మిలియన్ నోట్లకు తగ్గింది. దీని ప్రకారం చూస్తే రూ.2,000 నోటును ఆర్‌బీఐ క్రమంగా వెనక్కు తీసుకుంటున్న దాఖలాలు కనిపిస్తున్నాయి.
- అధిక విలువ కలిగిన నోట్ల అక్రమ నిల్వ, నల్ల ధనం నిరోధం లక్ష్యంగా రూ.2,000 నోటును వ్యవస్థ నుంచి క్రమంగా తగ్గిస్తున్నట్లు సంకేతాలు ఉన్నాయి.
- 2016 నవంబర్‌లో కేంద్రం రూ.1,000, రూ.500 విలువ నోట్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే.
- రూ.2,000 నోటును ఉపసంహరించే ప్రతిపాదనఏదీ ప్రభుత్వం వద్ద లేదని గత ఏడాది డిసెంబర్‌లో ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన తెలిపిన సమాచారం ప్రకారం, చెలామణీలో ఉన్న నోట్ల (ఎన్ఐసీ) విలువ 2016 నవంబర్ 4న రూ.17,74,187 కోట్లు. 2019 డిసెంబర్ 2 నాటికి ఈ విలువ రూ.22,35,648 కోట్లకు పెరిగింది.
- వార్షిక ప్రాతిపదికన చూస్తే, 2014 అక్టోబర్ నుంచి 2016 అక్టోబర్ మధ్య చెలామణీలో ఉన్న నోట్ల విలువ సగటున 14.51 శాతం పెరిగింది. ఈ లెక్కన చూస్తే, 2019 డిసెంబర్ 2 నాటికి ఎన్ఐసీ రూ.25,40,253 కోట్లకు చేరి ఉండవచ్చు.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- వారెన్ బఫెట్ ఐడియాలజీ షేర్లివి
- దేశీ మార్కెట్‌వైపు గ్లోబల్ ఫండ్స్ చూపు
- రాబోయేది ఎఫ్ఎంసీజీ రాజ్యమే!
- కెమికల్ షేర్లు...రేసు గుర్రాలు

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

హ్యుందాయ్ గ్రాండ్ ఐ10లో రెండు కొత్త వేరియంట్‌లు

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా కంపెనీ ప్రీమియమ్ హ్యాచ్‌బాక్, గ్రాండ్ ఐ10 నియోస్‌లో రెండు కొత్త వేరియంట్లను మార్కెట్లోకి తెచ్చింది. ఈ వేరియంట్లను 1 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో, బీఎస్-సిక్స్ ప్రమాణాలతో రూపొందించామని కంపెనీ తెలిపింది. స్పోర్ట్జ్ వేరియంట్ ధర రూ.7.68 లక్షలని. స్పోర్ట్జ్(డ్యుయల్ టోన్) వేరియంట్ ధర రూ.7.73 లక్షలు (ఈ రెండు ధరలు ఎక్స్ షోరూమ్) అని పేర్కొంది. ఈ కంపనీ ఈ మోడల్‌ను పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ వేరియంట్ల లలో విక్రయిస్తోంది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	43,580	▲ 270
బంగారం (22 క్యారెట్లు)	41,500	▲ 250
వెండి (కిలో)	51,400	▼ 1000
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	42,840	▼ 130
బంగారం (22 క్యారెట్లు)	40,920	▼ 120
వెండి (కిలో)	51,400	▼ 1000
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	43,350	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	39,960	▲ 140
వెండి (కిలో)	48,500	▼ 400
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	43,850	
బంగారం (22 క్యారెట్లు)	40,800	
వెండి (కిలో)	49,000	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	44,090	▼ 90
బంగారం (22 క్యారెట్లు)	40,800	▼ 120
వెండి (కిలో)	48,700	▼ 900

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన పాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	49.43 (రాత్రి 11.30కు)	$ 49.90 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	53.46 (రాత్రి 11.30కు)	$ 54.26 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 27-2-2020

విశాఖ	375-00
చిత్తూరు	383-00
వరంగల్	316-00
విజయవాడ	335-00
గోదావరి	335-00
26-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	313-00

వేలానికి నీరవ్‌మోదీ విలాస వస్తువులు

- కార్లు, గడియారాలు, పెయింటింగ్‌లు
- మార్చి మొదటి వారంలో వేలం

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకును రుణాల రూపంలో రూ.14,000 కోట్లకు పైగా మోసగించి విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్త నీరవ్‌మోదీకి చెందిన విలాస వస్తువులు వేలానికి రానున్నాయి. అరుదైన పెయింటింగ్‌లు, చేతి గడియారాలు, లగ్జరీ కార్లు ఇలా 112 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరపున 'శాఫ్రోనార్ట్' అనే సంస్థ వేలం వేయనుంది. వీటికి సంబంధించి మార్చి 5న ప్రత్యక్ష వేలం నిర్వహించనుంది. అలాగే, మరో 72 వస్తువులకు మార్చి 3, 4వ తేదీల్లో ఆన్‌లైన్ వేలం కూడా చేపట్టనుంది. తొలుత ప్రత్యక్ష వేలాన్ని ఈ నెల 27న నిర్వహించేందుకు నిర్ణయించగా, ఈడీ నుంచి వచ్చిన ఆదేశాలతో మార్చి 5కు మార్చి నట్టు శాఫ్రోనార్ట్ స్పష్టం చేసింది.

విలువైన పెయింటింగ్‌లు..

- 1935నాటికి చెందిన అమృత షేర్ గిల్ వేసిన పెయింటింగ్ 'బోయ్స్ విత్ లెమన్స్'' అధికంగా రూ.12-18 కోట్లు పలుకుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే విఖ్యాత చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ వేసిన 1972 నాటి పెయింటింగ్‌ను కూడా వేలం వేయనున్నారు. దీనికి కూడా దగ్గర దగ్గర ఇంతే ధర వస్తుందని భావిస్తున్నారు. అలాగే వీఎస్ గైతోండే, మంజిత్ బవా, రాజా రవివర్మ పెయింటింగ్‌లను వేలంలో అందుబాటులో ఉంచనున్నారు.
- జాగర్ లీకోల్చర్ పురుషుల 'రివర్స్ గైరోటర్బిల్లాన్ 2' అనే లిమిటెడ్ ఎడిషన్ చేతి గడియారానికి రూ.70 లక్షలు వస్తుందని అంచనా. పటేక్ ఫిలిప్ నాటిలస్ అనే బంగారం, వజ్రాల చేతి గడియారానికి కూడా రూ.70 లక్షలు లభిస్తుందని భావిస్తున్నారు.
- రోల్స్ రాయిస్ గోస్ట్ కారు రూ.95 లక్షలు పలుకుతుందని అంచనా.
- బ్రాండెడ్ హ్యాండ్‌బ్యాగులను కూడా వేలంలో ఉంచనున్నారు.
- ఇక మార్చి 3, 4న జరిగే వేలంలో పోర్షే ప్యానెమెరికా ఎస్ కార్ తదితర 72 వస్తువులను వేలానికి ఉంచనున్నట్టు శాఫ్రోనార్ట్ తెలిపింది.

2019లో దేశంలో కొత్తగా 34 బిలియనీర్లు

- సంపన్న భారతీయుడు ముకేశే: హరూన్
- ప్రపంచంలో మొదటి స్థానం... జెఫ్ బెజోస్

ముంబై: దేశంలో సంపన్నుల సంఖ్య 2019లో ఎక్స్‌ప్రెస్ వేగంతో పెరిగింది. ప్రతీ నెలా సుమారు ముగ్గురు చొప్పున కొత్తగా బిలియనీర్లు పుట్టుకొచ్చారు. మొత్తం మీద 2019లో 34 మంది బిలియనీర్లు అదనంగా జత కూడడంతో దేశంలో మొత్తం బిలియనీర్ల సంఖ్య 38కి చేరుకుందని హరూన్ గ్లోబల్‌రిచ్ లిస్ట్ 2020 9వ ఎడిషన్ తెలియజేసింది. 67 బిలియన్ డాలర్ల నికర విలువతో దేశంలోకెల్లా సంపన్నుడు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీయేనని ఈ నివేదిక ప్రకటించింది. 799 మంది బిలియనీర్లతో చైనా, 626 మంది బిలియనీర్లతో అమెరికా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌కు వెలుపల ఉన్న భారత సంతతికి చెందిన బిలియనీర్లను కూడా కలుపుకుంటే మొత్తం సంఖ్య 170గా ఉంటుందని ఈ నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్లు (రూ.7,000 కోట్లు), అంతకుమించిన నికర విలువ ఉన్న వారిని ఈ నివేదిక పరిగణనలోకి తీసుకుంది. ఇలాంటి వారు ప్రపంచవ్యాప్తంగా 2,817 మంది ఉన్నారు. 2019లో ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల నికర విలువ కలిగిన వారు కొత్తగా 480 మంది తోడయ్యారు. ముఖ్యంగా భారత్‌లో ప్రతీ నెలా ముగ్గురు చొప్పున పెరగ్గా, చైనాలో ప్రతీ వారానికి ముగ్గురు చొప్పున బిలియనీర్లు పుట్టుకొచ్చినట్టు ఈ నివేదిక తెలియజేసింది.

HURUN GLOBAL RICH LIST 胡润全球富豪榜

- ముకేశ్ అంబానీ 67 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలో 9వ సంపన్నుడిగా నిలిచారు.
- అమెజాన్ జెఫ్ బెజోస్ 140 బిలియన్ డాలర్లతో మొదటి స్థానంలో ఉన్నారు.
- ఎస్‌పీ హిందుజా కుటుంబం 27 బిలియన్ డాలర్లు, గౌతం అదానీ 17 బిలియన్ డాలర్లు, శివ్‌నాడార్, అతని కుటుంబం 17 బిలియన్ డాలర్లు, లక్ష్మీ నివాస్ మిట్టల్ 15 బిలియన్ డాలర్లు, ఉదయ్ కోటక్ 15 బిలియన్ డాలర్లు, అజీమ్ ప్రేమ్‌జీ 14 బిలియన్ డాలర్లు, సైరస్ పూనవాలా 12 బిలియన్ డాలర్లు, సైరస్ పల్లోంజీ మిస్త్రీ, ఆయన కుమారుడు షాపూర్ పల్లోంజీ 11 బిలియన్ డాలర్లు, ఓయో ప్రమోటర్ రితేష్ అగర్వాల్ 1.1 బిలియన్ డాలర్ల సంపద కలిగి ఉన్నారు.

అపోలో టైర్స్‌లో వార్‌బర్గ్ రూ.1,080 కోట్ల పెట్టుబడులు!

అపోలో టైర్స్ కంపెనీలో ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ, వార్‌బర్గ్ పింకస్ రూ.1,080 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నది. ఇందుకు వార్‌బర్గ్ పింకస్ అనుబంధ కంపెనీకి రూ.1,080 కోట్ల విలువైన తప్పనిసరి కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లను జారీ చేయడానికి డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని అపోలో టైర్స్ సీఎమ్‌డీ ఓంకార్ ఎస్ కన్వర్ తెలిపారు.

గ్రూప్ ఏడీపీ నుంచి రూ.5,248 కోట్లు:జీఎంఆర్

జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. ఫ్రెంచ్ కంపెనీ గ్రూప్ ఏడీపీ నుంచి రూ.5,248 కోట్లు పొందింది. ఎయిర్‌పోర్టుల వ్యాపారంలో 49% వాటాను గ్రూప్ ఏడీపీకి రూ.10,780 కోట్లకు జీఎంఆర్ విక్రయించిన సంగతి తెలిసిందే. తొలి విడత కింద ఈ మొత్తాన్ని అందుకున్నట్టు జీఎంఆర్ తెలిపింది.

సీసీఎల్... రూ.3 డివిడెండు

కాఫీ దిగ్గజం సీసీఎల్ ప్రొడక్ట్స్ 2019-20 సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రెండవ మధ్యంతర డివిడెండు రూ.1.50 చెల్లించాలని నిర్ణయించింది. అలాగే సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా మరో రూ.1.50 ప్రత్యేక డివిడెండు ఇవ్వాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఒక్కో షేరుపై రూ.2 తొలి మధ్యంతర డివిడెండు ఇప్పటికే పంచింది.

ఆడిటర్లపై మరింత బాధ్యత

న్యూఢిల్లీ: కార్పొరేట్ కంపెనీల ఆడిటింగ్ మరింత బాధ్యతగా, పారదర్శకంగా మారనుంది. వార్షిక నివేదికల్లో కంపెనీలకు సంబంధించి మరిన్ని వివరాలను వెల్లడించాల్సిన బాధ్యత ఆడిటర్లపై పెడుతూ కార్పొరేట్ వ్యవహారాల శాఖ నూతన ఆదేశాలను విడుదల చేసింది. తీసుకున్న రుణాలను చెల్లించడంలో విఫలమైతే, నగదు నష్టాలు ఎదురైతే ఆ వివరాలను కూడా ఆడిటర్లు బహిరంగ పరచాల్సి ఉంటుంది. అలాగే, కంపెనీలకు సంబంధించిన స్తిరాస్తులు, ఇతర అంశాలను కూడా వార్షిక నివేదికల్లో పొందుపరచాల్సి ఉంటుందని నూతన ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికలకూ ఇవి వర్తించనున్నాయి. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్, డీహెచ్‌ఎఫ్‌ఎల్ తదితర కంపెనీల ఖాతాల్లో ఎన్నో అవకతవకలు వెలుగు చూడడం, ఆ సంస్థలు బొక్కబోర్లా పడడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆడిటర్ల పాత్ర ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో సెబీ వంటి నియంత్రణ సంస్థలు ఆడిటింగ్ సంస్థల పాత్రను నిగ్గు తేల్చేందుకు దర్యాప్తు కూడా చేపట్టాల్సి వచ్చింది. దీంతో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ మరింత పారదర్శకతకు వీలు కల్పించేలా ఆడిటింగ్‌కు సంబంధించి నూతన నిబంధనలను విడుదల చేసింది. కంపెనీస్ (ఆడిటర్స్ రిపోర్ట్) ఆర్డర్, 2020 (సీఏఆర్‌వో, 2020)ను కార్పొరేట్ శాఖ నోటిఫై చేసింది. 2019 ఏప్రిల్ 1 తర్వాత నుంచి కంపెనీల వార్షిక ఆర్థిక నివేదికల ఆడిటింగ్‌కు నూతన ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. సీఏఆర్‌వో 2016లో 21 అంశాలపై ఆడిటర్లు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉండగా, సీఏఆర్‌వో 2020 కింద 50 అంశాలపై ఆడిటర్లు తమ పరిశీలనను నివేదికల్లో తెలియజేయాల్సి ఉంటుందని ఆడిటింగ్ సంస్థ ఎస్ఆర్ బట్లిబోయ్ అండ్ కంపెనీ పార్ట్‌నర్ సంజీవ్ సింఘాల్ తెలిపారు.

ఇక స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా ఫండ్ల క్రయ, విక్రయాలు

న్యూఢిల్లీ: ఇక నుంచి ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల కొనుగోళ్లు, అమ్మకాలను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా జరపుకోవచ్చు. స్టాక్ బ్రోకర్లు, మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ల ప్రమేయం లేకుండానే ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్ యూనిట్ల అమ్మకాలు, కొనుగోళ్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా నిర్వహించుకోవచ్చు. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఒక సర్క్యూలర్‌ను జారీ చేసింది. దీని కోసం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, క్లియరింగ్ కార్పొరేషన్లు, డిపాజిటరీలు తమ నియమ నిబంధనల్లో తగిన సవరణలు చేయాలని సెబీ ఆదేశాలు జారీ చేసింది.

గతంలోనే అవకాశం...

మ్యూచువల్ ఫండ్ యూనిట్ల క్రయ, విక్రయ లావాదేవీలను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా నిర్వహించడానికి మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, నమోదైన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లకు గతంలో సెబీ అవకాశం కల్పించింది. ఇప్పుడు ఈ అవకాశాన్ని ఇన్వెస్టర్లకు కూడా అందిస్తోంది. సెబీ తాజా నిర్ణయం కారణంగా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం మరింత సులభమవుతుందని విశ్లేషకులు అంటున్నారు. అయితే వ్యయాలు పెరిగే అవకాశాలున్నాయని వారంటున్నారు. ఈ అవకాశాన్ని మ్యూచువల్ ఫండ్స్ యూ నిట్ల ట్రేడింగ్‌కు ఇన్వెస్టర్లు వినియోగించుకోకూడదని వారు సూచిస్తున్నారు.

తయారీ రంగంలో (ఏరోస్పేస్) అత్యుత్తమ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కుగాను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నుంచి జాతీయ అవార్డును స్వీకరిస్తున్న శ్రీ వెంకటేశ్వర ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతలచెరువు సందీప్

టమాటా, ఉల్లి ధరలు పడిపోతే వెంటనే చర్యలు

ధరల పతనంపై అప్రమత్తం చేసేందుకు వెబ్‌సైట్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్

న్యూఢిల్లీ: టమాటా, ఉల్లిపాయలు, ఆలుగడ్డల ధరలు ఉన్నట్టుండి పతనమైతే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసేందుకు రూపొందించిన పోర్టల్ (వెబ్‌సైట్)ను కేంద్ర ఆహార శుద్ధి శాఖా మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ బాదల్ బుధవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ''ప్రజలు అధికంగా వినియోగించే ఈ మూడు కూరగాయల టోకు ధరలను ఈ పోర్టల్ తెలియజేస్తుంది. అధిక సరఫరా కారణంగా ధరలు పడిపోతే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తుంది. దీంతో 'ఆపరేషన్స్ గ్రీన్' పథకం కింద ప్రభుత్వం సకాలంలో స్పందించి.. అధికంగా ఉన్న ఉత్పత్తిని కోల్డ్ స్టోరేజ్‌లకు తరలించేందుకు వీలుగా రైతులకు సబ్సిడీ ఇస్తుంది. లేదా మిగులు ఉత్పత్తిని డిమాండ్ ఉన్న చోటుకు తరలించేందుకు సాయమందిస్తుంది'' అని మంత్రి బాదల్ తెలిపారు. క్రితం ఏడాది అదే కాలంతో పోలిస్తే ధరలు 50 శాతం పతనమైనా, మూడేళ్ల కనిష్ట స్థాయికి ఈ మూడు కూరగాయల ధరలు క్షీణించినా ప్రభుత్వం రూపొందించిన 'మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ (ఎంఐఈడబ్ల్యూఎస్) అనే పోర్టల్ హెచ్చరికలు పంపుతుంది. దేశవ్యాప్తంగా 1,200 మార్కెట్లలో వీటి ధరలను ఈ పోర్టల్ తెలియజేస్తుందని నాఫెడ్ అడిషనల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌కే సింగ్ తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ జిల్లా వరంగల్ (పట్టణము)
సంక్షిప్త టెండర్ ప్రకటన
ఆర్.సి.నెం.522/2020/ఎన్4 తేది: 25-02-2020
వరంగల్ (పట్టణ) జిల్లాలో గల కాకతీయ జంతు ప్రదర్శనశాలలో 2020-21 సంవత్సరంకు (4 పనులకు గాను వేరువేరుగా ప్రతి పనికి వేరుగా టెండర్ ఫారం దాఖలు చేయాలి నమోదిత కాంట్రాక్టర్లు/ పనిఅనుభవం గల సంస్థలు మరియు వ్యక్తిగత సీల్డ్ టెండర్లు ఆహ్వానించనైనది. టెండరు డాక్యుమెంట్లు పొందుటకు మరియు పైన పేర్కొనబడిన (4) నాలుగు పనుల సమగ్ర సమాచారం కొరకు జిల్లా అటవీ అధికారి, వరంగల్ (పట్టణ) & జనగాం జిల్లా గారి కార్యాలయం యొక్క పని దినములలో 27-02-2020 నుండి 13-03-2020 మ.2:00 గం. వరకు సంప్రదించగలరు. టెండర్ ఫారంలు పొందుటకు ఆఖరు తేది: 13-03-2020 మ.2:00 గం.కు. సీల్డ్ టెండర్ ఫారంల దాఖలుకు ఆఖరు తేది: 13-03-2020 సా.4:00 గం.కు. సీల్డ్ టెండర్లు తెరుచుట తేది: 13-03-2020 సా.5:00 గం.కు. ఇతర వివరాలకు పై కార్యాలయంలో సంప్రదించగలరు.
సం/- జిల్లా అటవీ అధికారి
DIPR Ro.No.2537-DP/CL/Advt/1/2019-20, Dt: 26-02-2020

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
టెండర్ నోటీసు
టెండరు నోటీసు నెం.16, 17, 18 మరియు 19/ఇ.ఇ/డివిజన్ నెం.4/కె.యన్.ఆర్.పి./2019-20 (రెండవ పిలుపు), తేది: 24-02-2020. టెండరు డాక్యుమెంట్ ప్రారంభ తేది: 27-02-2020న ఉ.11:00 గం॥ నుండి. టెండరు డాక్యుమెంట్ ముగింపు తేది: 05-03-2020న సా. 4:00 గం.వరకు. టెండర్ బిడ్ తెరుచు తేది: 06-03-2020న ఉ.11:00 గం॥ల నుండి. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- కార్యనిర్వాహక అభియంత, డివిజన్ నెం.4, కె.యన్.ఆర్.ప్రాజెక్టు, కడెం. ఫోన్ నెం.08730-252201
DIPR Ro.No.713-PP/CL/Advt/1/2019-20, Dt: 26-02-2020

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Rajendranagar: Hyderabad-30
Ref. No.14786/Exams/2019 Date:26-02-2020
FOURTH CONVOCATION NOTIFICATION
The Fourth Convocation of Professor Jayashankar Telangana State Agricultural University will be held on 18th March, 2020 (Wednesday) at 10:30 A.M. in the University Auditorium, Rajendranagar. For details visit: www.pjtsau.edu.in
Dr. S.SUDHEER KUMAR, REGISTRAR

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
టెండర్లు కోరుతూ ప్రకటన
CTN No. 110-119/SE/TS/Tenders/2019-20 తేది: 22.02.2020
పనుల సంఖ్య (10). పనుల పేరు: హెలియా-ఆంజనేయ తండా రోడ్డుకు కాలానుగత రెన్యువల్, జోగికుంట-గుండ్లపల్లి రోడ్డుకు కాలానుగత రెన్యువల్, మేళ్ళ చెరువు-చౌటుప్పల్ రోడ్డుకు కాలానుగత రెన్యువల్ మరియు ఇతర సివిల్ పనుల కోసం దిగువ సంతకదారునిచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 3.67 కోట్లు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-హెల్పెడ్స్ అంటే https://tender.telangana.gov.in నుండి 26.02.2020 సా. 5.30 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ స్వీకరణకు ఆఖరు తేది: 04.03.2020న లేదా అలోగా మ. 3.30 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ హెల్పెడ్స్ అంటే https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B), రీజియన్, నల్గొండ
DIPR RO. No. 2524-DP/CL/ADVT/1/2019-20; Dt : 26.02.2020

తెలంగాణ ప్రభుత్వము
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఈ క్రింది పనులకు బిడ్లను ఆహ్వానించడమైనది. 1. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ సంఖ్య 18/2019-20, తేది: 17.02.2020. మైనర్ ఇరిగేషన్ - వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం, అంతారం గ్రామము వద్ద గల పెద్దవాగుపై చెక్ డ్యాం నిర్మాణము చేయుట గురించి అంచనా విలువ: రూ.160.56 లక్షలు. 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ సంఖ్య 19/2019-20, తేది: 17.02.2020. మైనర్ ఇరిగేషన్ - వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం, పుట్టపహాడ్/ సాల్వీడ్ గ్రామము వద్ద గల పెద్దవాగుపై చెక్ డ్యాం నిర్మాణము చేయుట గురించి అంచనా విలువ: రూ.137.76లక్షలు. 3. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ సంఖ్య 20/2019-20, తేది: 17.02.2020. మైనర్ ఇరిగేషన్ - వికారాబాద్ జిల్లా, పరిగి మండలం, లఖ్నాపూర్ గ్రామము వద్ద గల లఖ్నాపూర్‌వాగ పై చెక్ డ్యాం నిర్మాణము చేయుట గురించి అంచనా విలువ: రూ.180.86 లక్షలు. టెండరు స్వీకరించు ఆఖరు తేది 04.03.2020 మరియు సమయం సా.4.00 గం.ల వరకు. గమనిక: మిగతా వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- కే.ధర్మ, తేది: 24.02.2020, పర్యవేక్షక అభియంత I&CADD, ఇరిగేషన్ సర్కిల్, రంగారెడ్డి జిల్లా, రెడ్‌హిల్స్, హైదరాబాద్. ఫోన్:040-23394218
DIPR RO No.716-PP/CL/Advt/1/2019-20 Dt: 26.02.2020

తెలంగాణ ప్రభుత్వం
పోలీసు శాఖ
అడిషనల్ DGP కార్యాలయం, గ్రేహౌండ్స్, TS, హైదరాబాద్
C.No.998/S1/GHs/TS/2019-20 సంక్షిప్త టెండరు ప్రకటన తేది:25-02-2020
CCTV సర్వీలియన్స్ సిస్టమ్ సరఫరా మరియు స్థాపన కోసం తయారీదారులు మరియు అధీకృత డీలర్ల నుండి దిగువ సంతకందారునిచే టెండర్లు కోరబడుచున్నవి. (కొన్ని విదేశాల వస్తువుల విషయంలో గమనించిన విధంగా ఏదేని నకిలీ/సబ్-స్టాండర్డ్ హార్డ్‌వేర్/సాఫ్ట్‌వేర్ ఎక్విప్‌మెంట్ మరియు సంస్థ భద్రతతో రాజీపడే విధంగా ఉండే ఎక్విప్‌మెంట్ చట్టవిరుద్ధమైనవిగా పరిగణింపబడును). సుమారు కాచలసిన పరిమాణము: 01. బయానా మొత్తం రూ.లలో: 5,00,000/-. బిడ్ తెరుచు & ముగింపు తేది, సమయం: 02-03-2020న ఉ.11:00 గం. నుండి 10:03-2020న సా.5:00 గం. వరకు. ప్రీ-క్వాలిఫికేషన్ బిడ్ తెరుచు తేది: 11-03-2020న ఉ.11:00 గం.కు. టెక్నికల్ స్పెసిఫికేషన్స్ బిడ్ తెరుచు తేది: 13-03-2020న ఉ.11:00 గం. ధర/ఆర్థిక బిడ్ తెరుచు తేది: 16-03-2020న ఉ.11:00 గం. తదుపరి వివరాలను కార్యాలయం నుండి పొందవచ్చును.
సం/- అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, గ్రేహౌండ్స్, TS, హైదరాబాద్
DIPR Ro.No.2528-DP/CL/Advt/1/2019-20, Dt:26-02-2020

THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
Regd. Office: Kothagudem Collieries - 507 101
e-Procurement TENDER NOTICE
Tenders have been published for the following works through e-procurement platform. For details, please visit
https://tender.telangana.gov.in–or–https://www.scclmines.com
NIT No., Date-Name of the work-ECV-Last date & time for Submission of bids
CRP/CVL/MMR/TN-80/2019-20 Dt.22.02.2020 – Special repairs to 5 nos. elevated water storage reservoirs at Ramalayam, Angadi bazaar, Ashok nagar, SBH and Area Hospital in Ramakrishnapur township, Mandamarri area, Mancherial dist, T.S - Rs. 71,16,466/- up to 04:30 PM on 10.03.2020.
MMR/CVL/E-MM/T-108/2019-20 - M&R works to T2 type quarters at Somagudem township and D-type quarters at Raman colony Mandamarri area for the year 2020-21, Mancherial Dist T.S - Rs. 30,60,410/- up to 04:30 PM on 06.03.2020.
PR/2019-20/CVL/LWA/118 GM, MM Area - Chief (Civil)

'ఐటీడీఏ నిర్వహణలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలే కీలకం'

సాక్షి, హైదరాబాద్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) నిర్వహించే కార్యక్రమాల్లో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు కీలకమని గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని మూడు ఐటీడీఏలకు కొత్తగా ప్రాజెక్టు అధికారులను నియమించిన నేపథ్యంలో వారికి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ఆయన బుధవారం పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. ఐటీడీఏలకు కేటాయించే నిధులను వినియోగించే అధికారం ప్రాజెక్టు అధికారులకే ఉంటుందని, వాటిని ఎలా వినియోగించాలనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు, బయోమెట్రిక్ హాజరు విధానం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఆశ్రమ, గురుకుల పాఠశాలల నిర్వహణ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

మూడు ఐటీడీఏలకు ఐఏఎస్‌లు...

రాష్ట్రంలో మూడు ఐటీడీఏలకు ప్రస్తుతం ఐఏఎస్ అధికారులను పీఓలుగా ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఉట్నూరు ఐటీడీఏ పీఓగా భవేశ్ మిశ్రా, ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓగా హనుమంతు కొండిబ, భద్రాచలం ఐటీడీఏ పీఓగా గౌతమ్ పొత్రులు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ఐటీడీఏ పీఓలుగా ప్రభుత్వం నాన్ కేడర్ అధికారులో, లేదా జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగిస్తూ వస్తుండగా... తొలిసారి మూడు ఐటీడీఏలకు ఐఏఎస్‌లను నియమించడం విశేషం.

ఉద్యాన పంటల ఉత్పాదకతకు డచ్ టెక్నాలజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ ఉద్యాన పంటల ఉత్పాదకతను పెంచడానికి డచ్ టెక్నాలజీ ఉపయోగపడుతుందని నెదర్లాండ్స్ ప్రతినిధి బృందం తెలిపింది. ఈ మేరకు బుధవారం భారత్‌లోని నెదర్లాండ్స్ రాయబార కార్యాలయానికి చెందిన ఈఏ వాన్ డీజిల్, ట్రేడ్ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలోని 9 మంది సభ్యుల బృందం వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డితో సమావేశమైంది. ఇందులో తెలంగాణలో ఉద్యాన పంటల పరిస్థితిని నెదర్లాండ్ ఉద్యాన ట్రేడ్ బృందానికి జనార్దన్ రెడ్డి వివరించారు. డచ్ సాంకేతిక పరిజ్ఞానం తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయం చేయడానికి ఉపయోగపడుతుందని బృందం తెలిపింది. రాష్ట్రంలో హరిత గృహాల్లో సాగుకు అనువైన డచ్ రకాల పువ్వులు, కూరగాయలు, బంగాళాదుంప రకాలు పండించవచ్చన్నారు. జీడిమెట్ల, ములుగుల్లోని సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు లాభాలు ఆర్జించే దిశగా వ్యాపార ప్రణాళికలను సిద్ధం చేయడానికి మద్దతు ఇస్తామన్నారు. సుగంధ ద్రవ్యాలు, ప

టీటీడీ ఉద్యోగులకు శ్రీవారి బ్రేక్ దర్శనం

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన పింఛనుదారుల కుటుంబాలకు శ్రీవారి బిగినింగ్ బ్రేక్ దర్శనం కల్పిస్తూ ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్ర నాథ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. టీటీడీ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఇటీవల టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డిని కలిసి ఉద్యోగులకు బిగినింగ్ బ్రేక్ దర్శనం కల్పించాలని కోరిన విషయం తెలిసిందే. దీనిపై చర్చించిన అధికారులు ఉదయం వీఐపీ బ్రేక్, శ్రీవాణి ట్రస్టు భక్తుల దర్శనానంతరం టీటీడీ ఉద్యోగులను, పింఛనుదారులను స్వామి వారి దర్శనానికి అనుమతించేలా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, టీటీడీ ఉద్యోగులు శ్రీవారి లడ్డూలు, అదనపు లడ్డూలు పొందేందుకుగాను రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఏవీ ధర్మారెడ్డి పోటు అధికారులను ఆదేశించారు. ఆ మేరకు విక్రయ కేంద్రంలోని 45, 46 కౌంటర్లను వారి కోసం కేటాయించారు.

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా రాహుల్ బొజ్జా

సాక్షి, హైదరాబాద్: బాసర ట్రిపుల్ ఐటీకి (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌ను (వీసీ) ప్రభుత్వం నియమించింది. ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ కారదర్శి రాహుల్ బొజ్జాకు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

హైవే మరణాల తగ్గింపు లక్ష్యంగా..

- 'నేషనల్ రోడ్‌సేఫ్టీ ప్లాన్' అమలుకు నిర్ణయం
- కేంద్రానికి నివేదిక సమర్పించిన రోడ్‌సేఫ్టీ వింగ్ చైర్మన్ క్రిష్ణప్రసాద్

సాక్షి, హైదరాబాద్: త్వరలో జాతీయ రహదారులపై ప్రత్యేక పోలీసు దళం కనిపించనుంది. వీరు మిగతా పోలీసుల్లా కాకుండా, ప్రత్యేకమైన వస్త్రధారణతో చూడగానే సులువుగా గుర్తుపట్టేలా ఉంటారు. జాతీయ రహదారులపై మరణాల తగ్గింపే లక్ష్యంగా పనిచేస్తారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రత్యేక వాహనాల్లో చేరుకుంటారు. ప్రాథమిక చికిత్స అందిస్తారు. అవసరమైతే ఎయిర్ అంబులెన్సులు (హెలికాప్టర్లు) వినియోగిస్తారు. రోడ్డు ప్రమాదాల నివారణ మాత్రమే వీరి పని. ప్రమాదాలు జరిగాక కేసులు, దర్యాప్తులు స్థానిక పోలీసులు చూసుకుంటారు. నిరంతరం జాతీయ రహదారిపై నిఘా ఉంచడం, రోడ్డు ప్రమాదాలు–ట్రాఫిక్ నిబంధనలపై పౌరులను, డ్రైవర్లను చైతన్యం చేయడం వీరి ప్రధాన లక్ష్యం. ఇలాంటి ప్రత్యేక దళం ఏర్పాటు చేయాలని తెలంగాణ రోడ్‌సేఫ్టీ వింగ్ చైర్మన్, డీజీ, తెన్నేటి క్రిష్ణప్రసాద్ కేంద్రానికి సూచించారు. ఎన్‌హెచ్‌లపై జరిగే మరణాలను తగ్గించేందుకు పరిష్కారాలు చూపించాలని భారత ప్రభుత్వం, కేంద్ర హోంశాఖల ఆదేశాలతో ఆయన ఆరునెలలపాటు అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలు సూచిస్తూ నేషనల్ రోడ్‌సేఫ్టీ ప్లాన్ పేరిట సమగ్ర నివేదిక సమర్పించారు. ఇందులో ప్రత్యేక దళం ఏర్పాటు, నిర్వహణ తదితర విషయాలపై కూలంకషంగా వివరించారు.

ఏం చేస్తారు?

1. జాతీయ రహదారులపై నిఘా, సీటు బెల్టు ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్‌స్పీడ్, ఓవర్ లోడింగ్, డ్రంకెన్ డ్రైవ్ తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.
2. ప్రమాదాలు జరిగిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి.. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించడం, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించడం చేస్తారు.
3. మిగిలిన సమయాల్లో రోడ్డు పక్కన ఉన్న గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ట్రక్కు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల వల్ల జరిగే నష్టాన్ని వివరించి అవగాహన కల్పిస్తారు.
4. బ్రేక్‌డౌన్ లేదా ప్రమాదాలకు గురైన వాహనాలను క్రేన్ల సాయంతో నిమిషాల్లో పక్కకి తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేలా చేస్తారు.
5. ఈ దళాన్ని పర్యవేక్షించేందుకు చీఫ్ రోడ్‌సేఫ్టీ ఆఫీసర్ ఢిల్లీలో ఉంటారు. 22 రీజినల్, 84 డివిజనల్, 160 గ్రూపు, 237 సబ్‌గ్రూప్, 651 ఫీల్డ్ ఆఫీసులు పనిచేస్తాయి.
6. ఈ దళానికి కంట్రోల్ రూములు, వాహనాలు, ఎయిర్ అంబులెన్సులు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ఐటీ సపోర్ట్, మానవ వనరుల కోసం రూ. 3,308 కోట్లు, నిర్వహణకు ఏటా రూ.2,007 కోట్లు అవసరం పడతాయని తెలిపారు.

32 వేల మరణాల తగ్గింపే లక్ష్యం..

దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో జాతీయ రహదారుల వాటా అధికం. ఏటా 65 వేల మంది జాతీయ రహదారులపైనే మరణిస్తున్నారు. ఫలితంగా దేశం 1 శాతం (రూ.2 లక్షల కోట్లు) జీడీపీ నష్టపోతోంది. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా ఈ మరణాలను 50 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దాదాపు 32 వేల మరణాలను ఎలా నివారించాలో నివేదికలో పొందుపరిచారు. ఈ చర్యలు సఫలమైతే రూ.లక్ష కోట్లు ఆదా చేయొచ్చు. కాగా, బ్లాక్‌స్పాట్లను గుర్తించి వాటిని నిర్మూలించడానికి చర్యలు చేపట్టాలని కేంద్రానికి సూచించారు.

అరచేతిలో షీ సేఫ్!

సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ సంయుక్తంగా యాప్ రూపకల్పన

- గృహ హింస, సైబర్ నేరాల్లో మార్గదర్శకాల ద్వారా మహిళలకు సహాయం
- ఐటీ కారిడార్‌లో సురక్షిత హాస్టళ్లు ఎంచుకునేలా వివరాలు
- వీధి దీపాలు లేని ప్రాంతాల ఫొటోలు అప్‌లోడ్ చేసేలా ఫీచర్

సాక్షి, సిటీబ్యూరో: 'మీరు గృహ హింసకు గురవుతున్నారా.. ఆన్‌లైన్ వేదికగా ఆకతాయిలు వేధిస్తున్నారా.. సైబర్ నేరాల బారిన పడ్డారా.. జీవితంపై విరక్తి చెంది తీవ్ర ఒత్తిడిలో ఉన్నారా..'కారణాలేమైతేనేం మీ మొబైల్‌లో 'షీ సేఫ్' యాప్ నిక్షిప్తం చేసుకుంటే చాలు. నేరాలు, ఒత్తిడి తదితరాల బారి నుంచి ఎలా బయటపడాలో మార్గదర్శకాలు దగ్గరుండి మరీ మీకు మార్గదర్శనం చేసి అవసరమైన సహాయాన్ని అందిస్తారు. అది పోలీసుపరంగా, న్యాయపరంగా, షీ టీమ్‌ల పరంగా.. ఇలా ఎవరి వల్ల ఆ సమస్య పరిష్కారమవుతుందో అటువైపుగా మార్గదర్శనం చేసి ఆ బాధల నుంచి విముక్తి కల్పిస్తారు. ఇలా మహిళల భద్రతకు సంబంధించి సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సరికొత్తగా రూపొందించిన 'షీ సేఫ్'యాప్ అతివలకు ఎంతో ఉపయుక్తకరం కానుంది. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఈ యాప్‌ను వచ్చే మహిళా దినోత్సవం పురస్కరించుకొని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అధికారికంగా అందుబాటులోకి తెచ్చేలా చూస్తున్నారు. ఆ తర్వాత రాచకొండ, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంత ముఖ్య వివరాలను జోడించి ఈ యాప్‌ను సరికొత్తగా అతివల భద్రత కోసం తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

మార్గదర్శనం చేస్తారు

ఈ యాప్‌ను నిక్షిప్తం చేసుకున్న మహిళలు ఎవరైనా గృహహింస, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల విషయాల్లో మార్గదర్శకల సహాయం కోరవచ్చు. మీరు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఉంటే ఈ యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ క్లిక్ చేయడం ద్వారా మార్గదర్శకులు, షీ బృందాలు, మహిళా పోలీసు స్టేషన్లు, భరోసా కేంద్రాలు, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుంది. హాక్ ఐను కూడా దీంతో అనుసంధానం చేశారు. అలాగే మహిళల భద్రత గురించి ఎస్‌సీఎస్‌సీ నిర్వహించే భద్రత కార్యక్రమాలు, అవగాహన సదస్సు వివరాలను తెలుసుకోవచ్చు.

'సేఫ్ స్టే'చేయవచ్చు..

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో 2 లక్షల మందికి పైగా సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఏ హాస్టల్స్ ఉండేందుకు సురక్షితమనే వివరాలను కూడా 'ప్రాజెక్టు సేఫ్ స్టే'ఫీచర్‌లో పొందుపరిచారు. ఇప్పటికే ఏఏ హాస్టళ్లలో సీసీటీవీ కెమెరాలున్నాయి, భద్రత ఎలా ఉంది, సందర్శకుల రిజిస్టర్ నమోదు చేస్తున్నారా తదితర అంశాలపై అధ్యయనం చేసిన ఎస్‌సీఎస్‌సీ, సైబరాబాద్ పోలీసులు వందకుపైగా హాస్టళ్ల పేర్లను చేర్చారు. ఇలా ఐటీ కారిడార్‌లో ఏఏ హాస్టళ్లలో ఉండటం మంచిదనే విషయాన్ని తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

డౌన్‌లోడ్ చేసుకోండిలా...

గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి 'షీ సేఫ్'అని టైప్ చేయగానే యాప్ వస్తుంది. దీన్ని స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాపిల్ స్టోర్ ద్వారా కూడా నిక్షిప్తం చేసుకునేలా ఫీచర్లు రూపొందించారు.

ఫొటో తీసి అప్‌లోడ్ చేయండి..

మీరు సంచరించే ప్రాంతాల్లో ఎక్కడైనా వీధి దీపాలు వెలగకుండా చీకటిగా ఉంటే ఆ దృశ్యాన్ని సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసే ఫీచర్‌ను అందుబాటులో ఉంచారు. ఇలా మీరు ఆ చిత్రాన్ని, ప్రాంతాన్ని నమోదు చేస్తే ఎస్‌సీఎస్‌సీ సభ్యులు సంబంధిత విభాగాల ద్వారా ఆయా ప్రాంతాల్లో లైట్లు వెలిగేలా చూస్తారు. అలాగే ప్రయాణం చేస్తున్న సమయంలోనే ఈ–లెర్నింగ్స్, భద్రత అవగాహన మాడ్యూల్స్‌ను యాక్సెస్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. అలాగే ఐటీ కారిడార్‌లో సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగుల కోసం నడుపుతున్న షీ షటిల్ బస్సుల ప్రయాణ వివరాలు అందుబాటులో ఉంచారు. అలాగే హాక్ ఐ యాప్ కూడా ఈ అప్లికేషన్ ద్వారా యాక్సెస్ చేసుకునేలా రూపకల్పన చేశారు. సైబరాబాద్ పోలీసు కమాండ్ కంట్రోల్‌కి కూడా యాక్సెస్ చేశారు.

హాక్ ఐ అత్యవసర పరిస్థితుల్లోనే..

హాక్ ఐ అనేది అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించడానికి మరియు ఏదైనా సంఘటనలను నివేదించడానికి సంబంధించిన యాప్. అయితే షీ సేఫ్ యాప్ ముఖ్యంగా మహిళలు బాధలో ఉన్నప్పుడు మార్గదర్శకాలను సంప్రదించవచ్చు. తద్వారా సాయం పొందొచ్చు. మహిళలను అప్రమత్తంగా ఉంచటానికి ఇందులో రోజువారీ నోటిఫికేషన్లు వస్తుంటాయి. నిరంతరం మహిళల భద్రత గురించి వివరాలుంటాయి. ఈ యాప్ మహిళల భద్రతకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది.

బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దగ్గుబాటి సురేష్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నల్లమలుపు బుజ్జి, జెమిని కిరణ్ తదితరులు

ఏపీ సీఎంను కలిసిన టాలీవుడ్ నిర్మాతలు

- 'హుద్‌హుద్' బాధితులకోసం సినీ పరిశ్రమ నిర్మించిన ఇళ్ల ప్రారంభానికి రావాలని వినతి
- ఏపీ సీఎం సానుకూలంగా స్పందించారన్న దగ్గుబాటి సురేష్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన అగ్ర నిర్మాతలు భేటీ అయ్యారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్మాతలు దగ్గుబాటి సురేష్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నల్లమలుపు బుజ్జి, జెమిని కిరణ్ తదితరులు ముఖ్యమంత్రిని కలిశారు. సమావేశానంతరం దగ్గుబాటి సురేష్ మాట్లాడుతూ.. ఆరేళ్లక్రితం విశాఖపట్నంలో హుద్‌హుద్ తుపాను సృష్టించిన విలయానికి నిరాశ్రయులైన వారిని ఆదుకోవడంలో భాగంగా సినీ పరిశ్రమ నిధులు సేకరించి వాటితో విశాఖలో బాధితులకు ఇళ్లు కట్టించినట్లు తెలిపారు. దాదాపు రూ.15 కోట్ల నిధులు వచ్చాయని, ఈ మొత్తంతో గృహసముదాయాన్ని నిర్మించామన్నారు. ఆ ఇళ్లను ప్రారంభించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరామని, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాల్గొన్నారు.

దరఖాస్తుపై అయోమయం

- జనవరిలో 19 ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టులకు నోటిఫికేషన్
- ఇటీవల 15 ఎస్టీ గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పల్ ఉద్యోగాలకూ నోటిఫికేషన్
- రెండింటినీ కలుపుతూ తాజాగా నోటిఫికేషన్ ఇవ్వడంతో గందరగోళం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రిన్సిపల్ ఉద్యోగాల నియామకాలపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. గత నెల 14న ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో 19 ప్రిన్సిపల్ పోస్టులకు తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ విడుదలయ్యాక ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 20న కొత్తగా ఎస్టీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో మరో 15 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెలలో జారీ చేసిన నోటిఫికేషన్‌లోనే కొత్త పోస్టులను కలుపుతూ ఎస్సీ, ఎస్టీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో మొత్తం 34 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు మార్చి 20వ తేదీ వరకు గడువును నిర్దేశించింది. అయితే తొలుత జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి ఏమిటనే దానిపై బోర్డుకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. మొదటి నోటిఫికేషన్ ప్రకారం ఎస్సీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పల్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారు కొత్తగా ఎస్టీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పల్ పోస్టుకు కూడా దరఖాస్తు చేసుకోవాలా అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

ఆప్షన్లు మార్చుకుంటే సరి...

గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రిన్సిపల్ ఉద్యోగాల దరఖాస్తుపై గురుకుల బోర్డు స్పష్టత ఇచ్చింది. అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన యంత్రాంగం.. ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు కల్పించింది. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి యూజర్ ఐడీ ద్వారా లాగిన్ అయ్యాక ఆప్షన్లు మార్చుకోవాలని సూచిస్తూ వివరాలను గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. మొత్తం 34 కాలేజీల్లో ప్రిన్స్‌పల్ పోస్టులు భర్తీ చేస్తుండగా... ఇందులో 5 పోస్టులు జనరల్ కాలేజీలు కాగా... మిగతా 29 మహిళా డిగ్రీ కాలేజీలు.

రాష్ట్రంలో పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాగల 2 రోజులు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ బీహార్, దాని పరిసర ప్రాంతాల నుంచి తెలంగాణ వరకు ఛత్తీస్‌గఢ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనపడిందని, రాష్ట్రంలో ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

వివిధ ప్రాంతాలలో నమోదైన ఉష్ణోగ్రతలు:

ప్రాంతం	నమోదైన ఉష్ణోగ్రత (డిగ్రీ సెంటిగ్రేడులలో)
ఆదిలాబాద్	31
భద్రాచలం	34
హన్మకొండ	31
హైదరాబాద్	32
ఖమ్మం	34
మహబూబ్‌నగర్	34
మెదక్	35
నిజామాబాద్	32
రామగుండం	32

ఐడీఎల్ కంపెనీలో పేలుడు

- ఒకరు మృతి.. నలుగురికి గాయాలు
- హైదరాబాద్‌లో ఘటన

హైదరాబాద్: కూకట్‌పల్లి ఐడీఎల్ కంపెనీలో డిటోనేటర్లను తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన ఏలేశ్వర వాసుదేవ శర్మ (62) ఐడీఎల్ కంపెనీలో ప్రెస్సింగ్ పని చేస్తుంటాడు. ఈ క్రమంలో డిటోనేటర్లను తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో వాసుదేవ శర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. మియాపూర్ జేపీ నగర్‌కు చెందిన గోరింకల పద్మారావు, వారాసిగూడకు చెందిన రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. హరికాంత్, నవీన్ కుమార్ అనే ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పేలుడుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని.. దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వాసుదేవ శర్మ కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.20 లక్షల నష్టపరిహారాన్ని ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది.

వాసుదేవశర్మ (ఫైల్)

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మారావు

బాధితులకు న్యాయం చేయాలి: నాయిని

ఐడీఎల్ కంపెనీలో పేలుడు విషయం తెలుసుకున్న మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి బాధితుల కుటుంబసభ్యులను పరామర్శించారు. వాసుదేవ శర్మ కుటుంబానికి కంపెనీ యాజమాన్యం నష్టపరిహారం ఇవ్వడంతోపాటు కుటుంబానికి భరోసా కల్పించాలని కోరారు.

శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య

రాజేంద్రనగర్: నార్సింగిలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ కళాశాలలో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన సంజీవ్‌కుమార్ (17) నార్సింగిలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్న భోజనం తర్వాత సంజీవ్‌కుమార్ మొదటి అంతస్తులోని తన రూమ్‌లోకి వెళ్లాడు. మిగతా విద్యార్థులంతా తరగతి గదులకు వెళ్లారు. మధ్యాహ్నం 4 గంటల సమయంలో సంజీవ్‌కుమార్ కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అతని రూమ్‌లోకి వెళ్లి చూడగా బ్లాంకెట్‌తో ఉరివేసుకొని కనిపించాడు. యాజమాన్యం నార్సింగి పోలీసులకు సమాచారం అందించింది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

'షేర్'కింగ్‌లూ.. జర జాగ్రత్త

సోషల్ మీడియాపై పోలీస్ నజర్

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో హింస చెలరేగిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సున్నిత, అతి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లకు ఆదేశాలు వెళ్లాయి. వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఇప్పటికే రాష్ట్ర పౌరులకు, మీడియా సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞప్తి చేశాయి. ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి అన్ని సోషల్ మీడియా వేదికలపై పోలీసులు నిఘా ఉంచారు. ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లేలా ఎలాంటి పోస్టులు పెట్టినా.. ఐపీ అడ్రస్ ద్వారా కనుక్కుని గంటల వ్యవధిలో అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అభ్యంతరకర సమాచారం, పోస్టులను తెలిసీ తెలియక షేర్ చేసినా నేరమేనని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టినా, షేర్ చేసినా తప్పేనని హెచ్చరిస్తున్నారు.

చర్యలేంటి?

- సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా కామెంట్లు చేస్తే.. ఐటీ యాక్ట్ సెక్షన్ 66(ఏ) ప్రకారం అరెస్టు చేసే వీలుంది.
- వ్యక్తుల పరువుకు భంగం వాటిల్లే పోస్టులు పెడితే.. ఐపీసీ 499 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేయవచ్చు.
- ఒక వ్యక్తిని లేదా సంస్థ ప్రతిష్టకు భంగం వాటిల్లేలా పోస్టులు పెడితే.. పరువు నష్టం దావా వేసే వీలుంది.

జెడ్పీలు, ఎంపీపీలకు నిధులొస్తున్నాయ్!

- గ్రామపంచాయతీలతో పాటు మూడంచెల్లో నిధుల సర్దుబాటు
- ఎంపీపీలకు 10, జెడ్పీలకు 5 శాతం ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం సిఫారసు
- రాష్ట్రాలకు తలసరి గ్రాంటు కేటాయింపులకు కేంద్రం ఆమోదం
- రాష్ట్రానికి రూ.1,847 కోట్లు కేటాయింపు.. గతేడాది కంటే రూ.396 కోట్లు అదనం
- దీనికి సమానంగా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థలకు శుభవార్త. నిధుల్లేమితో కొట్టుమిట్టాడుతున్న మండల, జిల్లా పరిషత్‌లకు ఈ ఏడాది నుంచి మనుగడలోకి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల్లో కొంత మేర వాటా దక్కనుంది. 2015–20 వరకు అమల్లో ఉన్న 14వ ఆర్థిక సంఘం గ్రామ పంచాయతీలకే నేరుగా నిధులు బదలాయించేది. కేంద్ర సర్కారు తాజా నిర్ణయంతో మండల, జిల్లా పరిషత్‌లకు ఊరట కలగనుంది. వాస్తవానికి 13వ ఆర్థిక సంఘం వరకు మూడంచెల వ్యవస్థలకు పంచాయతీ, మండల, జెడ్పీలకు నిర్దేశిత నిష్పత్తిలో నిధులను కేంద్రం విడుదల చేసింది. కేంద్రంలో నరేంద్రమోడీ సర్కారు అధికారంలోకి రాగానే ఈ విధానానికి మంగళం పాడింది. ఆర్థిక సంఘం నిధుల నుంచి మండల, జిల్లా పరిషత్‌లకు కోత విధించి.. 100 శాతం నిధులను పంచాయతీలకే బదలాయించింది.

మధ్యంతర నివేదిక ఆధారంగా..

15వ ఆర్థిక సంఘం ఇటీవల కేంద్రానికి మధ్యంతర నివేదిక అందజేసింది. ఈ సిఫార్సులకు అనుగుణంగా దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలకు ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.60,750 కోట్లు మంజూరు చేసిన కేంద్రం.. తెలంగాణకు రూ.1847 కోట్లు కేటాయించింది. ఈ లెక్కన రాష్ట్ర గ్రామీణ జనాభా 2.04 కోట్లలో ప్రతి వ్యక్తికి సాలీనా రూ.902.77 రానున్నాయి. ఈ నిధులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్ సర్దుబాటు చేయనుంది. ఆర్థిక సంఘం నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం (రాష్ట్ర ఆర్థిక సంఘం) కూడా నిధులను విడుదల చేస్తుందని సీఎం కేసీఆర్ ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరో రూ.1,847 కోట్లను రాష్ట్రం సర్దుబాటు చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.339 కోట్లను గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం గత ఆర్థిక సంఘం కంటే అధిక నిధులు తాజాగా కేటాయించినందున.. రాష్ట్ర ఖజానాకు కొంత వెసులుబాటు కలగనుంది.

గతేడాది కంటే ఎక్కువే

వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం గతేడాది కన్నా రూ.396 కోట్లు అధికంగా ఇవ్వనుంది. రూ.1874 కోట్లను రెండు విభాగాలుగా ఖర్చు పెట్టాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ సంజీవ్ పత్ జోషి.. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ఇటీవల రాసిన లేఖలో సూచించారు. గ్రామీణ స్థానిక సంస్థల్లోని తక్షణ అవసరాలకు ఖర్చు చేసేందుకు ఇందులో సగం నిధులను ఉపయోగించుకోవచ్చని, సిబ్బంది జీతభత్యాలకు మాత్రం ఈ నిధులు వెచ్చించొద్దని స్పష్టం చేశారు. మిగిలిన సగం నిధులు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, వాననీటి సంరక్షణ లాంటి పనుల కోసం ఉపయోగించాలని వెల్లడించారు. ఇక, గ్రామపంచాయతీలు, మండలపరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల వారీగా పరిశీలిస్తే మొత్తం నిధుల్లో కనిష్టంగా 70 శాతం, గరిష్టంగా 85 శాతం నిధులు గ్రామ పంచాయతీలకే కేటాయిస్తారు. మండల పరిషత్‌లకు అదే తరహాలో 10–25 శాతం, జిల్లా పరిషత్‌లకు 5–15 శాతం నిధులివ్వనున్నార